జ్ఞాన సిద్ధాంతం
రూ॥200/-
పేజీలు:210

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

దేశమంతటా వ్యాపించిన రుతుపవనాలు
సాధారణం కంటే ఒక రోజు ఆలస్యం

అయోధ్య విరాళాల కేసు 13న సుప్రీంకోర్టులో విచారణ 07

సంపుటి 29, సంచిక: 22 | శనివారం | 11-07-2026 | హైదరాబాద్
Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12 | వెల రూ. 5.00






## విద్యాసంస్థల బంద్ సక్సెస్

### రాష్ట్రవ్యాప్తంగా మూతపడిన పాఠశాలలు, కళాశాలలు

మంత్రుల నివాసాల ముట్టడి, విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జీలు... అరెస్టులు

- వేల సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు
- రెండేళ్లు పూర్తవుతున్నా విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రి లేకపోవడం సిగ్గుచేటు
- 'యంగ్ ఇండియా' పేరుతో ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు ఆపాలి
- సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తాం
- వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో విద్యారంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, పిడిఎస్‌యు, ఎఐడిఎస్‌ఓ, ఎఐఎఫ్‌డిఎస్, ఎఐఎస్‌బి, ఎఐపిఎస్‌యు సంఘాల పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు పెద్ద ఎత్తున బంద్‌లో పాల్గొన్నారు. బంద్‌కు మద్దతుగా విద్యాసంస్థలు స్వచ్ఛందంగా తమ పాఠశాలలకు, కాలేజీలకు సెలవు ప్రకటించాయి. పలు విద్యా సంస్థల్లో విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాలలో విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీలు, ధర్నాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. విద్యారంగ సమస్యల పరిష్కరించాలని విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రుల నివాస సముదాయాన్ని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు ముట్టడించడంతో కాసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శాంతియుతంగా నిరసన తరువాయి 8లో

## మేడిగడ్డను నింపితే
# భద్రాచలం మునకే



- డీలిమిటేషన్ తప్పదు
- కాంగ్రెస్ విజయం తథ్యం
- బ్యాండ్ మేళం సర్వేలు నిజం కావు
- 117 సీట్లతో రెండోసారి అధికారంలోకి వస్తాం
- సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం అగ్రగామి
- ఖమ్మం సభలో సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/ఖమ్మం

బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టును నింపితే భద్రాచలం సహా 24 గ్రామాలు మునిగిపోక తప్పదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మేడిగడ్డ నిర్మాణంలో డొల్లతనం బయటపడిందని ప్రాజెక్టుల పేరుతో బిఆర్‌ఎస్ పార్టీ భారీ అవినీతికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుకున్నట్లుగానే డి లిమిటేషన్ వస్తుందని దానితో పాటే రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని రేవంత్ రెడ్డి తెలిపారు. పార్లమెంటుల మెజార్టీ సాధించేందుకు బిజెపి రాజకీయ పార్టీలను చీలుస్తుందని, డిలిమిటేషన్‌తో రాష్ట్రంలో శాసనసభ, పార్లమెంటు స్థానాలు పెరుగుతాయని శాసన సభ స్థానాలు 182కు పెరుగుతాయని పార్లమెంట్ స్థానాలు 26కు పెరుగుతాయని వీటిలో 117 అసెంబ్లీ స్థానాల్లోనూ, 20 పార్లమెంట్ స్థానాల్లోనూ విజయం సాధించి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారని ఆయన తెలిపారు. శుక్రవారం రైతు ఆశీర్వాద సభ పేరుతో ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయంగా పాలమూరు జన్మనిస్తే అధికార ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయలా నిలిచిందన్నారు. 2023 జులైలో భట్టి పాదయాత్ర ముగింపు సభ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరిక దానికి రాహుల్ గాంధీ హాజరు కావడం రాజకీయ చరిత్రలో నిలిచిపోయిందని కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణమైందన్నారు. సరిగ్గా 36 నెలల తర్వాత జరుగుతున్న ఈ సభ ఇక ఖమ్మం జిల్లాలో బిఆర్‌ఎస్‌కు అవకాశం లేదని తేల్చి చెప్పిందని ఈ సభకు హాజరైన ప్రజలే ఇందుకు సాక్ష్యమన్నారు. 2023లో ఎన్నికలకు ముందే కాంగ్రెస్ గెలుస్తుందని చెప్పానని 65 స్థానాలు వస్తాయని చెప్పానని ఇప్పుడు కూడా నేను చెప్పిందే జరుగుతుందని రేవంత్ స్పష్టం చేశారు. పార్లమెంట్, మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లోనూ ప్రజా తీర్పు తరువాయి 8లో

## రాష్ట్రంలో 'అనామలీస్' ఓటర్లు 89 లక్షల మంది

### త్వరలోనే వారికి నోటీసులు

- ఎస్ఐఆర్ గడువు పొడిగింపు నిర్ణయం కేంద్ర ఎన్నికల సంఘానిదే
- ఉద్దేశపూర్వకంగా తప్పుడు వివరాలిచ్చి రెండు చోట్ల ఓటు ఉంటే ఏడాది జైలు శిక్ష లేదా జరిమానా
- అర్హులైన ఓటర్ల తొలగింపు జరగదు
- ఓటర్ల సవరణపై అపోహలు వద్దు
- నమోదు ఫారాల సమర్పణ తప్పనిసరి
- ఎస్‌సిఇఒ సుదర్శన్ రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో అక్షర దోషాలు, తప్పుడు వివరాలు ఉన్న 'అనామలీస్' ఓటర్లు 89 లక్షల మందిని ఎన్నికల కమిషన్ (ఈసిఐ) గుర్తించిందని, త్వరలోనే వారికి నోటీసులు ఇస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఎస్ఐఆర్ గడువు పొడిగింపు అనేది తమ పరిధిలో లేని అంశమని, దీనిపై తుది నిర్ణయం కేంద్ర ఎన్నికల సంఘానిదేనని స్పష్టం చేశారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి పాల్గొని, మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్ట్ మల్లేపల్లి లక్ష్మయ్య సమన్వయకర్తగా వ్యవహరించారు.ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ డెమోగ్రాఫిక్ ఐడెంటిటీ అప్లికేషన్‌లు (డిఎస్‌ఏ) సాఫ్ట్‌వేర్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా దేశవ్యాప్తంగా ఒకే వ్యక్తికి రెండు ఓట్లు (డూప్లికేట్ ఎంట్రీలు) ఉన్నట్లు గుర్తిస్తే, సదరు ఓటరుకు నచ్చిన నియోజకవర్గాన్ని ఎంచుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా ఉద్దేశపూర్వకంగా తప్పుడు వివరాలు ఇచ్చి, రెండు చోట్ల తరువాయి 8లో



03 జర్మన్ పెట్టుబడులకు తెలంగాణే గమ్యం

బిజెపి మహిళా వ్యతిరేకి
కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే విమర్శ 07

## 'ఉపా' చట్టం రద్దు కోసం ఐక్య ఉద్యమాలు

- ప్రశ్నించే గొంతుకలపై ఉక్కుపాదం మోపే కుట్రలు తిప్పికొట్టాలి
- ప్రశ్న రావణ్‌పై 'ఉపా' కేసు ఉపసంహరించాలి
- ఎపి సిపిఐ రౌండ్‌టేబుల్ సమావేశంలో విపక్షాల నేతలు

**విజయవాడ :** ప్రశ్న యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు ప్రశ్న రావణ్‌పై మోపిన ఉపా చట్టం కేసు తక్షణమే ఉపసంహరించాలని సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేసే ప్రయత్నం జరుగుతోందని, ప్రశ్నించేవారిపైన, విమర్శించేవారిపైన కేసులు మోపుతూ కూటమి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందని, ఇటీవల కాలంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా అనేక పరిణామాలు జరగడంపై సమావేశంలో విపక్షాల నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష, వైసిపి, తరువాయి 12లో







కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా (సిపిసి) 105వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని న్యూఢిల్లీలో చైనా రాయబార కార్యాలయం భారత వామపక్ష నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. భారత్‌లో చైనా రాయబారి జూ ఫిహాంగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.బేబి, సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొన్నారు.

## ఇథనాల్ కలిపిన పెట్రోల్‌తో మైలేజీ తగ్గుతుంది!

### అంగీకరించిన కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ




**న్యూఢిల్లీ :** పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మిశ్రమం (ఇ 20) వాడటం వల్ల కొన్ని వాహనాల్లో మైలేజ్ 3 నుంచి 5 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని కేంద్ర పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ అంగీకరించింది. అయితే ఈ స్వల్ప నష్టాన్ని మించి 'ఇ 20' ఇంధనం అనేక ప్రయోజనాలను అందిస్తుందని స్పష్టం చేసింది. ఇటీవల 'ఇ 20'పై వస్తున్న విమర్శలకు సమాధానంగా మంత్రిత్వ శాఖ ప్రశ్నలు—సమాధానాల రూపంలో వివరణాత్మక పత్రాన్ని విడుదల చేసింది. మంత్రిత్వ శాఖ ప్రకారం, 'ఇ 20' సాధారణ పెట్రోల్ లేదా 'ఇ 10'కంటే పరిశుభ్రమైన, మెరుగైన నాణ్యత కలిగిన ఇంధనం. ఇందులో ఆక్టేన్ విలువ ఎక్కువగా ఉండటం వల్ల తరువాయి 8లో

'ఇ 20'తో వాహనాలు దెబ్బతినే ప్రమాదం! 07

## గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో హరీశ్‌రావు పదేళ్లు మంత్రిగా ఏం చేశారు?

- మళ్లీ మూడు నెలలు ఎందుకు అవకాశమివ్వాలి
- కాంగ్రెస్‌లోకి వస్తానంటే చర్చించి నిర్ణయం తీసుకుంటాం

టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ పార్టీలోకి వస్తానంటే, తమ రాజకీయ వ్యవహారాల కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో హరీశ్‌రావు పదేళ్లు మంత్రిగా పని చేసి ఏం చేశారని, మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వంలో మూడు నెలలు పాటు మంత్రిగా ఎందుకు అవకాశమివ్వాలని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ పాలనలో సామాన్య ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వపాలన బాగుందనే ప్రజలు తమను ఆదరిస్తున్నారని, ఇతర రాజకీయ పార్టీలు తలుపులు తెరిచినా, మూసినా ఏం ఉపయోగం లేదని చెప్పారు. బిఆర్‌ఎస్ వద్ద ఉన్న రూ.1400 కోట్ల నిధుల విషయంలో కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలో వాస్తవం ఉన్నదని, ఆ నిధులు ఎలా వచ్చాయో బిఆర్‌ఎస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నీళ్ల దోపిడీ జరిగినప్పుడు ఈటల రాజేందర్ బిఆర్‌ఎస్‌లోనే ఉన్నారని, ఆర్థిక శాఖ మంత్రిగా కూడా పని చేశారని గుర్తు చేశారు. ప్రజల సొత్తును తరువాయి 8లో



## గోల్కొండ బోనాలకు సర్వం సిద్ధం చేయాలి

- ఈనెల 16 నుంచి ఆగస్టు 13 వరకు ఉత్సవాలు
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి : మంత్రి కొండా సురేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

గోల్కొండ జగదాంబికా మహంకాళి అమ్మవారి ఆషాడ బోనాల ఉత్సవాలకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ బోనాలు తెలంగాణ తరువాయి 8లో

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
11-07-2026
www.prajapaksham.in



# కేంద్రానికి ఖరీఫ్ పరీక్ష

ఎల్ నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఈ ఏడాది కరువు పరిస్థితులు నెలకొనే అవకాశమున్నట్లు శాస్త్రజ్ఞులు గత కొద్ది కాలంగా హెచ్చరిస్తున్నా. అయితే, గడిచిన రెండు మాసాలలో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ మాసంలో 40 శాతం లోటు వర్షపాతం నమోదవ్వగా, జులై తొలి వారం రోజులలో సాధారణం కంటే 42 శాతం అధిక వర్షాలు నమోదయ్యాయి. ఇలాంటి పరిస్థితులు దేశం ఎదుట బహుళ సవాళ్ళను విసురుతున్నాయి. అలాగే కేంద్ర ప్రభుత్వ సన్నద్ధతకు పరీక్షగా నిలవనున్నాయి.

దేశవ్యాప్తంగా జులై 1 నుంచి 8వ తేదీ వరకు భారతదేశంలో 9.2 సెంటీమీటర్ల సగటు వర్షం కురిసింది. ఇది సాధారణంగా నమోదయ్యే 6.5 సెంటీమీటర్లకంటే ఎక్కువే. 1901 నుంచి చూసినట్లయితే, ఐదవ సారి మాత్రమే జూన్ మాసంలో లోటు వర్షపాతం నమోదైంది. జూన్ లోటును, జులై ఆరంభంలో అధిక వర్షపాతానికి కలిపినట్లయితే మొత్తం లోటు 15.2 శాతానికి తగ్గింది. గతంలోని వివిధ కాలాలలో పరిశీలించినట్లయితే, 1971– 2020 నడుమ జూన్ 1 నుంచి జులై 8 వరకు సగటు వర్షపాతం 19.5 సెంటీమీటర్లు. అయితే ఈసారి కూడా అది 19.5 సెంటీమీటర్లే. ఇది పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది.

వాయువ్య, మధ్య, పశ్చిమ భారతదేశంలో అధిక వర్షాలు కురిసాయి. పడిన వర్షాలు కూడా ఎక్కువగా ముంబై, ఢిల్లీ, గుర్‌గావ్ వంటి నగర ప్రాంతాలలో ఎక్కువగా నమోదైన కారణంగా ఎక్కువ ప్రయోజనకారి కావు. ఆ నగరాలలో సరైన మౌలిక సదుపాయాలు లేక అనేక ప్రాంతాలు నీటి మునిగిన ఘటనలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందుచూపు రాహిత్యాన్ని, సన్నద్ధత లోపాలను ఎత్తి చూపాయి. పలు చోట్ల జనజీవన స్థంభించింది. తూర్పు, ఈశాన్య, కొన్ని మధ్య భారత ప్రాంతాలు లోటు వర్షపాతాన్ని ఎదుర్కొంటున్నాయి. దక్షిణ ద్వీపకల్పంలో నైరుతి రుతుపవనాలు మందకొడిగా ప్రారంభమయ్యాయి. జూన్ 1 నుండి జులై 8 మధ్య దక్షిణ ద్వీపకల్ప ప్రాంతంలో మొత్తం వర్షపాతం సాధారణం కంటే సుమారు 19 శాతం తక్కువగా నమోదైంది. ఈ సారి రుతుపవనాలు ఆలస్యంగా జూన్ 4న ప్రారంభమమై, నెమ్మదిగా కదులుతున్నాయి. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవని ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై పడింది. తెలంగాణలో జూలై ఆరంభంలో విస్తారంగా స్వల్ప వర్షాలు కురిసినప్పటికీ, ఆ తర్వాత రాష్ట్రంలో రుతుపవనాల పురోగతి బలహీనపడి, పొడి వాతావరణం నెలకొంది. జూన్ – జులై మాసాలలో సాధారణంగా నమోదయ్యే సగటు వర్షపాతం 18.5 సెంటీమీటర్ల కంటే తక్కువగా 15.6 సెంటీమీటర్లు మాత్రమే నమోదైంది.

లోటు వర్షపాతంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. పలు చోట్ల ఆలస్యంగా పంటలు వేయడం, వేసిన నాట్లు, విత్తనాలు ఎండిపోతున్న ప్రమాద సంకేతాలను సూచిస్తూ వార్తలు వస్తున్నాయి. పట్టణ, నగర ప్రాంతాలలో నీటి ఎద్దడి నెలకొంటున్నది. అప్పుడే ట్యాంకర్‌ల ద్వారా నీటి సరఫరా చేయాల్సిన పరిస్థితులు తలెత్తాయి. కేంద్ర వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం జులై 8వ తేదీ నాటికి 350.58 లక్షల హెక్టార్‌లలో వానాకాలం సాగు జరిగింది. రుతుపవనాలు ఆలస్యమైన ప్రభావం పత్తి, సోయాబీన్‌ల సాగుపై పడింది. అలాగే ప్రభుత్వాలు వర్షాధార పంటలను నిరుత్సాహపరుస్తూ జొన్నలు, మొక్కజొన్నలు, పెసలు, రాగులు, సజ్జలు, కందులు, మినుములు వంటి ఆరుతడి పంటలు వేయాలని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం సైతం వరి కంటే మెట్ట పంటలకే ప్రాధాన్యత నివ్వాలని పెద్ద ఎత్తున ప్రచారం చేసింది.

ఎల్ నినో కారణంగా నైరుతి రుతుపవనాలు మందగమనంతో నెలకొన్న అస్థిర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర సన్నద్ధతతో ఉన్నట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పినప్పటికీ, ఆచరణ ఎంత వరకో చూడవలసి ఉంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, కర్నాటక, బిహార్, జార్ఖండ్, బిహార్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఒడిషాలో పరిస్థితులను కేంద్రం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నది. జులై మాసంలో తొలినాళ్ళ మాదిరిగానే వర్షాలు పుంజుకొని ఖరీఫ్‌కు ఊపునిస్తుందని వ్యవసాయ శాఖ ఆశాభావంతో ఉంది. భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐకార్) సహకారంతో కరువు పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న జిల్లాల వివరాలతో కూడిన కంటింజెన్సీ ప్లాన్‌లను రాష్ట్రాలకు ఏప్రిల్‌లోనే పంపి, సన్నద్ధం కావాలని రాష్ట్రాలను అప్రమత్తం చేసినట్లు కేంద్రం చెబుతోంది.

తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులలో రైతులకు ఆర్థిక రక్షణ కల్పించేందుకు 'ప్రధాన మంత్రి పంట బీమా పథకం'లో రైతుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి చౌహాన్ వెల్లడించారు. ఎల్ నినో దృష్ట్యా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి విస్తృత యంత్రాంగం అందుబాటులో ఉంచామని, ఎల్‌నినో మానిటరింగ్ సెల్, క్రాప్ వెదర్ వాచ్ గ్రూప్, రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్‌లు, ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. వానాకాలం పంటలకు సంబంధించి రైతులకు అన్ని రకాల సహకారం అందించేందుకు కేంద్రం సర్వ సన్నద్ధంగా ఉన్నట్లు చెబుతున్న మాటల్లో నిజమెంతో భవిష్యత్తులో తెలుస్తుంది. నిజానికి రైతులకు ఇంతకంటే ఎక్కువ భరోసా అవసరం. ప్రభుత్వాలు చెబుతున్న మాటలు ఆచరణలో ఎంత వరకు అమలు అవుతున్నాయనే దానిపై చిత్తశుద్ధి ఆధారపడి ఉంటుంది. ఎప్పటికప్పుడు పరిస్థితులను ఉజ్జాయింపుగా చూస్తూ, కర్షకులకు కావాల్సిన సహకారాన్ని సకాలంలో అందించగలిగితే, నష్టాలను నివారించవచ్చు. మొత్తానికి ప్రస్తుత ఖరీఫ్ ప్రభుత్వాలకు, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వానికీ పరీక్షా కాలమే! ●




## నేను పోటీ చేయను...

**'బాంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం (బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాజీనామా చేసిన స్థానం) ఉప ఎన్నికకు సంబంధించి ఎన్‌డిఎ తరపు అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ నన్ను ఎంపిక చేసింది. కేంద్ర, రాష్ట్ర నాయకత్వానికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అయితే, కుటుంబ కారణాల రీత్యా నేను ఈ శాసనసభ ఉప ఎన్నికలో పోటీ చేయలేకపోతున్నానని మీకు వినమ్రంగా తెలియజేస్తున్నాను. ఇకపైనా ఒక పార్టీ కార్యకర్తగా నేను నిబద్ధతతో సేవలు కొనసాగిస్తాను.'**

– నామినేషన్ గడువుకు 24 గంటల ముందు తప్పుకున్న బిజెపి అభ్యర్థి అభిషేక్ కుమార్

# నైపుణ్య యువతే దేశ భవిత!




నేడు ప్రపంచ జనాభా దాదాపు 8.2 బిలియన్లు లేదా 820కోట్లు చేరింది. 1800ల్లో ప్రపంచ జనాభా 1బిలియన్ ఉండగా, 1987లో 5 బిలియన్ల మార్కు దాటడం, 2011లో 7 బిలియన్లు చేరడం చూసాం. 2026లో ప్రపంచ జనాభా 8.3 బిలియన్లకు చేరడం, 2030 నాటికి 8.5 బిలియన్లకు పెరగడం, 2050 నాటికి 9.7 బిలియన్లు కావచ్చని అంచనా వేస్తున్నారు. 2050 నాటికి ప్రపంచ జనాభాలో 66 శాతం వరకు పట్టణ జనాభా మాత్రమే ఉండవచ్చు. నేడు భారత జనాభా 1.464 బిలియన్లు లేదా 146.4 కోట్లు చేరి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాల జాబితాలో వరుసగా భారత్ (146.4 కోట్లు), చైనా(141.6 కోట్లు), అమెరికా(34.7 కోట్లు), ఇండోనేషియా(28.6 కోట్లు), పాకిస్థాన్(25.5 కోట్లు), నైజీరియా(23.8కోట్లు), బ్రెజిల్(21.3కోట్లు), బంగ్లాదేశ్(17.6కోట్లు), రష్యా(14.4కోట్లు), ఇథియోపియా(13.6 కోట్లు) దేశాలు ఉన్నాయి. రాష్ట్రాల జాబితాలో 3.85 కోట్ల జనాభాతో 12వ స్థానం లో తెలంగాణ నిలిచింది. తెలంగాణలోని 33 జిల్లాల్లో హైదరాబాద్ జిల్లా 39 లక్షలతో, ఎపిలోని 26 జిల్లాల్లో తూర్పు గోదావరి జిల్లా 51 లక్షలతో ముందు ఉన్నాయి.

**ప్రపంచ జనాభా దినం–2026 ఇతివృత్తం:**

11 జూలై 1987 రోజున ప్రపంచ జనాభా 500 కోట్ల లేదా 5 బిలియన్ల మార్కు చేరడానికి (ఐదు బిలియన్ల దినం లేదా ఫైవ్ బిలియన్ డే) గుర్తుగా ప్రతి ఏట 11 జూలై రోజున ఐరాస సభ్య దేశాలు ప్రపంచ లేదా అంతర్జాతీయ జనాభా దినోత్సవం జరుపుకోవాలని 1990లో ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానించారు. ఈ రోజున ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదలతో సంబంధం ఉన్న పలు సవాళ్లు, అవకాశాలను చర్చించడం, జనాభా పట్ల కనీస అవగాహన కల్పించడం, జనాభా ఒక మానవ వనరుగా తీర్చిదిద్దుకోవడం, సుస్థిరాభివృద్ధికి బాటలు వేయడం, ప్రజారోగ్యం పట్ల చర్యలు తీసుకోవడం, మానవాళి శ్రేయస్సుకు దోహదపడడం లాంటి అంశాలను చర్చించడం జరుగుతుంది. ప్రపంచ జనాభా దినోత్సవం 2026 ఇతివృత్తంగా యువత ఆశలు, ఆకాంక్షలు సాకారం చేయడం నేడు మరియు భవిష్యత్తు కోసం అనబడే అంశాన్ని తీసుకొని యువశక్తి ప్రాధాన్యాన్ని గుర్తించడం, పునరుత్పత్తి హక్కులను కల్పించడం, లింగ సమానత్వ సాధన, మాతాశిశు ఆరోగ్యం, పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ యువతను శక్తివంతులుగా/నైపుణ్య విద్య కలిగిన వారుగా మార్చడం లాంటి విషయాలను అవగాహన పరచడం జరుగుతుంది.

**ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాలు:** జనాభా పెరుగుదలతో సుస్థిరాభివృద్ధి సాధించడం, వనరుల నిర్వహణ, జనాభా పెరుగుదలను నియంత్రించడం లాంటి చర్యలు నిరంతరం కొనసాగాలి. ప్రభుత్వాలు, పౌర సమాజం చేయిచేయి కలిపి నాణ్యమైన నైపుణ్యతతో కూడిన విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉద్యోగాల కల్పన, కుటుంబ నియంత్రణ లాంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రచించి, అమలుకు పూనుకోవాలి. ఆర్థిక అస్థిరత, వాతావరణ ప్రతికూల మార్పులు, జనాభా మార్పులను అధ్యయనం చేసుకుంటూ జనాభాను ఒక సంపదగా భావిస్తూ అడుగులు ముందుకు వేయాలి. ప్రపంచ జనాభా దినం వేదికగా విద్యాలయాల్లో జనాభాకు సంబంధించిన పోటీలను నిర్వహించడం, ఉపన్యాసాలు, చర్చలు, సెమినార్లు, సాంస్కృతిక ప్రదర్శనలు, వైద్య శిబిరాలు, యువజన కార్యక్రమాలు, అధిక జనాభా వల్ల ఎదురయ్యే సవాళ్లు, పలు దేశాల మధ్య సమన్వయంతో మేలుచేసే కార్యక్రమాలు నిర్వహించపచ్చు. ప్రపంచ జనాభా దినం మనకు ఒక హెచ్చరిక కావాలి. మన జనాభా మన శక్తిగా మారాలి. యువతకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాలకు కూడా సమాంతరంగా ప్రాధాన్యం ఇవ్వాలి. నైపుణ్య విద్యలేని మన యువ జనాభా ఒక శాపంగా మారుతుంది. యువశక్తి నిర్వీర్యం అయితే దేశాభివృద్ధి కుంటుపడుతుంది. మనకు మాత్రమే అపూర్వ ఆస్తిగా ఉన్న జనాభా భారతమాత సుస్థిరాభివృద్ధికి రాచబాటలు వేయాలి.

**(11 జులై ప్రపంచ లేదా అంతర్జాతీయ జనాభా దినోత్సవం సందర్భంగా)**

**ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# యూట్యూబర్ 'ప్రశ్న' రావణ్‌పై నిరంకుశ 'ఉప' కేసు!

యూట్యూబర్ రావణ్‌పై 'ఉప' చట్టం (చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం)కింద కేసు నమోదు చేయడంతో మరోసారి 'ఉప' చట్టం అమలు తీరు చర్చకు దారితీసింది. యూ ట్యూబర్ రావణ్‌పై ఉప చట్టంలోని సెక్షన్ 13, 39 కింద కేసు నమోదు చేసి 14 రోజుల రిమాండ్‌కు తరలించడం దారుణం, చట్ట దుర్వినియోగం. గతంలో 'ఉప' చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన పౌరహక్కుల సంఘం నేత జి.ఎన్.సాయిబాబా దాదాపు పదేళ్లకు పైగా జైలు జీవితం గడిపారు. ఆయన కేసుతో 'ఉప' చట్టం అమలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. దేశ సార్వభౌమాధికారం, సమగ్రతకు విఘాతం కలిగించే చట్టవిరుద్ధ, తీవ్రవాద కార్యకలాపాలను నిరోధించేందు కు 1967లో రూపొందించిన "చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం" (యుఎపిఎ) ఒక సాధారణ యూట్యూబర్ పై ప్రయోగించడం మరోసారి ప్రజా చర్చలో నిలిచింది. ముఖ్యంగా బెయిల్ నిబంధనలు, విచారణ కాలం, నిందితుల హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛ, జాతీయ భద్రత మధ్య సమతుల్యతపై న్యాయవర్గాలు, మానవ హక్కుల సంస్థలు, రాజకీయ విశ్లేషకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఉప కేసులలో దర్యాప్తు సంస్థల వైఖరి వల్ల నిందితులకు బెయిల్ దాదాపు అసాధ్యమని, విచారణే శిక్షగా మారుతోందని ఆవేదన వ్యక్తమవుతున్నది. నిందితులు ఏళ్ల తరబడి జైలు జీవితం అనుభవించిన అనంతరం చివరకు వారు నిర్దోషులుగా విడుదలైన ఘటనలు ఎన్నో ఉన్నాయని పేర్కొంటున్నారు. అయితే దేశ భద్రతకు 'ఉప' చట్టం అవసరమని పాలకులు, దర్యాప్తు సంస్థలు వాదిస్తుండగా, దుర్వినియోగమవుతోందని పౌరహక్కుల సంఘాలు, మేధావులు, ప్రముఖులు, ఈ కేసులలోని బాధితులు, వారి బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూట్యూబర్ రావణ్ కేసులో ఆరోపణలు, వాటికి సంబంధించిన ఆధారాలు, చట్టపరమైన అంశాలపై తుది నిర్ణయం సంబంధిత న్యాయస్థానం విచారణ అనంతరం వెలువడనుంది. అయితే ఈ కేసుద్వారా జాతీయ భద్రతకు సంబంధించిన కఠిన చట్టాల అమలు, వ్యక్తిగత స్వేచ్ఛ, న్యాయ ప్రక్రియ, భావ ప్రకటనా హక్కుల మధ్య సమతుల్యతపై మరోసారి విస్తృత చర్చ తలెత్తింది.

**ఉప అంటే ఏమిటి?**

1967లో అమల్లోకి వచ్చిన "చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం" (ఉప) చట్టాన్ని కాలక్రమంలో పాలకులు పలు మార్లు సవరించారు. ముఖ్యంగా 2004, 2008, 2012, 2019 సవరణలతో దీనిని మరింత కఠినతరం చేశారు. ఉగ్రవాద సంస్థలను మాత్రమే కాకుండా, కొన్ని పరిస్థితుల్లో వ్యక్తులను కూడా 'ఉగ్రవాదులు'గా ప్రకటించే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి కల్పించారు.

దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రతకు ముప్పుగా భావించే కార్యకలాపాలపై ఈ చట్టం వర్తిస్తుంది.

**అరెస్టులు ఘనం... శిక్షలు స్వల్పం**

దేశవ్యాప్తంగా ఉప చట్టం కింద నమోదవుతున్న కేసులు, అరెస్టులు, శిక్షలపై నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) పార్లమెంట్‌కు సమర్పించిన గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం సుమారు 1,300 నుంచి 3,000 మంది వరకు 'ఉప' చట్టం కింద అరెస్టవుతున్నారు. 2019 నుంచి ఇప్పటివరకు 11వేల మంది అరెస్ట్ కాగా కేవలం 335 మందికి మాత్రమే శిక్ష పడింది. అయితే కోర్టుల్లో తుది విచారణ పూర్తయి శిక్ష పడుతున్న వారి శాతం 2 నుంచి 6 శాతం మధ్యే ఉందని, సగటు శిక్ష కాలం 3.2 శాతం మాత్రమే ఉందని గణాంకాలు సూచిస్తున్నాయి. మిగిలిన కేసుల్లో చాలావరకు విచారణలు కొనసాగుతుండగా, కొన్ని కేసుల్లో నిందితులు నిర్దోషులుగా విడుదల వుతున్నారు.



**పార్లమెంట్‌కు (ఎన్‌సిఆర్‌బి) సమర్పించిన గణాంకాలు**

| సంవత్సరం | అరెస్టులు | శిక్షపడిన వారు | శిక్ష శాతం (సుమారు) |
|---|---|---|---|
| 2019 | 1,948 | 34 | 1.7 |
| 2020 | 1,321 | 80 | 6.0 |
| 2021 | 1,621 | 62 | 3.8 |
| 2022 | 2,636 | 41 | 1.5 |
| 2023 | 2,914 | 118 | 4.0 |

**బెయిల్ ఎందుకు కష్టమవుతుంది?**

'ఉప' చట్టంలోని సెక్షన్ 43డి (5) ఈ చట్టంలో అత్యంత కీలకమైన నిబంధనగా పరిగణించబడుతుంది. ప్రాథమికంగా ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాల ప్రకారం కేసులో ఆరోపణలకు మొదటి చూపులో బలం ఉందని కోర్టు భావిస్తే బెయిల్ మంజూరు చేయకుండా ఉండే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో విచారణ పూర్తికాకముందే నిందితులు నెలలు, కొన్ని సందర్భాల్లో సంవత్సరాలపాటు జైలులో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

**విచారణే శిక్షగా మారుతోందా?**

'ఉప' పై విమర్శకులు ప్రధానంగా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. కేసు నమోదైన అనంతరం దీర్ఘకాలం నిర్బంధంలో ఉండా ల్సి రావడం, విచారణ ఆలస్యం కావడం వల్ల చివరకు నిర్దోషిగా విడుదలైనా అప్పటికే ఎన్నో సంవత్సరాలు జైలులో గడిచిపోతున్నాయని అంటున్నారు. మరోవైపు దర్యాప్తు సంస్థలు మాత్రం సంక్లిష్ట ఉగ్రవాద కేసుల్లో విస్తృత దర్యాప్తు కోసం ఎక్కువ సమయం అవసరమని వాదిస్తున్నాయి.

**కోర్టులు ఏమంటున్నాయి?**

పలు తీర్పుల్లో వ్యక్తిగత స్వేచ్ఛ రాజ్యాంగ హక్కు అని పేర్కొన్నప్పటికీ, 'ఉప' చట్టంలోని ప్రత్యేక నిబంధన ల కారణంగా బెయిల్ విషయంలో సాధారణ క్రిమినల్ చట్టాలకు భిన్నమైన ప్రమాణాలు అమలవుతున్నాయి. గతంలో కేసులో కేవలం సాహిత్యం లేదా సమాచారం కలిగి ఉండటం మాత్రమే నేరానికి ఆధారం కాదని, చట్టవ్యతిరేక కార్యకలాపాలతో ప్రత్యక్ష సంబంధం నిరూపించాల్సి ఉంటుందని న్యాయస్థానం |వ్యాఖ్యానించింది.

**ఏళ్ల తరబడి జైలులో ఉన్న ప్రముఖుల ఉదాహరణలు**

ఉప చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన పౌరహక్కుల సంఘం నేత జి.ఎన్.సాయిబాబా ఏళ్ల తరబడి వివిధ దశల్లో జైలు జీవితం గడిపారు. ఆయన కేసు 'ఉప' చట్టం అమలు పై దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఉప కింద అరెస్టై సుమారు రెండేళ్లకు పైగా జైలులో ఉన్న తర్వాత ఆరోగ్య కారణాలతో బెయిల్ పొందారు. 2020 ఢిల్లీ అల్లర్ల కుట్ర కేసులో 'ఉప' చట్టం కింద అరెస్టు చేసి అనేక సంవత్సరాలుగా విచారణ కొనసాగిస్తూ జైలులో ఉంచారు. ఆయన బెయిల్ పిటిషన్లు పలుమార్లు న్యాయస్థానాల్లో విచారణకు వచ్చాయి. భీమా కోరేగావ్ కేసులో మూడేళ్లకు పైగా జైలులో ఉండి అనంతరం డిఫాల్ట్ బెయిల్ పొందారు. 'ఉప' కేసులో రెండేళ్లకు పైగా నిర్బంధంలో ఉండి తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గృహ నిర్బంధం, అనంతరం బెయిల్ పొందారు.

**విమర్శలు–ప్రభుత్వం, దర్యాప్తుల వాదన**

దేశంలో పాలకులు కొన్ని సందర్భాలలో తమతో విభేదించే వారి భిన్నాభిప్రాయాలను, వ్యతిరేకులను అణచివేయడానికి ఉప చట్టాన్ని ఉపయోగిస్తున్నారని పౌరహక్కుల సంఘాలు, కొంతమంది న్యాయవాదులు, మేధావులు విమర్శిస్తున్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ, వ్యక్తిగత హక్కులకు భంగం కలుగుతోందని అంటున్నారు.

అయితే కేంద్ర ప్రభుత్వం, భద్రతా సంస్థలు ఈ ఆరోపణలను ఖండిస్తూ, దేశ భద్రత, ఉగ్రవాద నిరోధానికి ఉప అత్యంత కీలకమైన చట్టమని, ఉగ్రవాద నిధులు, కుట్రలు, దేశ వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు దీనివల్ల దర్యాప్తు సంస్థలకు అవసరమైన చట్టపరమైన అధికారాలు లభిస్తున్నాయని చెబుతున్నాయి.

**ఇ.చంద్రశేఖర్**

# విద్యా హక్కు అందని ద్రాక్షే!

సమాజంలో అసమానతలను తగ్గించే అత్యంత శక్తివంతమైన ఆయుధం కూడా విద్యే. అందుకే భారత రాజ్యాంగం విద్యను ప్రతి చిన్నారి ప్రాథమిక హక్కుగా గుర్తించింది. ఈ ఆలోచనకు చట్టబద్ధ రూపం కల్పిస్తూ 2009లో ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం తీసుకొచ్చారు. 2010 ఏప్రిల్ 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన ఈ చట్టం..విద్యను సంక్షేమ కార్యక్రమం నుండి హక్కుస్థాయికి తీసుకెళ్లింది. అయితే చట్టం అమలులోకి వచ్చి పదిహేనేళ్లు దాటినా తెలంగాణ రాష్ట్రంలో దాని అమలుపై ఇంకా ప్రశ్నలు వినిపిస్తూనే ఉన్నాయి.

ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలల్లో పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు 25శాతం సీట్లు కేటాయించాల్సిన నిబంధన పూర్తిస్థాయిలో అమలవుతుందా లేక కేవలం ప్రభుత్వ ప్రకటనలకే పరిమితమైందా అన్న చర్చ కొనసాగుతోంది.

**విద్యా హక్కు చట్టం అంటే ఏమిటి?**

విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ భారత రాజ్యాంగంలోని 21ఏ అధికరణం ప్రకారం 6 నుంచి 14 ఏళ్ల వయస్సు గల ప్రతి ఒక్కరికి ఉచిత, నిర్బంధ విద్య కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాల పై ఉంది. ఈ చట్టం ప్రకారం ప్రతి చిన్నారికి ఉచిత విద్య అందాలి. ప్రవేశ పరీక్షలు, ఇంటర్వ్యూలు నిషేధం, పిల్లలను మధ్యలో పాఠశాల నుండి తొలగించరాదు. ప్రతి పాఠశాలలో కనీస మౌలిక వసతులు ఉండాలి. ఉపాధ్యాయుల కొరత ఉండకూడదు. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25% సీట్లు పేద పిల్లలకు కేటాయించాలి. ఈ 25% కోటానే ప్రస్తుతం తెలంగాణలో ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

ఒకపేద కుటుంబానికి చెందిన బాలుడు, సంపన్న కుటుంబానికి చెందిన బాలుడితో కలిసి ఒకే తరగతి గదిలో చదివే అవకాశం కల్పించడమే విద్యా హక్కు చట్టం వెనుకున్న ప్రధాన ఆలోచన.

విద్య ద్వారా సామాజిక సమానత్వం తీసుకురావడం, పేదరికం వల్ల నాణ్యమైన విద్యకు దూరమవుతున్న పిల్లలకు అవకాశాలు కల్పించడం దీని లక్ష్యం. దేశంలోని అనేక రాష్ట్రాల్లో లక్షలాది మంది విద్యార్థులు ఈ చట్టం ద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా చదువుతున్నారు.

తెలంగాణలో ఎందుకు ఆలస్యం జరిగింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా విద్యా హక్కు చట్టంలోని 25% రిజర్వేషన్ నిబంధన అమలుపై స్పష్టత కనిపించలేదు. విద్యాహక్కు, కార్యకర్తలు, స్వచ్ఛంధ సంస్థలు, తల్లిదండ్రుల సంఘాలు పలుమార్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. చివరకు విషయం న్యాయస్థానాల దృష్టికి వెళ్లింది. తెలంగాణ హైకోర్టు పలుమార్లు ప్రభుత్వాన్ని నిలదీసింది. దేశవ్యాప్తంగా అమలవుతున్న చట్టం తెలంగాణలో ఎందుకు అమలు కావడం లేదు? అని ప్రశ్నించింది. దీంతో ప్రభుత్వం అమలుకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించింది.

**అమలు మొదలైందా...**

అవును, ప్రభుత్వం ఇటీవల విద్యాహక్కు చట్టం అమలుకు మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే ఇక్కడే కొత్త వివాదం మొదలైంది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో కాకుండా, ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులోలేని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే 25 శాతం కోటా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో విద్యాహక్కు కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వారి అభిప్రాయం ప్రకారం, చట్టం మొత్తం రాష్ట్రానికి వర్తిస్తుంది. కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేయడం చట్ట స్ఫూర్తికి విరుద్ధం అని వారు అంటున్నారు.



హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్ వంటి పట్టణాల్లో వేలాది మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలని కోరుకుంటున్నారు. కానీ ఫీజులు, పుస్తకాలు, రవాణా ఖర్చులు వారికి భారంగా మారుతున్నాయి. విద్యాహక్కు చట్టం అమలైతే ఈ కుటుంబాలకు గొప్ప అవకాశం లభిస్తుంది. అయితే అమలు పరిమిత ప్రాంతాలకే పరిమితమైతే అనేకమంది అర్హులైన విద్యార్థులు ప్రయోజనం కోల్పోయే పరిస్థితి ఉంటుం ది. ప్రభుత్వ వర్గాల వాదన వేరుగా ఉంది. వారి ప్రకారం.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యం. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లో విద్యా హక్కు చట్టం కోటా అవసరం తక్కువ. ప్రభుత్వ పాఠశాలలు లేని ప్రాంతాల్లో పిల్లలకు ప్రత్యామ్నాయంగా ఈ అవకాశం ఇస్తున్నాం. దశలవారీగా హామీలు విస్తరించే అవకాశాలు ఉన్నా యి.

విద్యారంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం, అసలు సమస్య చట్టం అమలులో కాదు, నాణ్యమైన విద్య అందుబాటులో ఉండటంలో ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు, మౌలిక వసతుల కొరత, ఇంగ్లీష్ మాధ్యమంపై తల్లిదండ్రుల ఆకాంక్ష, డిజిటల్ విద్యలో వెనుకబాటు వంటి అంశాలు ఇంకా సవాళ్లుగానే ఉన్నాయి. తెలంగాణలో విద్యాహక్కు చట్టం అమలు ఎంత విస్తృతంగా, ఎంత పారదర్శకంగా ఎంత సమర్థంగా జరుగుతుందో దానిపైనే వేలాది పేద కుటుంబాల ఆశలు, పిల్లల భవిష్యత్తు ఆధారపడి ఉంది. విద్య హక్కు అయితే ఆ హక్కు ప్రతి చిన్నారికి చేరే వరకు పోరాటం పూర్తి కానట్లే.

**మధుగౌడ్ జి,**
9533551188.

# అయోధ్య విరాళాల చోరీ కేసును 'సుప్రీం' సిట్టింగ్ జడ్జితో విచారణ

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన అయోధ్య రామాలయం విరాళాల చోరీ కేసును తక్షణమే సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం ఇక్కడ మీడియా సమావేశంలో మాట్లాడారు. అయోధ్య విరాళాల చోరీ దోషులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడుతున్నాయని మండిపడ్డారు. అయోధ్యలో ఘోరాలు జరుగుతుంటే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ విషయమై ఏమీ మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. 12ఏళ్లలో మోదీ విదేశీ పర్యటనల ఖర్చులపై తక్షణమే ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో యూట్యూబర్ మాట్లాడితే 'ఉపా' చట్టం పెట్టీ కేసులు పెట్టడాన్ని ఆయన ఆక్షేపించారు. ప్రశ్న రావణ్‌కు నాలుగుసార్లు బెయిల్ వచ్చిన తర్వాత 'ఉపా' చట్టం కింద కేసులు పెట్టడం అప్రజాస్వామికమన్నారు. 'ఉపా' చట్టం రద్దు చేయాలని దేశవ్యాప్తంగా ఆందోళన జరుగుతుంటే ఆ చట్టం కింద కేసులు పెట్టడం దారుణమన్నారు.

# టిజిఎల్ఐ పాలసీదారులు 'ఐఎఫ్ఎంఐఎస్' పోర్టల్‌లో అప్‌డేట్ చేసుకోండి

- టిజిఎల్ఐ సంచాలకులు వి.శ్రీనివాసు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వ జీవిత బీమా (టిజిఎల్ఐ) పాలసీదారులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు బీమా అర్హత వయస్సు (56) ఏళ్ల లోపు ఉండి వారి జీతభత్యముల నుంచి నెలసరి బీమా ప్రీమియములను క్రమం తప్పకుండా తగ్గించుతూ, దానికి సరిపడే విధంగా ప్రతిపాదన పత్రాలు సంబంధిత బీమా కార్యాలయాలకు సమర్పించి, పాలసీలు పొందిఉన్నట్లయితే, వారు మాత్రమే బీమా ప్రయోజనాలకు అర్హులు అవుతారని తెలంగాణ ప్రభుత్వ జీవిత బీమా శాఖ సంచాలకులు వి.శ్రీనివాసు శుక్రవారం తెలిపారు. కొంతమంది చందాదారులు (ఉద్యోగ, ఉపాధ్యాయులు) బీమా అర్హత వయస్సు 56 సంత్సరాలలోపు ఉండి ప్రీమియములు (మొదటి/తదుపరి) క్రమం తప్పకుండా తగ్గించుతున్నప్పటికీ, సంబంధిత జిల్లా బీమా కార్యాలయాలలో ప్రతిపాదన పత్రాలను సమర్పించకపోవడం వల్ల నేటికీ పాలసీలు పొందక బీమా ప్రయోజనాలకు అర్హులవుతారని, వారు, వారి డిడిఓలు పూరించబడిన పత్రాలను సంబంధిత జిల్లా బీమా కార్యాలయాలలో సమర్పించి, వాటికి తగిన విధంగా పాలసీలను పొందాలని, ఆ పాలసీలను ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్ నందలి ఉద్యోగుల మాస్టర్ జాబితాలో అప్‌డేట్ కూడా చేసుకోవాలని సంచాలకులు వి.శ్రీనివాసు తెలియజేశారు.


తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ శాఖ
జిల్లా కలెక్టర్ కార్యాలయము, ఆదిలాబాద్.

ఫారం -VII, (పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్)

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్దకమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం - 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25(1) అనుసరించి)

కలెక్టర్ ఫైల్ నెం.జి1/816/2018 — తేదీ : .06.2026
ఆర్డీఓ ఫైల్ నెం.B/105/2022 — తేదీ : .06.2026
గెజిట్ నెం. P.N.U/S-11(1)/07-B/2026 — తేది : 01.07.2026

ఈ దిగువ నిర్దిష్ట పరిచిన ఆదిలాబాద్ జిల్లా జైనథ్/బేల మండలములోని 1, కరంజి, 2 నారాయణపూర్, 3 సంగిడి, గ్రామములోని మొత్తము విస్తీర్ణము **ఎ.15.16 గుంటలు** భూమి ప్రజాప్రయోజనం నిమిత్తం అనగా ఇంటర్ స్టేట్ లోవర్ పెన్ గంగా ప్రాజెక్టు (DI)డిస్ట్రిబుటోరి DL-19 మెయిన్ 4Lసభ మైనర్ 13 ఓ మైనర్ కాలువల నిర్మాణము నిమిత్తం సదరు భూ సేకరణ ప్రకటన జారీ చేయనైనది. ఇట్టి ప్రాజెక్ట్ ప్రభుత్వ ఉత్తర్వులు నెం.58 ఐ అండ్ సి ఎ డి (ఎల్.ఏ ఆర్ & ఆర్ ఏ) ఇట్టి ప్రాజెక్ట్ ప్రభుత్వం ఉత్తర్వుల శాఖ తేదీ: 25.07.2017. ననుసరించి భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 చాప్టర్ -II మరియు III పరిధి నుండి మినహాయింపు ఇవ్వ బడినది.
కావున ఆదిలాబాద్ జిల్లా జైనథ్/బేల మండలములోని 1, కరంజి, 2 నారాయణపూర్, 3 సంగిడి, గ్రామములోని మొత్తము విస్తీర్ణము **ఎ.15.16 గుంటలు** భూమి ప్రజాప్రయోజనం నిమిత్తం అనగా ఇంటర్ స్టేట్ లోవర్ పెన్ గంగా ప్రాజెక్టు (DI)డిస్ట్రిబుటోరి DL-19 మెయిన్ 4 సభ్ మైనర్ 13 L మైనర్ కాలువల నిర్మాణము నిమిత్తం నిర్మాణంనకు అవసరమైనందున భూమిని సేకరించుటకు ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

షెడ్యూలు

గ్రామము : కరంజి & (2 గ్రామములు) — మండలము : జైనథ్ / బేల — జిల్లా : ఆదిలాబాద్

| క్ర. సం. | సర్వే నెం. | బీట్ నెం. | సర్వే విస్తీర్ణం | పట్టా/ మెట్ట/ తరి | ఎంజాయ్ మెంట్ విస్తీర్ణం | పట్టాదార్ పేరు / తండ్రి పేరు | కాస్తుదార్ పేరు / తండ్రి పేరు | చెట్లు/ బోర్‌వెల్/ ఇతరములు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| | 1-కరంజి-కే గ్రామము జైనథ్ మండల్ (DL-19, 4L సబ్-మైనర్, 13 ఎల్, మైనర్) | | | | | | | |
| 1 | 45/2 | 45/ఆ | 1.03 | పట్టా/ మెట్ట | 0.26 | సమ అభిరామ్ రెడ్డి తండ్రి నర్సింగ్ రెడ్డి | స్వంతం | అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ |
| 2 | | 45/అ | | పట్టా/ మెట్ట | 0.08 | సమ లింగ రెడ్డి తండ్రి రాంరెడ్డి | స్వంతం | ,, |
| 3 | | 45/ఉ | | పట్టా/ మెట్ట | 0.07 | సమ ఆశిష్ రెడ్డి తండ్రి లింగ రెడ్డి | స్వంతం | ,, |
| 4 | | 45/ఈ | | పట్టా/ మెట్ట | 0.01 1/2 | సమ అశోక్ రెడ్డి తండ్రి నారన్నా | స్వంతం | ,, |
| 5 | | 45/ఇ/1 | | పట్టా/ మెట్ట | 0.00 1/2 | సమ అనిల్ రెడ్డి తండ్రి లింగ రెడ్డి | స్వంతం | ,, |
| 6 | 46/2 | 46/2 | 0.08 | పట్టా/ మెట్ట | 0.08 | ఎల్మ రజినీకాంత్ రెడ్డి తండ్రి రామ్ రెడ్డి | స్వంతం | ,, |
| 7 | 47/2 | 47/అ | 1.01 | పట్టా/ మెట్ట | 0.29 | సమ మీనాషి భర్త /తండ్రి ప్రభాకర్ రెడ్డి | స్వంతం | ,, |
| 8 | | 47/అ1 | | పట్టా/ మెట్ట | 0.12 | సమవార్ గోవెర్ధన్ తండ్రి గంగా రెడ్డి | స్వంతం | ,, |
| 9 | 50/2 | 50/ఇ/2 | 0.33 | పట్టా/ మెట్ట | 0.09 | యెర్టీ నవీన్ రెడ్డి తండ్రి విట్టల్ రెడ్డి | స్వంతం | ,, |
| 10 | | 50/ఆ | | పట్టా/ మెట్ట | 0.24 | గంగమ్ రాంరెడ్డి తండ్రి శివ రెడ్డి | స్వంతం | ,, |
| 11 | 51/2 | 51/ఉ | 0.01 | పట్టా/ మెట్ట | 0.01 | తుమనే గంగు బాయి భర్త పోచ్చిరామ్ | స్వంతం | ,, |
| | మొత్తం | | 3.06 | | 3.06 | (3.09 (-) 0.06 = 3.09) | | |
| | 2-నారాయణపూర్ గ్రామము బేల మండల్ (DL-19, 4L సబ్-మైనర్, 13 ఎల్, మైనర్) | | | | | | | |
| 1 | 4/2 | 4/2 | 1.09 | పట్టా/ మెట్ట | 1.09 | సమ విద్యా రాణి భర్త రవీందర్ రెడ్డి | స్వంతం | అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ |
| 2 | 16/2 | 16/E | 2.34 | పట్టా/ మెట్ట | 0.19 | M.నర్సింహా రెడ్డి తండ్రి వెంకర్ రెడ్డి | స్వంతం | ,, |
| 3 | | 16/B | | పట్టా/ మెట్ట | 0.18 | తిరుపతి రెడ్డి తండ్రి లస్మా రెడ్డి | స్వంతం | ,, |
| 4 | | 16/A | | పట్టా/ మెట్ట | 0.20 | M. రామన్న తండ్రి బాపు | స్వంతం | ,, |
| 5 | | 16/D | | పట్టా/ మెట్ట | 0.20 | M.దేవ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి | స్వంతం | ,, |
| 6 | | 16/1 | | పట్టా/ మెట్ట | 0.37 | M.నర్సింగ్ రెడ్డి తండ్రి లస్మా రెడ్డి | స్వంతం | ,, |
| 7 | 28/2 | 28 | 1.13 | పట్టా/ మెట్ట | 0.27 | నక్కవార్ నారాయణ తండ్రి దేవన్న | స్వంతం | ,, |
| 8 | | 28/1 | | పట్టా/ మెట్ట | 0.26 | M. నర్సింగ్ రెడ్డి తండ్రి లస్మ రెడ్డి | స్వంతం | ,, |
| 9 | 29/2 | 29/1 | 1.16 | పట్టా/ మెట్ట | 1.16 | ప్రమోద్ కుమార్ తండ్రి లైహినూజి | స్వంతం | ,, |
| 10 | 32/2 | 32/2 | 1.02 | పట్టా/ మెట్ట<br>పట్టా/ మెట్ట<br>పట్టా/ మెట్ట<br>పట్టా/ మెట్ట<br>పట్టా/ మెట్ట | 1.02 | 1. గెడమ్ రాందాస్,<br>2. జ్ఞనాన్ దాస్<br>3. రోహిదాస్,<br>3. కావల్దాస్ తండ్రి దావు | జి.రోహిదాస్ తండ్రి దావు<br>జి.సదాశివ్ తండ్రి వర్లు<br>జి.పండరి తండ్రి హున్య<br>జి.మోతీరం తండ్రి నానాజీ<br>గంగారామ్ తండ్రి విత్తు | ,,<br>,,<br>,,<br>,,<br>,, |
| 11 | 33/2 | 33/B | 0.27 | పట్టా/ మెట్ట | 0.13 1/2 | యెల్టీ గోవర్ధన్ రెడ్డి తండ్రి భూమా రెడ్డి | స్వంతం | ,, |
| 12 | | 33/C | | పట్టా/ మెట్ట | 0.13 1/2 | యెలీ జయవర్ధన్ రెడ్డి తండ్రి భూమా రెడ్డి | స్వంతం | ,, |
| | మొత్తం | | 8.21 | | 8.21 | (8.30 (-) 0.09=8.21) | | |
| | 3-సంగిడి గ్రామము బేల మండల్ (DL-19, 4L సబ్-మైనర్, 13 ఎల్, మైనర్) | | | | | | | |
| 1 | 128/2 | 128/2 | 0.33 | పట్టా/ మెట్ట | 0.33 | కుంట అమృత్ రెడ్డి తండ్రి గణేష్ రెడ్డి | స్వంతం | లేదు |
| 2 | 130/2 | 130/2 | 0.24 | పట్టా/ మెట్ట | 0.24 | కుంట రమాబాయి తండ్రి/భర్త రాఘవ్ | స్వంతం | ,, |
| 3 | 131/2 | 131/2 | 1.11 | పట్టా/ మెట్ట | 1.11 | హేమ భర్త మధుసూదన్ | స్వంతం | ,, |
| 4 | 133/1/2 | 133/1/2 | 0.39 | పట్టా/ మెట్ట | 0.39 | కుంట భారతి భర్త రాజశేకర్ | స్వంతం | ,, |
| 5 | 134/3/2 | 134/3/2 | 0.02 | పట్టా/ మెట్ట | 0.02 | గోహర్కర్ ప్రభాకర్ తండ్రి వార్లు | స్వంతం | ,, |
| | మొత్తం | | 3.29 | | 3.29 | | | |
| | సంపూర్ణ మొత్తం | | 15.16 | | 15.16 | | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూ సేకరణ పై వచ్చిన అభ్యాంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చయనైనది. ఆదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్ / జైనథ్ మండలము లోని 1, కరంజి, 2 నారాయణపూర్, 3 సంగిడి, గ్రామములోని మొత్తము విస్తీర్ణము ఎ.15.16 గుంటలు గుర్తించనైనది.
భూసేకర్ణ, పునరావాసం మరియు పునరావసంలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం, 2013 యొక్క సెక్షన్16 ప్రకారం, ప్రాజెక్ట్ పాలనదికారి, ఇంటర్ స్టేట్ లోయర్ పెంగంగా ప్రాజెక్ట్, ఆదిలాబాద్ గారి అద్వర్యములో నిర్వహణ అధికారులు పంపిన అభ్యర్థనల ప్రకారము తమ భూమి చేర్చబడ్డ ప్రాజెక్ట్ ప్రభావిత కుటుంబాల సామాజిక-ఆర్థిక సర్వే చేయడం జరిగినది మరియు పునరావాసం మరియు రి-సెటిల్మెంట్ ప్యాకేజ్ (R&R-ప్యాకేజ్) పొందుటకు ఎవరు అర్హులు కారు అని తెలియ పర్స నైనది.
పైన చూపిన భూ సేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైన పని దినములలో మరియు కార్యాలయము పని వేళలలో జిల్లా కలెక్టరు అదిలాబాదు రాజస్వ మండలాఅదికారి, ఆదిలాబాద్ గారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సం/- రాజస్వ మండలాధికారి మరియు భూ సేకరణ అధికారి ఆదిలాబాద్
సం/- అదనపు కలెక్టర్ ఆదిలాబాద్
సం/- జిల్లా కలెక్టర్ ఆదిలాబాద్
DIPR RO NO. 445/LA/PP/Advt/Pub/2026-27


# వృత్తి గౌరవం నిలబెట్టుకున్నవారే నిజమైన జర్నలిస్టులు

- తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి
- ఫ్రీలాన్స్ వీడియో జర్నలిస్ట్‌లకు అక్రిడిటేషన్ కార్డుల అందజేత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నీతి, నిజాయితీ, నిర్భీతితో పనిచేస్తూ వృత్తి గౌరవాన్ని నిలబెట్టుకున్నవారే నిజమైన జర్నలిస్టులు అని, అలాంటి వారినే సమాజం అక్కున చేర్చుకుంటుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఫొటోగ్రఫీ డే తరహాలోనే వీడియోగ్రఫీ డే నిర్వహణకు మీడియా అకాడమీ యోచిస్తుందని ఆయన వెల్లడించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన సభకు శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫ్రీలాన్స్ వీడియో జర్నలిస్ట్‌లకు అక్రిడిటేషన్ కార్డులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సామాన్యుల భావ ప్రకటన స్వేచ్ఛకు సోషల్ మీడియా మంచి వేదిక అయినప్పటికీ, అందులో మంచితో సమానంగా చెడు, కల్పితాలు, అవాస్తవాలు ట్రోల్ అవుతుండటంతో దానికి విలువ లేకుండా పోతుందని పేర్కొన్నారు. ఎఐని తట్టుకుని నిలబడే విధంగా వీడియో జర్నలిస్టులకు అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులను నిర్వహిస్తామని శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. గతంలో అక్రిడిటేషన్ కార్డులను కొందరు అంగట్లో సరుకుగా మార్చి, దానికి విలువ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్య వల్ల సమాజంలో దుష్పరిణామాలు చోటు చేసుకొన్నాయని విచారం వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్ అనేది వృత్తి గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని ఆయన అన్నారు. టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా వీడియో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి టియుడబ్ల్యూజె కృషి చేస్తుందన్నారు. తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరీశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి సన్నీ, పూర్వ అధ్యక్షులు రాష్ట్ర అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు వనం నాగరాజు, టియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని కిరణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, ప్రధానకార్యదర్శి అశోక్, తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.నరహరి తదితరులు పాల్గొన్నారు.

# జర్మన్ పెట్టుబడులకు తెలంగాణే గమ్యం

- మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులతో తెలంగాణ దేశంలోనే తయారీ రంగానికి అత్యంత అనుకూల రాష్ట్రంగా అవతరించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు జర్మన్ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని బవేరియా (జర్మనీ) ప్రభుత్వ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని ఆయన కోరారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం బవేరియన్ మినిస్ట్రీ ఆఫ్ ఎకానమిక్ అఫైర్స్, రీజినల్ డెవలప్‌మెంట్ అండ్ ఎనర్జీ వైస్ మంత్రి టోబియాస్ గోత్‌హార్ట్ నేతృత్వంలోని జర్మనీ ప్రతినిధి బృందం మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణ–జర్మనీ మధ్య పారిశ్రామిక, సాంకేతిక, ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించే అవకాశాలపై ఇరుపక్షాలు విస్తృతంగా చర్చించాయి. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణను ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందన్నారు. అత్యాధునిక మౌలిక వసతులు, పెట్టుబడిదారులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా నిలబెట్టాయని తెలిపారు. ఈ రంగాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక సాంకేతికత, పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ సమ గ్ర పారిశ్రామిక ఎకో సిస్టమ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. పెట్టుబడులతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లోనూ తెలంగాణ–జర్మనీ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్, హైదరాబాద్‌లో జర్మనీ గౌరవ కాన్సుల్ అమితా దేశాయ్, బవేరియా ఆర్థిక శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉలికే హాఫ్‌మన్, బవేరియా ఇండియా కార్యాలయం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాన్ కొట్టాయిల్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి

- ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వాటికి ఎదురయ్యే అవరోధాలను ముందుగానే గుర్తించి, శాఖల మధ్య సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రంలో చేపడుతున్న కీలక పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతి పట్ల ఆయన హైదరాబాద్‌లోని సచివాలయంలో పరిశ్రమలు, వాణిజ్య శాఖ సీనియర్ అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టిజిఐఐసి), భారత్ ఫ్యూచర్ సిటీ, జహీరాబాద్ ఇండస్ట్రియల్ సిటీ, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు ఇతర వ్యూహాత్మక పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతి పట్ల ఆయన సమీక్షించారు. రాష్ట్రంలోని పలు ప్రాజెక్టుల ప్రస్తుత స్థితి, అభివృద్ధి చేస్తున్న మౌలిక సదుపాయాలు, పెట్టుబడి అవకాశాలు, పూర్తి చేయాల్సిన గడువుకు సంబంధించిన పలు అంశాలను టిజిఐఐసి మేనేజింగ్ డైరెక్టర్ శశాంక రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. అనంతరం సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం ఉండేలా పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయాలని, తద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, జహీరాబాద్ ఇండస్ట్రియల్ సిటీ, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల ద్వారా తెలంగాణ పారిశ్రామిక రంగంగా రూపాంతరం చెంది, భారీ పెట్టుబడులను ఆకర్షించి, ప్రాంతీయ సమతుల అభివృద్ధికి దోహదపడే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమలు వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చేనేత, వస్త్ర శాఖ ప్రత్యేక కార్యదర్శి కాత్యాయనీ దేవి, ఇన్వెస్ట్ తెలంగాణ సిఇఒ అజిత్ రెడ్డి, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# గడువులోగా 'సర్–2026' పూర్తి చేయాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘానికి కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం
- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టండి
- కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డాక్టర్ పవన్ కుమార్ శర్మ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ సఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని భారత ఎన్నికల కమిషన్ (ఈసిఐ), సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ డాక్టర్ పవన్ కుమార్ శర్మ ఆదేశించారు. 'ఎస్ఐఆర్ 2026' పురోగతిపై ఆయన అధ్యక్షతన ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి.సుదర్శన్ రెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఓటరు జాబితా పరిశీలకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, వాటి సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియలను మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఎక్కువ జనాభా, ఓటర్లు ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని, అక్కడ పనులను మరింత ముమ్మరం చేయాలన్నారు. డిఈఓలు తమకు నిర్దేశించిన రోజువారీ డిజిటైజేషన్ లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలన్నారు. ఈ లక్ష్యాల పురోగతిని ప్రతిరోజూ నిశితంగా పర్యవేక్షించాలని రాష్ట్ర సిఈఓ సుదర్శన్ రెడ్డిని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న కొన్ని జిల్లాల అధికారులతో కమిషన్ ప్రత్యేకంగా మాట్లాడారు. వారు క్షేత్రస్థాయిలో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను, వ్యూహాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా జిల్లాల్లో విజయవంతమైన వ్యూహాలను మిగిలిన జిల్లాలు కూడా ఆదర్శంగా తీసుకుని, తమ ప్రాంతాల్లో ఎన్యూమరేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.

# పాత ఫ్లైఓవర్లు, వంతెనలపై జిహెచ్ఎంసి యాక్షన్ ప్లాన్

- 24 నిర్మాణాల సమగ్ర సాంకేతిక అధ్యయనానికి ఈఓఐలు ఆహ్వానం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహా నగర పరిధిలోని పాత ఫ్లైఓవర్లు, రోడ్డు వంతెనల భద్రతపై మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) ప్రత్యేక దృష్టి సారించింది. దశాబ్దాల క్రితం నిర్మించిన పలు ఫ్లైఓవర్లు నిర్వహణ లోపంతో అధ్వానంగా మారిన నేపథ్యంలో, వాటి స్థితిగతులను సమగ్రంగా పరిశీలించి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల దేశంలోని పలు నగరాల్లో పాత వంతెనలు, ఫ్లైఓవర్ల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యగా జిహెచ్ఎంసి ఈ అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. ఫ్లైఓవర్లు, రోడ్డు అండర్ బ్రిడ్జిలు (ఆర్‌యుబిలు), రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు (ఆర్‌ఓబిలు), అలాగే చారిత్రక వంతెనల ప్రస్తుత స్థితిగతులను శాస్త్రీయంగా అంచనా వేసి అవసరమైన పునరుద్ధరణ చర్యలు చేపట్టనున్నారు. నగరంలోని మొత్తం 24 పాత ఫ్లైఓవర్లు, రోడ్డు వంతెనలపై సమగ్ర సాంకేతిక అధ్యయనం నిర్వహించి, నిర్మాణ స్థిరత్వ పరీక్షల ద్వారా పునరుద్ధరణ చర్యలను సూచించేందుకు కన్సల్టెన్సీ సంస్థల నుంచి 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ (ఈఓఐ)' లేదా టెండర్ నోటిఫికేషన్‌ను ఆహ్వానించింది. వాటి నిర్మాణ బలం, మన్నిక, భద్రతా ప్రమాణాలను పరిశీలించి మరమ్మతులు, బలోపేతం, పునరుద్ధరణకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయనుంది. ఇటీవల దేశంలోని పలు ప్రాంతాల్లో పాత వంతెనల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ వెల్లడించారు.

**నిర్వహణ లోపంతో అధ్వానంగా..**

ఇంజనీరింగ్ ప్రమాణాల ప్రకారం ఫ్లైఓవర్లు, వంతెనలు, ఆర్‌యుబిలు, ఆర్‌ఓబిలకు నిర్దిష్ట వ్యవధిలో సంరక్షణ పనులు చేపట్టాలి. జాయింట్ ఎక్స్‌ప్పెన్షన్‌ల మరమ్మతులు, బేరింగుల మార్పు, నిర్మాణ భాగాల తనిఖీలు వంటి పనులు క్రమం తప్పకుండా జరగాల్సి ఉన్నప్పటికీ, నగరంలోని పలు పాత వంతెనలకు గతంలో తగిన స్థాయిలో నిర్వహణ జరగలేదని అధికారులు గుర్తించారు. ఫలితంగా కొన్ని ఫ్లైఓవర్లలో స్పాన్‌ల మధ్య గ్యాపులు ఏర్పడి వాహనదారులు ఎగుడుదిగుడు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పాతబస్తీలోని పలు ఆర్‌యుబిలు, ఆర్‌ఓబిలు శిథిలావస్థకు చేరుతుండటంతో వాటి పునరుద్ధరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు.

**చారిత్రక వంతెనలకూ పరీక్షలు**

ఈ అధ్యయన పరిధిలో చారిత్రక ప్రాధాన్యం కలిగిన మూసీ నదిపై ఉన్న పురానా పూల్, నయాపూల్ వంతెనలు కూడా ఉన్నాయి. కుతుబ్‌షాహీ పాలనలో సుమారు 450 ఏళ్ల క్రితం నిర్మించిన పురానా పూల్, ఆసఫ్‌జాహీ కాలంలో సుమారు 160 ఏళ్ల క్రితం నిర్మితమైన నయాపూల్ వంతెనల నిర్మాణ స్థితిని కూడా ఆధునిక సాంకేతిక పద్ధతులతో పరిశీలించనున్నారు.

**నాన్–డిస్ట్రక్టివ్ పరీక్షలతో బలం అంచనా**

ఎంపికయ్యే కన్సల్టెన్సీ సంస్థలు వంతెనల నిర్మాణ బలాన్ని అంచనా వేసేందుకు అల్ట్రాసోనిక్ పల్స్ వెలాసిటీ (యుపివి) పరీక్ష, రీబౌండ్ హ్యామర్ టెస్ట్ వంటి నాన్‌డిస్ట్రక్టివ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. అదనంగా ప్రతి నిర్మాణానికి జనరల్ అసెంబ్లీ (జిఏ) డ్రాయింగ్ సిద్ధం చేసి, బీమ్‌లు, డెక్ స్లాబ్‌లు, పియర్లు, బేరింగులు తదితర నిర్మాణ భాగాల స్థితిని విశ్లేషించనున్నారు. పరిశీలన అనంతరం దెబ్బతిన్న భాగాలు, అవసరమైన మరమ్మతులు, బలోపేత చర్యలు, వినియోగించాల్సిన నిర్మాణ సామగ్రి, పనుల ప్రాధాన్యత, అంచనా వ్యయంతో కూడిన సమగ్ర నివేదికను జిహెచ్ఎంసికి సమర్పించాల్సి ఉంటుంది. ఆ నివేదిక ఆధారంగా దశలవారీగా పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులు యోచిస్తున్నారు.

**అధ్యయనంలో ఉన్న ఫ్లైఓవర్లు**

అధ్యయన జాబితాలో ప్యారడైజ్, ప్యాట్నీ– పరేడ్ గ్రౌండ్స్, బేగంపేట్ ఎయిర్‌పోర్ట్, తార్నాక, నారాయణగూడ, బషీర్‌బాగ్, మాసబ్‌ట్యాంక్, తెలంగాణ తల్లి జంక్షన్, లంగర్‌హౌస్, పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్లు ఉన్నాయి. అలాగే చౌని, ఉప్పుగూడ, లలితాబాగ్, వైఎస్‌పి స్విమ్మింగ్ పూల్, యాకుత్‌పురా, తలాబ్‌కట్ట, రైన్‌బజార్, ఆజంపురా, మలక్‌పేట్ ఆర్‌యుబిలు, దబీర్‌పురా ఆర్‌ఓబితో పాటు పురానా పూల్, నయాపూల్ వంతెనలను కూడా పరిశీలించనున్నారు.

**ప్రజల భద్రతే ప్రాధాన్యం : ఆర్‌వి.కర్ణన్**

'నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ భారాన్ని దృష్టిలో ఉంచుకుని పాత ఫ్లైఓవర్లు, వంతెనల భద్రతను నిర్ధారించడం ద్వారా ప్రజలకు సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించడమే ఈ అధ్యయనం ప్రధాన ఉద్దేశ్యం.' అని కమిషనర్ కర్ణన్ అన్నారు. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ భారాన్ని దృష్టిలో ఉంచుకుని పాత ఫ్లైఓవర్లు, వంతెనల భద్రతను నిర్ధారించడం ద్వారా ప్రజలకు మరింత సురక్షిత రవాణా సౌకర్యం కల్పించేందుకు ఈ అధ్యయనం అనంతరం మరమ్మతులు చేపడతామన్నారు.

# ప్రతి ఫుట్‌పాత్‌పై నడిచేలా.. సైబరాబాద్‌లో ఆక్రమణల తొలగింపు!



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పాదచారులకు సురక్షితమైన, నిరంతరాయమైన నడక మార్గాలను అందించాలనే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) రంగంలోకి దిగింది. కమిషనర్ డాక్టర్ జి.సృజన ఆదేశాల మేరకు శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని మూడు జోన్‌లలో ఒకేసారి 'వాక్ ఫ్రీ ఫుట్‌పాత్' ఆక్రమణల తొలగింపు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్లు, సర్కిల్ అధికారులు, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సమన్వయంతో చేపట్టిన ఈ మెగా డ్రైవ్‌లో ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను భారీ ఎత్తున తొలగించి, పాదచారులకు నడక మార్గాలను పునరుద్ధరించారు.

**ఆక్రమణలు సహించేది లేదు : కమిషనర్ హెచ్చరిక**

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 'ఫుట్‌పాత్‌లు పూర్తిగా పాదచారుల హక్కు. వాటిపై ఎలాంటి ఆక్రమణలను సహించే ప్రసక్తే లేదు' అని కమిషనర్ సృజన అన్నారు.

# కెటిఆర్ పగటి కలలు కంటున్నారు

- ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎద్దేవా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇప్పుడే ఎన్నికలు వచ్చినట్టు, ఆ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలిచినట్టు కెటిఆర్ పగటి కలలు కంటున్నారని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సర్వేలు తమకు అనుకూలంగా ఉన్నాయని, 50 వేల మెజార్టీతో గెలుస్తామని కెటిఆర్ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జూబ్లీహిల్స్, కంటోన్‌మెంట్ ఉప ఎ న్నికల్లో బిఆర్ఎస్ తమ సిట్టింగ్ స్థానాల్లో ఓడిపోయిందని, అంతకుముందు లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు గెలువలేదని వివరించారు. హరీశ్‌రావుకు మూడు నెలలు ఇరిగేషన్ శాఖ మంత్రి పదవి ఇస్తే పాత బకాయిలు వసూలు చేస్తారా.అని కిరణ్ రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రజలను ముంచే స్కీములు ఉన్నాయా? అందుకే అధికారంలోకి వద్దామని అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. తుంగతుర్తిలో తమకు ఎలాంటి పంచాయతీలు లేవని, మండల అధ్యక్షుల విషయంలో చర్చించి నిర్ణయం తీసుకుంటే బాగుండేదని కార్యకర్తల్లో అభిప్రాయం వ్యక్తమవుతోందన్నారు. మండల అధ్యక్షుల విషయంలో తాను మీనాక్షి నటరాజన్‌కు లేఖ రాశానని, డీలిమిటేషన్ జరిగితే అప్పటి పరిణామాల ఆధారంగా ఎవరు ఎక్కడ పోటీ చేయాలో కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంటుందని కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. మెజారిటీ కార్యకర్తల అభిప్రాయం మేరకే మండల అధ్యక్షులను ఎంపిక చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు.


**పురపాలక సంఘ కార్యాలయము :: జనగామ, జిల్లా : జనగామ**

సర్వీస్ నోటీసు

టెండర్ నోటీసు నెం. F1/MCJ/1/2026-27 — తేది: 09.07.2026

**1. పని పేరు:** జనగామ మున్సిపాలిటీ మునిసిపల్ చికెన్ మరియు మాంసం వర్ధ్యాల సేకరణ మరియు తీసుకోని వెళ్ళుట కొరకు, **2. టెండరు డాక్యుమెంట్లు లభించు తేది :** 10-07-2026 ఉ: 11.00 గం.ల నుండి, **3. టెండర్లు స్వీకరించు చివరి తేదీ, సమయం :** 17-07-2026 సా: 4.00 గం.ల వరకు.
మిగతా వివరాలకు https://tender.telangana.gov.in/ వెబ్‌సైట్‌లో చూడగలరు.

సం/- కమిషనర్, పురపాలక సంఘం, జనగామ
DIPR R.O. No. : 5894-PP/CL/ADVT/2026-27, Date: 10-07-2026

**నర్సంపేట్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: వరంగల్**

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

టెండర్ నోటీసు నెం. E1/CTN 02/Nspt/2026-27 — తేది: 10.07.2026

**పనుల వివరాలు: 03** సివిల్ పనులు, **మొత్తం:** రూ.15.00లక్షలు, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం:** 13.07.2026 ఉ.11:00గం.లకు, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ఆఖరి తేదీ & సమయం:** 20.07.2026 సా.4:00గం.ల వరకు, **బిడ్ దాఖలకు ఆఖరి తేదీ:** 20.07.2026 సా.4:30గం.ల వరకు, **బిడ్స్ ప్రారంభం:** 21.07.2026 ఉ.11:00గం.లకు. **సంప్రదించవలసిన వివరాలు:** కమిషనర్, నర్సంపేట్ మున్సిపాలిటీ. పిన్: 506132, ఫోన్: 7680096877. మరిన్ని వివరాలను www.eprocurement.gov.in అనే ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్‌లో చూడవచ్చు. పనులకు సంబంధించిన వివరాలను 13.07.2026న ఉదయం 11:00 గంటల నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

DIPR R.O. No. : 5910-PP/CL/ADVT/2026-27, Date: 10-07-2026 — సం/- కమిషనర్, నర్సంపేట్ మున్సిపాలిటీ.

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**

| NIT No. & Date | పని వివరణ | అంచనా విలువ | ప్రారంభ తేది & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | ఇఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 07/DB/EE-II/Alwal Circle/MMC/2026-27, Dt: 10.07.2026 | ఎంఎంసి, మల్కాజ్‌గిరి జోన్, అల్వాల్ సర్కిల్ (02)లో సిసి రోడ్లు వేయడం | రూ. 38.00 లక్షలు | తేది: 14.07. 2026 మ.02.00 గం.లకు | తేది: 21.07. 2026 మ.02.00 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, అల్వాల్ సర్కిల్-2, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, అల్వాల్ సర్కిల్-2, ఎంఎంసి.
DIPR R.O. No. : 5895-PP/CL/ADVT/2026-27, Date: 10-07-2026



## డంపింగ్ యార్డ్ ఎత్తివేసే వరకు ఉద్యమం ఆపబోం : షేక్షావలి

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** తెలంగాణ ఉద్యమం తరహాలో డంపింగ్ యార్డ్ ఉద్యమాన్ని ఉధృతం చేద్దామని, డంపింగ్ యార్డ్ ప్రాంత ప్రజలంతా ఏకమై రాంకీ యాజమాన్యం ఆగడాలపై పోరాడుదామని డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ షేక్షావలి పిలుపునిచ్చారు. ప్రజల జీవన ప్రమాణాన్ని, పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తొలగింపే లక్ష్యంగా ముందుకు సాగుతూ శుక్రవారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి యాప్రాల్లో సిఎంఎస్ జయక్క ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షేక్ వలి, ఉమామహేష్ హాజరై మాట్లాడుతూ, చెత్తను జవహర్ నగర్‌కే కాకుండా నలువైపులా ఉన్న డంపింగ్ యార్డ్ కు తరలించి డంపింగ్ యార్డ్ రహిత సమాజాన్ని నిర్మించాలని అన్నారు. డంపింగ్ యార్డ్ పోరాటాన్ని ప్రతి ఇంటికి తీసుకెళుతూ ప్రజల భాగస్వామ్యంతో డంపింగ్ యార్డ్ ఎత్తి వేసే వరకు ఉద్యమం ఆపబోమని, రాంకీ యాజమాన్యం నిబంధలు పాటించకుండా ప్రజల ఆరోగ్యం దెబ్బతీస్తుండటం నేరమని, ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుని డంపింగ్ యార్డ్‌ను మూసివేయించాలని డిమాండ్ చేశారు. నేటి లారీల బంద్ కార్యక్రమానికి ప్రజలంతా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ యాప్రాల్ చైర్మన్ నర్సింహా, కన్వీనర్‌గా సాయికుమార్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో శంకర్, సునీత, చంద్రమౌళి, వేణు తదితరులు పాల్గొన్నారు.




## పాఠశాల స్థలంపై సత్వరమే నిర్ణయం తీసుకోండి

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** గబ్బిలాలపేటలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకోసం స్థలాన్ని సత్వరమే కేటాయించాలని గబ్బిలాలపేట ప్రభుత్వ పాఠశాల సాధన కమిటీ, జెఎసి ప్రతినిధులు జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. గతంలో ప్రజావాణిలో చిన్నారెడ్డి ఇచ్చిన వినతిపై స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. ప్రభుత్వ విద్యా లక్ష్యాలు నెరవేరాలంటే ప్రజలు ఉన్నచోటనే పాఠశాలలను నిర్మించాలని, కిలోమీటర్ల దూరంలో కేటాయించడం సరికాదని జెఎసి నాయకులు స్పష్టం చేశారు. అధికారులు నాన్చుడు ధోరణి వీడి, చిన్నారెడ్డి సూచించిన విధంగా ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, పాఠశాల సాధన కమిటీ కన్వీనర్ తోటపల్లి శంకర్, కోకన్వీనర్ నరసింహులు గౌడ్, షేక్ షావలి, అనురాధ, జయసుధ (పిడిబ్ల్యూ), మంజుల (చైతన్య మహిళ), శివన్నారాయణ న్యూ డెమోక్రసీ ఐఎఫ్టియూ సిపిఎం, సూర వెంకటయ్య బిఎన్ఆర్ కేఎస్, సునీల్, క్రైమ్ సంస్థ, దుర్గేష్, బిఆర్ఎస్ తదితరులు పాల్గొన్నారు.



## గురుకులంలో టీచర్ల నియామకాలు

### వజ్రేష్ యాదవ్ హామీ

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఘట్‌కేసర్ గురుకుల్ కళాశాలలో ఉపాధ్యాయుల కొరతను వెంటనే పరిష్కరించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఘట్‌కేసర్ గురుకుల్ కళాశాలను సందర్శించిన ఆయన విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించి ప్రిన్సిపాల్ ఘట్‌కేసర్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్‌తో కళాశాల పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ గురుకుల్ కళాశాల నూతన భవన నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ఉపాధ్యాయుల కొరతపై ఉన్నతాధికారులతో మాట్లాడగా త్వరలోనే నియామకాలు చేపడతామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. నాణ్యమైన విద్య అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌంతం అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, ఖయ్యూం, మేకల సునిల్ కుమార్, మాజీ కౌన్సిలర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎండోమెంట్స్ సెల్ కన్వీనర్‌గా చంద్రమౌళి

**ప్రజాపక్షం/కాప్రా :** బిజెపి ఎండోమెంట్స్ సెల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్‌గా బలిజపల్లి చంద్రమౌళి, కో కన్వీనర్లుగా సూర్యప్రకాశరావు, శ్రీశైలం, పవన్ కుమార్, కనకదుర్గ, జాయింట్ కన్వీనర్లుగా రూప, ఉషలను నియమిస్తూ ఎండోమెంట్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు రాంచంద్రరావు నియామక పత్రాలు జారీ చేసారు.

## షెడ్డుపై నుండి పడి కార్మికుడికి తీవ్ర గాయాలు..ఆస్పత్రికి తరలింపు

**ప్రజాపక్షం/దుండిగల్ :** కమర్షియల్ షెడ్డుపై పనిచేస్తూ కిందపడి ఓ వ్యక్తి తలకు బలమైన గాయాలు కాగా ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల ఫిర్యాదు తో కేసు నమోదు చేసుకున్న దుండిగల్ పోలీస్‌లు దర్యాప్తు ప్రారంభించారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా, ఇచ్ఛాపురం మండలం రక్తకన్న గ్రామానికి చెందిన లంకా భాస్కర్ రావు (43) సూరారం ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటు కార్పెంటర్ గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం పని నిమిత్తం చర్చి గాగిల్లపూర్ వెళ్లిన అతను నూతనంగా నిర్మిస్తున్న షెడ్డులో ఫాబ్రికేషన్ పనిచేస్తుండగా కిందపడి తలకు, శరీర భాగాలకు బలమైన గాయాలు కాగా తోటి కార్మికులు చికిత్స నిమిత్తం సూరారం మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించగా అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. మెరుగైన చికిత్స నిమిత్తం చింతల్‌లోని ప్రాణధార ఆసుపత్రికి తరలించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. భార్య లంకా ఎల్లమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం

**ప్రజాపక్షం/మేడ్చల్‌మల్కాజిగిరి/ఉప్పల్:** విద్యారంగంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారంలో తాత్సారం, కార్పొరేట్ విద్యాసంస్థల పట్ల ఉదాసీనతలను నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు శనివారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో విజయవంతమైంది. జిల్లాలోని పలు విద్యా సంస్థలు స్వచ్ఛందంగా మూసి వేయగా తెరచి ఉన్న పాఠశాలలను విద్యార్థి సంఘాలు మూసి వేయించారు.




ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ తదితర సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు నినాదాలు చేసుకొంటూ విద్యారంగానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ ప్రతినిధులు ధర్మేంద్ర, అజీంపాషా, మహేష్ కుమార్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీ ని అరికట్టాలని, రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఖాళీలన్నింటిని భర్తీ చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్‌కు చెందిన గిరిబాబు, అలీ, ఇర్ఫాన్, సమీర్, కిరణ్, ఆశ్రఫ్, ఉమేష్, గణేష్, లోకేష్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.







## వ్యవసాయాభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

### పిసిసి చైర్మన్ పోలీస్ రాంరెడ్డి

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండల కేంద్రంలో శుక్రవారం పిసిసి చైర్మన్ రాంరెడ్డి, ఎంఎస్ చైర్మన్ రాథోడ్ గీతా సింగ్ ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతూ వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు అధికారుల సూచనలు పాటిస్తూ ధృవీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలుచేసి సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జ్యోతి, స్థానిక సర్పంచ్ నర్సింహా రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎఎంసి డైరెక్టర్లు, మాజీ ఎంపిటిసిలు, రైతు నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, వ్యవసాయ అధికారులు, రైతులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పట్టణ పరిశుభ్రతకు పారిశుద్ధ్య కార్మికులే వెన్నెముక

### అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ శిరీషా కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పట్టణ పరిశుభ్రతకు కార్మికులే ప్రధాన పాత్ర పోషిస్తారని, కార్మికుల ఆరోగ్య భద్రత, సంక్షేమానికి పురపాలక సంఘం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అలియాబాద్ పురపాలక కార్యాలయంలో కార్మికులకు భద్రత సామాగ్రితో పాటు 70 మందికి ఇఎస్ఐ నమోదు ధృవ పత్రాలను అందజేశారు. అనంతరం చైర్ పర్సన్ కమతం కృష్ణారెడ్డి మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్య భద్రత ముఖ్యమని మున్సిపల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 70మంది పారిశుద్ధ్య కార్మికులకు పురపాలక సంఘం కార్యాలయం లో నూనెలు, సబ్బులు, వ్యక్తిగత భద్రత సామాగ్రి (పిపిఇ) కిట్లు పంపిణీ చేశామని చెప్పారు. కార్మికులకు ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం ఇఎస్ఐ నమోదు ధృవ పత్రాలను అందజేశామని తెలిపారు. ఈ పథకం ద్వార ఉచిత వైద్య సేవలు, ప్రమాద బీమా, అనారోగ్య భృతి, ప్రసూతి ప్రయోజనాలపై అధికారులు వివరంగా అవగాహన కల్పించారు. ప్రతి కార్మికుడు ఇఎస్ఐ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్య భద్రతను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ మాలతి మాధవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొనాన్నారు.




**యువత స్వయం ఉపాధితో స్థిరపడాలి**

యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా స్థిరపడాలని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మజీద్‌పూర్ చౌరస్తాలో లక్ష్మి నర్సింహా వీల్ ఆలైన్‌మెంట్ షాపును చైర్ పర్సన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చదువుకున్న యువకులు చెడు వ్యసనాలబారిన పడకుండా సొంతంగా వ్యాపారాలు ప్రారంభించి జీవితంలో నిలదొక్కుకోవాలని సూచించారు. యువకులు ప్రభుత్వం కల్పించే ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం శక్తితో వ్యాపారాలు ప్రారంభించి యువతకు ఆదర్శంగా నిలువాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బిజెపి అసెంబ్లీ కంటెస్టెంట్ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్లు జశ్వంత్‌రెడ్డి, ముద్దం సుధాకర్‌రెడ్డి, మాజి ఎంపిటిసి అశోక్‌రెడ్డి, మాజి సర్పంచ్ కమతం కృష్ణారెడ్డి, ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగరావు, యజమానులు, తదితరులు పాల్గొన్నారు.




## 'ఎస్ఐఆర్'లో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై కఠిన చర్యలు

### కలెక్టర్ దీపక్‌తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్:** ఎస్ఐఆర్‌ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపైకఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి హెచ్చరించారు. ప్రత్యేక సమగ్ర ప్రక్రియపై తహసీల్దార్ , ఎంపిడిఒలు మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జులై 20 లోపు డిజిటలైజేషన్ ప్రక్రియను తప్పనిసరిగాపూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 15శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రతి రోజు 100మంది ఓటర్లను డిజిటలైజేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో ముందస్తుగా తెలియజేసి, చెత్త సేకరించే వాహనాల ద్వారా సమాచారాన్ని అందించి ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ అదేశించారు. తక్కువగా ఉన్న పోలింగ్ స్టేషన్‌లను అధికారులు సందర్శించి సమీక్షించాలని, అందరి సహకారం తీసుకోవాలని అదేశించారు. శని, అదివారాల్లో పూర్తిస్థాయి లో ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనాలని కలెక్టర్ తెలిపారు. 13వ తేదీ ఉదయంలోపు 45 శాతం డిజిటలైజేషన్ పూర్తి కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపుకలెక్టర్ వెంకటచారి, ట్రైనింగ్ కలెక్టర్ బస్వరాజ్, డిఆర్ఒ స్వర్ణలత, జెడ్పిసిఇఓ సుధీర్, డిఆర్డిఒ శ్రీనివాస్, డిపిఒ జయసుధ, తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత

**ప్రజాపక్షం/బంట్వారం:** బంట్వారం మండలంలో కేంద్రంలో ఉన్న రైతు వేదికలో 4,36,500 రూ.లు విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కూమార్ ఆదేశాల మేరకు, మండల పార్టీ అధ్యక్షులు బి.పురుషోత్తం రెడ్డి 11 మంది లబ్దిదారులకు సిఎంఆర్ఎస్ చెక్కులను అందచేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆసుపత్రి ఖర్చుల కోసం పేద ప్రజలకు సిఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ పార్టీ జిల్లా కార్యదర్శి పోచారం వేంకటేశం, మర్పల్లి మార్కెట్ కమిటి డైర్కట్ర్ పి.యాదగిరి, ఎస్ నర్సిములు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తదితరులు ఉన్నారు



## ఎమ్మెల్సీ శంభిపూర్ నివాసానికి కెటిఆర్

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ సర్కిల్‌లోని ఎమ్మెల్సి శంభిపూర్ రాజు నివాసానికి కెటిఆర్ తరలివచ్చారు. వరంగల్ జిల్లా కన్నెపల్లి రిజర్వాయర్ పర్యటన నేపథ్యంలో కాన్వాయ్‌లో ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగి ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు ఛాతికి గాయాలు కాగా కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. డిశ్చార్జ్ అయిన అనంతరం శంభిపూర్ రాజు ను కలిసిన కెటిఆర్ యోగక్షేమాలు అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. శంభిపూర్ రాజు నివాసం వద్దకు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీగా చేరుకొని కాబోయే ముఖ్యమంత్రి కెటిఆర్ అని నినాదాలు చేయడంతో ఆయన వారించారు. మాజీ మంత్రులు జగదీశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు కెపి వివేకానంద, ఎం.కృష్ణారావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సకాలంలో ఫిర్యాదుల పరిష్కారం కావాలి

### జాతీయ షెడ్యూల్ తెగల కమిషనర్ జతోతు హుస్సేన్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** సకాలంలో స్పందిస్తూ పారదర్శకంగా వ్యవహరించేవిధంగా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఉండాలని జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ గౌరవ సభ్యులు జతోతు హుస్సేన్ సూచించారు. శనివారం ఆయన చర్లపల్లిలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ టెక్నాలజీ (సిపెట్ ) సంస్థను సందర్శించి సంస్థ అధికారులు, ఉద్యోగుల సంఘ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సంస్థలో షెడ్యూల్ తెగలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులకు సంబంధించి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకొంటున్న విధి విధానాల గురించి ఆయన ఆరా తీసారు. ఈ సందర్భంగా సిపెట్ ప్రధాన సంచాలకులు బి.రవి సంస్థ కార్యకలాపాలపై సమగ్ర ప్రజంటేషన్ ఇచ్చారు. సిపెట్ సాధించిన నైపుణ్యాభివృద్ధి, విజయాలు, విద్యా కార్యక్రమాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలు, సాంకేతిక సేవలు, ప్లాస్టిక్స్, పెట్రో కెమికల్స్ రంగ అభివృద్ధి వివరించారు. ఈ సంస్థ దేశానికి అవసరమైన నైపుణ్యంతో కూడి న మానవ వనరుల తయారీలో ఆధునిక సాంకేతిక సేవలను ఈ సందర్భంగా జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ గౌరవ సభ్యులు జతోతు హుస్సేన్ అభినందించారు. దేశవ్యాప్తంగా ప్రముఖ పరిశ్రమ ల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, శిక్షణార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించిన సంస్థగా సిపెట్ రికార్డు సృష్టించటం గర్వకారణమన్నా రు. ఈ కార్యక్రమంలో జాతీయ షెడ్యూ ల్ తెగల కమిషన్ డైరెక్టర్ పి.కళ్యాణ్‌రెడ్డి, సిపెట్ అధికారులు ఆంజనేయ శర్మ, శ్రీకర్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**ప్రజాపక్షం/తాండూరు:** బషీరాబాద్ మండల పరిధి నంద్యానాయక్ తాండకు చెందిన బిఆర్ఎస్ నాయుకులు గ్రామ ఉపసర్పంచ్ గోపాల్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో నంద్యానాయక్ తాండకు చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు రాజవర్దన్‌రెడ్డి ఆధ్వర్యాన ఎమ్మెల్యేను కలుసుకుని కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



## ప్రభుత్వ ఉపాధ్యాయులూ.. అప్‌డేట్ కావల్సిందే

### పునశ్చరణ శిక్షణాకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఉపాధ్యాయులు పాఠ్య పుస్తక బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల ఆలోచనా సరళిని బేరీజు వేసుకొంటూ వారిని సామాజిక విలువలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దేలా తమ విధి నిర్వహణల్లో మార్పులు చేర్పులు ఉండాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. విద్యార్థులను నైతికంగా, బాధ్యతాయుతంగా దేశ భావి పౌరులుగా తీర్చి దిద్దేందుకు ఎప్పటికప్పుడు తమ బోధనలో ఆధునిక సాంకేతిక, మెళకువలను జోడించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుల పునశ్చరణ శిక్షణాకార్యక్రమానికి ఆయన జిల్లా విద్యాశాఖాధికారి రేణుకాదేవితో కల్సి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు కాలానుగుణంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవ్వాలని, అన్ని రంగాల మాదిరిగానే విద్యారంగంలో సైతం సాంకేతికత చేరిందని, దీన్ని ఉపాధ్యాయులు ముందుగా తమంతట తాము అలవరచుకొని విద్యార్థుల్లో జొప్పించాలన్నారు. విద్యార్థుల్లో బిడియాన్ని పోగొట్టి వేదికలపై తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తపరచే స్థాయికి తీసుకొని రావాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. విద్యార్థుల్లో నేర్చుకోవాలనే జిజ్ఞాస, ఉత్సుకతను ప్రేరేపించగలిగిన నాడే ఉపాధ్యాయ వృత్తికి సార్థకతగా నిలుస్తుందన్నారు. తమ పాఠశాలల్లో ఉండే ఎలాంటి సమస్యలనైనా జిల్లా విద్యాశాఖాధికారితో పాటు తన దృష్టికి తీసుకొని వస్తే పరిష్కార దిశగా ముందుకు వెళుతామన్నారు.



## ఆధునిక బహుళ ప్రత్యేక వైద్యసేవలు అందుబాటులోకి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పట్టణంలో ఆధునిక వైద్య సౌకర్యాలతో ఏర్పాటు చేసిన శ్రీనివాస బహుళ ప్రత్యేక వైద్యశాల శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. జగదాంబ థియేటర్ ఎదురుగా నూతనంగా ఏర్పాటైన ఈ వైద్యశాలను పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, చామకూర భద్రారెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండటం అత్యంత అవసరమన్నారు. ఆధునిక పరికరాలు మెరుగైన వైద్య సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఈ బహుళ ప్రత్యేక వైద్యశాల ఘట్‌కేసర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.సేవాభావంతో ప్రజలకు వైద్యం అందించాలని వైద్యశాల నిర్వాహకుడు పన్నాల శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మచ్చేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ శ్రేణులకు కర్రె రాజేష్ దిశానిర్దేశం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పోచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం చౌదరిగూడలోని చెరుకు బాలయ్య కన్వెన్షన్ హాల్లో డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్ అధ్యక్షతన జరిగింది.సమావేశంలో పార్టీ బలోపేతం కార్యకర్తల సమస్యలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంపై చర్చించారు.ఈ సందర్భంగా కర్రె రాజేష్ మాట్లాడుతూ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు తాను అండగా ఉంటానని ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిస్కారానికి కృషి చేస్తానన్నారు.పార్టీ క్రమశిక్షణకు భంగం కలించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రతి కార్యకర్త సమస్యను తన సమస్యగా భావిస్తూ డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్,మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మార్గదర్శకత్వంలో పార్టీ అభివృద్ధికి కృసి చేస్తానన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రైతు భరోసా,ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయాలని కార్యకర్త సమష్టిగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ కర్రె జంగమ్మ, జిల్లా కార్యదర్శి ఇటికల కృష్ణారెడ్డి, మెట్టు గణేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేష్ గౌడ్, మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్ర మాధవిరాజు, యువజన అధ్యక్షుడు కేశాపావుల వినోద్ కుమార్, బద్దం నరసింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## స్నేహపూర్వక వాతావరణంలో సర్వే పనులు

### అదనపుకలెక్టర్ వెంకటాచారి

**ప్రజాపక్షం /పరిగి :** స్నేహపూర్వక వాతావరణంలో సర్వే పనులు చేపట్టాలని జిల్లా అదనపుకలెక్టర్ వెంకటచారి అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కేపిలక్ష్మీ దేవిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ జాయింట్ సర్వేపై రెవెన్యూ ,ఇరిగేషన్ ,సర్వే శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేవి లక్ష్మీ దేవి పల్లి ఇరిగేషన్ ద్వారా వేల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్‌కు గానుపరిగి మండల సయ్యద్‌పల్లి ,కుల్కచర్ల మండలం అల్లాపూర్ గ్రామాలకు సంబంధించిన 1253 ఎకరాల భూమిని సేకరించివలసిన ఉంటుందని అయన తెలిపారు. సర్వే ప్రక్రియలో ఎలంటి లోపాలకు తావు లేకుండా రైతుల హక్కులను ,సంక్షేమ కాపాడాల్సిన అవసరం ఉందని అయన అన్నారు. సర్వే చేపట్టే క్రమంలో అధికారులు సమవన్వయంతో అంకితభవంతో పని చేయాలని అయన సూచించారు. ప్రాజెక్టు యొక్క ప్రాధ్యానతను ప్రజలకు తెలియజేయలని అయన తెలిపారు. ఈ సమావేంలో ఆర్‌డిఓ వాసుచంద్ర ,తహసీల్దార్ వెంకటలక్ష్మి, పురషోత్తం ,నఫీజ్ పాతిమా,తదితరులు పాల్గొన్నారు.



## విద్యాసంస్థల నిర్వీర్యానికి ప్రభుత్వం కుట్ర



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ప్రభుత్వ విద్య రంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం కుట్రపన్నుతుందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి కుమార్ విమర్శించారు. శుక్రవారం సరూర్ నగర్ మండల కేంద్రంలో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యా సంఘాల ఆధ్వర్యంలో విద్యా సంస్థలను బంద్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న పాలకుల మొండి వైఖరికి నిరసనగా ఈ బంద్ చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ సరూర్ నగర్ మండల కార్యదర్శి పానుగోతు వినోద్ నాయక్, ఎస్ఎఫ్ఐ నాయకులు సామర్తి అభిలాష్, పల్లప్పు మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

## సర్‌పై ప్రజలకు అవగహన కల్పించడంలో అధికారులు విఫలం

సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి కృష్ణ



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** భారత ప్రభుత్వం, దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను, భారత్ ఎన్నికల కమిషన్ ద్వారా రాష్ట్రంలో కూడా సర్ కార్యక్రమాన్ని నియమిత కాల పరిమితితో మొదలుపెట్టింది. ఈ ప్రక్రియను ప్రజల్లో అమలు చేయడంలో అధికారులు పూర్తి విఫలమైయ్యారని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ ఆరోపించారు. శుక్రవారం ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని వార్డుల వారిగా బూతుల వారీగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిపూర్తి చేయుటలకు నియమించినటువంటి బిఎల్‌ఒలు అందుబాటులో ఉండకపోవడం దారుణమన్నారు. బిఎల్‌ఒలు కమ్యూనిటీ హాల్, ప్రభుత్వ ఆఫీసులు, వివిధ కాలనీ సంక్షేమ భవనాల వద్ద ఉన్న బిఎల్‌ఒలు ఎక్కడ ఉన్నారని తెలియని పరిస్థితి ఉందన్నారు. తమ ఓటు ను సర్ ఇచ్చే ఎన్యూమరేషన్ ఫామ్‌నె ఎలా నింపి ఇవ్వల్లో అర్థం కాని పరిస్థితి ప్రజలకు ఉందని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ అధికారులు పరివేక్షణ లేకపోవడం వలనే సర్ ప్రక్రియ నత్తనడకన సాగుతుందని ఆయన ఆరోపించారు.

## ఇంజనీర్ల ట్రైనింగ్‌లో సేవలు అభినందనీయం




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ఇంజనీర్ల ట్రైనింగ్‌లో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా అందిస్తున్న సేవలు అబినందనీయమని ఎస్కీ డైరెక్టర్ కల్నల్ హర్‌పాల్ సింగ్ గ్రేవల్ తెలిపారు. శుక్రవారం గచ్చిబౌలిలోని (ఎస్కి) ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ పనుల్లో రోజురోజుకు విస్తరిస్తున్న దేశంలోని ఇంజనీర్లకు ఎప్పటికప్పుడు శిక్షణ అవసరమని, ఇందుకోసం దేశంలోని 1975లో గచ్చిబౌలిలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాకు అడుగులు పడగా 1981లో ఏర్పాటు చేశారని తెలిపారు. అనాటి నుండి 2026 వరకు ఎంతో మంది ఇంజనీర్లకు శిక్షణ అందించి దేశంలోని వివిధ ప్రాంతాలలో లక్షలాది మంది ఇన్ సర్వీస్ ఇంజనీర్లు ఇక్కడ శిక్షణ పొందారని తెలిపారు.

## అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు



**ప్రజాపక్షం/కొందుర్గు:** అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నదే లక్ష్యంగా సర్ ప్రోగ్రాంను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ వివరించారు. శుక్రవారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని లక్ష్మీ దేవిపల్లి గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ సర్ కార్యక్రమంలో ప్రజలందరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారిణి పుష్పలత, డిప్యూటి తహసీల్దార్ భాస్కర్, సర్పంచ్‌లు రాంచంద్రయ్య, బందయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి, ఆంజనేయులు, సత్యంరెడ్డి, అంకం శేఖర్, పాండు, అజయ్, రవీందర్, రామకృష్ణ, గోపాల్, భారతమ్మ, యాదయ్య, తన్వి పాల్గొన్నారు.


## ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, సమర్థవంతంగా వినియోగించుకునేందుకు కృషి చేయాలని ఫరూఖ్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం ఫరూక్‌నగర్ మండల పరిధిలోని కడియాల కుంట తండా, బూర్గుల, నేరెళ్ల చెరువు, కుందేలుకుంట తండాలలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమాన్ని పరిశీలించి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బూర్గుల సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, కుందేలుకుంట తండా సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, నేరళ్ళచెరువు సర్పంచ్ భూపాల్ యాదవ్, కడియాలకుంట తండా సర్పంచ్ రాజునాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, బసప్ప, దేవునిపల్లి సర్పంచ్ మల్లేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# మత్స్యకారుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/రంగారెడ్డి/తుర్కయంజాల్ :** మత్స్యకారుల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు అండ్ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత ఇంటిగ్రేటెడ్ హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మత్స్యకారులు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే చేపలకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లను విస్తరించడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆధునిక శీతల గిడ్డంగులు, శుద్ధి యూనిట్లు, ప్యాకేజింగ్ కేంద్రాలు, శిక్షణా కేంద్రం, కస్టమ్స్ సదుపాయాలు, భారీ హోల్‌సేల్ మార్కెట్ వంటి అన్ని ఆధునిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వివరించారు. భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ మత్స్య రైతుల దినోత్సవం సందర్భంగా కోహెడలో ఏర్పాటు చేస్తున్న ఎగుమతి ఆధారిత ఇంటిగ్రేటెడ్ హోల్‌సేల్ చేపల మార్కెట్ మత్స్యకారుల అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందన్నారు. బ్లూ రివల్యూషన్ లక్ష్యాలను సాకారం చేస్తూ మత్స్యకారులకు ఆధునిక మార్కెటింగ్ సౌకర్యాలు, గిట్టుబాటు ధరలు, ఎగుమతి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ కోహెడలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్ తెలంగాణ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. విజయవాడ జాతీయ రహదారి,నాగార్జునసాగర్ రహదారి,ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉన్న ఈ ప్రాంతంలో అంతర్జాతీయ ప్రమాణాలతో మార్కెట్ నిర్మాణం చేపట్టడం ద్వారా మత్స్యకారులు, ముదిరాజ్, బెస్త వర్గాలకు ఉపాధి,మార్కెటింగ్ అవకాశాలు కల్పించబడతాయన్నారు. కార్యక్రమంలో ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, రంగారెడ్డి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దూస వెంకటేష్, ఫిషరీస్ అదనపు డైరెక్టర్ మురళీకృష్ణ, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, ఫ్రూట్ మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూధన్ రెడ్డి, మత్స్యకారులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సభలో మత్స్యకారుల నిరసన

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం కోహెడలో ఇంటిగ్రేటెడ్ చేపల మార్కెట్ శంకుస్థాపన అనంతరం నిర్వహించిన సభలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతుండగా చేప పిల్లల పంపిణీ డబ్బులు వెంటనే విడుదల చేయాలని,అర్హులైన మత్స్యకారులకు టూవీలర్ ఫోర్ వీలర్ లను 90 శాతం సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు.దీంతో రంగంలోకి దిగిన పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు.



## గ్రామాల్లో కొనసాగుతున్న సర్



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సర్ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. బిఎల్‌ఒలు అయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్ళి ఎమ్యూనరేషన్ ఫాం పంపిణి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేద ప్రజలకు ఫాం నింపడంపై అవగాహణ లేకపోవడంతో ప్రజలు తీవ్ర అందోళనకు గరైనారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అధికారులు అయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి వారి సహకారంతో ఫాం నింపుతున్నారు. దీంతో సర్ కార్యక్రమంలో విజయవంతంగా సాగుతుంది. మేడిపల్లి గ్రామంలో ఉప సర్పంచ్ దెంది మధుకర్‌రెడ్డి అంగన్ వాడీ కార్యకర్తలు ఫాం నింపుతూ అండగా నిలుస్తున్నారు. అర్హులు సర్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని మధుకర్‌రెడ్డి కోరారు.

## గడువులోగా 'సర్' డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి

కలెక్టర్ సి. నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి సంబంధిత ఎన్నికల నమోదు అధికారులు,సహాయ ఎన్నికల నమోదు అధికారులు,జోనల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియ పురోగతిపై జోనల్ కమిషనర్లు, ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు, ఎన్నికల విభాగం అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బిఎల్‌ఓలు సేకరించిన సమాచారాన్ని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కచ్చితత్వంతో డిజిటలైజ్ చేయాలని సూచించారు. ప్రతి దరఖాస్తును నిబంధనలు, మార్గదర్శకాల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. బిఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి పూర్తి స్థాయిలో సమాచార సేకరణ చేపట్టి, సేకరించిన వివరాలను వెంటనే డిజిటలైజేషన్ చేయాలని ఆదేశించారు. డిజిటలైజేషన్ ప్రక్రియ జిల్లాలో సోమవారం నాటికి కనీసం 60 శాతం పురోగతి సాధించేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పూర్తి చేసి, ప్రతిరోజూ పురోగతిని సమీక్షిస్తూ లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డేటా నమోదు సమయంలో నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి సాంకేతిక లేదా సమాచార లోపాలు లేకుండా అత్యంత జాగ్రత్తతో ప్రక్రియను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## ప్రజావసరాలకు అనుగుణంగా మౌలిక సౌకర్యాలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శుక్రవారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆవరణలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.36లక్షలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వకుండా కృషి చేస్తున్నామని, పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామని, ఇందుకు ప్రజలందరు సహకరించేందుకు కృషి చేయాలని కోరారు. చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీత, మున్సిపల్ ఏఈ సాయి కిరణ్, నరేష్, కౌన్సిలర్లు కొప్పునూరి ప్రవీణ్, రాజునాయక్, మురళీమోహన్ (అప్పి), కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖదీర్, లతా శ్రీశైలం గౌడ్, నేతలు సాధిక్, అనిల్‌కుమార్, జె.సుదర్శన్ గౌడ్, రవికుమార్ గుప్తా, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్, మహబూబ్, రవితేజ, మనీష్ పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నదే లక్ష్యం

**ప్రజాపక్షం/కొందుర్గు:** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నదే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోగురి పురుషోత్తంరెడ్డి అన్నారు. శుక్రవానం కొందుర్గు మండల పరిధిలోని లక్ష్మీ దేవిపల్లి గ్రామంలో లబ్ధిదారుడు రవినాయక్ లక్ష్మీ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని గృహ ప్రవేశం చేయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మల్లేష్ గౌడ్, సర్పంచ్ దామోదర్, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ నర్సింలు, జీబి కృష్ణ, మాదారి నర్సింలు, బిఎల్‌పి రమేష్, జిల్లెల ప్రవీణ్, పెంటయ్య, ఈశ్వర్, జింకల చెన్నయ్య, రాంచంద్రయ్య, ఇందిరమ్మ కమిటి సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటు హక్కు



**ప్రజాపక్షం/కేశంపేట:** ప్రజాస్వామ్యం బలోపేతం చేసేందుకు ఓటు హక్కు ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరు ఓటు హక్కును జాబితాలో సరి చూసుకోవాలని కేశంపేట మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం కేశంపేట మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామంలో చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అనుమగల్ల రమేష్ మాట్లాడుతూ సమగ్ర ఓటరు జాబితా సవమరణకు ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య యాదవ్, బిఎల్‌ఒ భాగ్యమ్మ, బుక్ కీపర్ మంగమ్మ, నర్సింలు, చంద్రయ్య, మహేష్, మల్లేష్, భరత్, శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానలలో వైద్యసేవలు మెరుగుపరచాలి

జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.స్వర్ణ కుమారి

రాజేంద్రనగర్ మండలం పాండురంగ నగర్, బుద్వేల్ బస్తీ దవాఖానల ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** బస్తీ దవాఖానలలో వైద్య సేవలను మెరుగుపరచాలని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి(డిఎం అండ్ హెచ్ఒ)డాక్టర్ డి.స్వర్ణ కుమారి ఆదేశించారు. శుక్రవారం రాజేంద్రనగర్ మండలం పాండురంగ నగర్, బుద్వేల్ బస్తీ దవాఖానలను డిఎంహెచ్ఒ డాక్టర్ స్వర్ణ కుమారి ఆకస్మికంగా సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలతోపాటు ఓపి సేవలు, ఔషధాల లభ్యత, ప్రయోగశాల సేవలు, రోగుల నమోదు, గర్భిణీలు, చిన్నారులకు అందిస్తున్న ఆరోగ్య సేవలు, టీకాల కార్యక్రమం, వైద్య సిబ్బంది హాజరు, పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన, వైద్య సేవలు సకాలంలో అందించాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రతి రోగిని మర్యాదపూర్వకంగా ఆదరించి చికిత్స అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అదేవిధంగా వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అప్రమత్తతతో పనిచేయాలని, జ్వరం, డెంగ్యూ, మలేరియా వంటి లక్షణాలతో వచ్చే రోగులను వెంటనే గుర్తించి అవసరమైన చికిత్స అందించాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రోగులను వైద్యం సకాలంలో అందే విధంగా వైద్యులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.బస్తీ దవాఖానల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగించాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని డిఎంహెచ్ఒ సూచించారు. ఈ తనిఖీలలో సంబంధిత వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు

అదనపు కలెక్టర్ డా.కిరణ్మయి




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యతమైన, మెరుగైన వైద్యం అందిస్తున్నామని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డా.కిరణ్మయి పేర్కొన్నారు. శుక్రవారం వనస్థలిపురంలో జిజిఎం మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.బి. నాగేందర్ అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రోగులను వైద్యం సకాలంలో అందే విధంగా వైద్యులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిని మరింతా అభివృద్ధి చేయడంతో పాటు రోగులకు అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్ఒ స్వర్ణకుమారి, జిఎంసి ప్రిన్సిపల్ త్రివేణి, సిఎస్ఆర్ఎంఒ డా.దామోదర్, హైదరాబాద్ సిటీ ఎంప్లాయిస్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ప్రతినిధులు, ఐఎంఎ అసోసియేషన్ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, టిజిఎంఎస్ఐడిసి ఇంజనీర్, ఎఓ, హెచ్ఓడి, ఆర్ఎంఒ తదితరులు పాల్గొన్నారు.

### ఏడాదిలోపు ఎంపి ల్యాడ్స్ పనులు పూర్తి

**రంగారెడ్డి:** ఎంపి ల్యాడ్స్ నిధులతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఏడాదిలోపు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిసెట్టి ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఎంపి ల్యాడ్స్ పనుల పురోగతిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతు ప్రతి పనిని సమగ్ర ప్రణాళికతో అమలు చేస్తూ, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎంపి ల్యాడ్స్‌తో పాటు ఇతర ప్రభుత్వ పథకాల అమలులో కూడా ప్రతి పనికి అవసరమైన అంశాలతో కూడిన చెక్‌లిస్ట్‌ను రూపొందించి, దశలవారీగా పరిశీలిస్తూ పనులు చేపట్టాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 148 ఎంపి ల్యాడ్స్ పనులను నెల రోజుల్లో గణనీయంగా తగ్గించాలన్నారు. 16వ,17వ ఎంపి నిధులతో చేపట్టిన పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, అమలు సాధ్యం కాని పనులకు రద్దు ప్రతిపాదనలు పంపించాలని, ఫీజిబిలిటీ నివేదికలు, లైన్ ఎస్టిమేట్లను 15 రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో సిపిఒ సౌమ్య, సంబంధిత మున్సిపల్, ఇంజినీరింగ్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సవరణ కార్యక్రమానికి శ్రీకారం

**ప్రజాపక్షం/వెంగళరావునగర్ :** మధురానగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ సహకారంతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమం ఈనెల 22 వరకు ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మధురానగర్‌లోని సాగి రామకృష్ణంరాజు సీనియర్ సిటిజన్స్ డిగ్నిటరీ హాల్లో నిర్వహించనున్నట్లు సంక్షేమ సమితి కార్యవర్గం తెలిపింది. ఎస్ఐఆర్ గణన ప్రక్రియను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మధురానగర్ సంక్షేమ సమితి కార్యవర్గం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## గోదాంలో అగ్ని ప్రమాదం

**ప్రజాపక్షం/చాదర్‌ఘాట్:** డెకరేషన్ వస్తువుల గోదాంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే మూసీ సమీపంలోని గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అందులోని సిబ్బంది భయంతో పరుగులు తీశారు. ఈ ప్రమాదంతో పక్కనే ఉన్న దాదాపు దుకాణాలకు మంటలు అంటుకున్నాయి. కార్ రిపేర్ దుకాణానికి మంటలు అంటుకోవడంతో అందులోని కార్లు దగ్ధమయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న మూడు ఫైర్ ఇంజన్లతో ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పడం జరిగింది. ఆస్తి నష్టం ఎంత? అనేది ఇంకా తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలాఉండగా ఘటనాస్థలాన్ని ఎమ్మెల్యే బలాల సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.

## ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

**ప్రజాపక్షం/బంజారాహిల్స్ :** మద్యం మత్తులో వేగంగా దూసుకువచ్చిన కారు సినీ హీరో ధర్మ మహేష్ ఇంట్లోకి దూరింది. ఈ ఘటన ఫిలింనగర్‌లో చోటుచేసుకుంది. వెంటనే అప్రమత్తమైన ధర్మ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సంబంధిత యువకులను అదుపులోకి తీసుకున్నారు. కారులో ఉన్న వారు మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

## అంధత్వ నివారణ లక్ష్యం

**ప్రజాపక్షం/బంజారాహిల్స్ :** అంధత్వ నివారణ కోసం కృషి చేస్తున్న 'ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల'కు అంతర్జాతీయ గౌరవం లభించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) ఈ సంస్థను మరో నాలుగేళ్ల కాలానికి (2030 వరకు) తన అధికారిక 'కోలాబరేటింగ్ సెంటర్'గా తిరిగి ఎంపిక చేసింది. మొదటిసారిగా ఇరవై ఐదు సంవత్సరాల క్రితం అంటే 2001లో ఈ గుర్తింపును పొందగా.. ఇప్పటికీ ఆ హోదాను కొనసాగిస్తున్న ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ప్రపంచవ్యాప్తంగా డబ్ల్యుహెచ్ఓ డైరెక్టర్ జనరల్ గుర్తించిన పదకొండు అత్యుత్తమ కంటి సంరక్షణ సంస్థలలో ఒకటిగా నిలిచింది. ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గుళ్ళపల్లి ఎన్ రావు మాట్లాడుతూ, ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల, డబ్ల్యుహెచ్ఓ మధ్య ప్రజారోగ్య కంటి సంరక్షణను ముందుకు తీసుకెళ్లడంలో గత రెండు దశాబ్దాలుగా ఉన్న భాగస్వామ్యాన్ని ఈ గుర్తింపు చెప్తుందన్నారు.

## ఫీజుల దోపిడీని అరికట్టాలి

**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట :** విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా జరిగింది. బంద్‌లో భాగంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో బండ్లగూడ మండలం పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలను మూసివేయించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఏ.కృష్ణనాయక్, మండల కమిటీ సభ్యులు రాజేష్, నవీన్, నాగేష్, మహేష్, కిరణ్, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## చాక్నావాడీ నాలా పనుల్లో జాప్యం

### ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు, వ్యాపారులు

**ప్రజాపక్షం/గోషామహల్ :** కీలకమైన చాక్నావాడి నాలా పనులు నత్తనడకన సాగుతుండటంతో స్థానిక ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత నాలుగేళ్లుగా నాలా పనుల పేరుతో అధికారులు చేస్తున్న నిర్లక్ష్య వైఖరిపై నిరసన జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు గోషామహల్ డివిజన్ సీనియర్ నాయకులు సురేష్ ముదిరాజ్ పిలుపు మేరకు, స్థానిక వ్యాపారులు మరియు నివాసితులు దారుసలాం చౌరస్తా వద్ద భారీ ధర్నా నిర్వహించారు. నాలా పనుల్లో జరుగుతున్న జాప్యం వల్ల నిత్యం ఎదురవుతున్న ఇబ్బందులను వారు ఎండగట్టారు. నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు నాగేందర్‌గౌడ్, ఆర్‌వి మహేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాలకు దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం/ముషీరాబాద్ :** బోనాల ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన నిధుల కోసం దరఖాస్తు చేసుకోవాలని బీఆఎర్ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఆషాఢం బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం ప్రతి యేటా ఆర్థిక సాయం అందిస్తుందని, ఈ క్రమంలోనే ఈసారి పండుగ కోసం నియోజవ ర్గంలోని అన్ని ప్రాంతాలకు చెందిన అమ్మవారి దేవాలయ కమిటీల సభ్యులు దరఖాస్తు చేసుకో వాలన్నారు. ఈ నెల 25లోపు దరఖాస్తులు అందిచాలని, వివరాల కోసం 93922 22117లో సంప్రదించాలని సూచించారు.

## మాజీ కార్పొరేటర్ పర్యటన

**ప్రజాపక్షం/అంబర్‌పేట్ :** బాపూనగర్‌లో మాజీ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు చెట్ల కొమ్మలను తొలగించాలని విజయ్‌కుమార్‌గౌడ్‌ను కోరారు. దీంతో ఆయన సంబంధిత ఆర్టికల్చర్ సిబ్బందిని పిలిపించి విద్యుత్ వైర్లపై, నివాస గృహాలపై ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగింపజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేష్, పమ్ము, స్థానిక బస్తి వాసులు వెంకటేష్, కృష్ణ, హార్టికల్చర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యా సంస్థల బంద్ విజయవంతం

### కదంతొక్కిన ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఎఐవైఎఫ్

**ప్రజాపక్షం/మలక్‌పేట్/అంబర్‌పేట్/హిమాయత్‌నగర్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల విలీనం, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేయకపోవడం, విద్యాసంస్థలకు తగిన నిధులు కేటాయించకపోవడం ద్వారా ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలహీనపరుస్తోందని... మరో వైపు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను అంగడి సరుకుగా చేసి ఫీజులు, డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజుల పేరుతో తల్లిదండ్రులను తీవ్రంగా దోచుకుంటున్నా ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తోందని.. ఇది విద్యను హక్కు నుంచి వ్యాపారంగా మార్చే ప్రమాదకర పరిణామమని.... నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన విద్యాసంస్థల బంద్ సంపూర్ణంగా విజయవంతం అయ్యిందని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నేతలు తెలిపారు. బంద్ సందర్భంగా హిమాయత్‌నగర్, హైదర్‌గూడా, కాచిగూడలోని ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కాలేజ్‌లో తరగతులను బహిష్కరించి, నినాదాలు ఇస్తూ బంద్ చేపట్టడం జరిగింది.

**విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి :** తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త బందు పిలుపులో భాగంగా జూలై 10న హైదరాబాద్ జిల్లా మలక్‌పేట్ నియోజకవర్గం కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతంగా సాగిందని ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనిల్ కుమార్, చైతన్య యాదవ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి నవీన్, ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు, నెర్లకంటి శ్రీకాంత్, బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఇఒలు, డిఇఒలు, లెక్చరర్లు తదితర విద్యాశాఖ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ఈ బంద్ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొంటూ, మలక్పేట్ నియోజకవర్గం కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలాలు బంద్ విజయవంతం జరిగిందన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు వామపక్ష విద్యార్థి సంఘాలు, ఏఐఎస్ఎఫ్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జోసెఫ్ భాను, ఉపాధ్యక్షుడు అరుణ్ కుమార్, జిల్లా నాయకులు సుమన్ (ఓయూ) రామ్ చరణ్, కరుణాకర్, కిషోర్, పిడిఎస్‌యూ నేతలు నాగరాజు పాల్గొన్నారు.






## కార్మిక నేత సతీష్‌కు నివాళ్లు

**ప్రజాపక్షం/సైదాబాద్ :** జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు చెవ్వ సతీష్ కుమార్ పార్థివ దేహానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ నివాళులర్పించారు. చెవ్వ సతీష్ కుమార్ గురువారం పరమపదించిన నేపథ్యంలో మధుయాష్కి సైదాబాద్‌లోని చెవ్వ సతీష్ నివాసానికి వెళ్లి పార్థివదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. నివాళ్లు అర్పించిన వారిలో జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ నేతలు అల్లి శ్రావణ్ కుమార్, రాఘవేందర్, రాజు, కాంగ్రెస్ నాయకులు దేరంగుల కృష్ణ, నోముల రవీందర్ గౌడ్, కొండోజు శ్రీనివాస్, విద్యారెడ్డి, జక్కా సందీప్ తదితరులు ఉన్నారు.

## చీరల పంపిణీలో నిర్లక్ష్యం

**ప్రజాపక్షం/నల్లకుంట :** కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన ఇందిరమ్మ చీరలను అర్హులైన పేద మహిళలకు పంపిణీ చేయడంలో జిహెచ్ఎంసి అంబర్‌పేట్ సర్కిల్ అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నల్లకుంట డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు గంగిశెట్టి లిఖిత గౌడ్ ఆరోపించారు. శుక్రవారం తిలక్‌నగర్‌లోని 81వ వార్డ్ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె మహిళలతో కలిసి సందర్శించి ఇందిరమ్మ చీరల పంపిణీ గురించి అక్కడి వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం లిఖిత గౌడ్ మీడియాతో మాట్లాడుతూ, నల్లకుంట డివిజన్‌కు చెందిన చాలామంది పేద మహిళలకు ఇంతవరకు ఇందిరమ్మ చీరలు అందలేదని తెలిపారు. తిలక్‌నగర్ వార్డు కార్యాలయానికి చీరల కోసం మహిళలు వెళితే అక్కడ పనిచేస్తున్న వారు టిఆర్టి క్వార్టర్స్‌కు వెళ్ళమంటున్నారని, అక్కడికి వెళ్తే కాచిగూడ కమేల వార్డు కార్యాలయానికి వెళ్ళమంటూ రోజుల తరబడి తిప్పించుకుంటున్నారని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి మహిళలకు చీరలు అందించడం జరిగిందని ఆమె గుర్తు చేశారు. నల్లకుంట డివిజన్ పరిధిలోని అర్హులైన పేద మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.






## క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

### ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్

**ప్రజాపక్షం/సికింద్రాబాద్ :** ఔత్సాహిక క్రీడాకారులకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు విజయపురి కాలనీలో 'పికిల్ బాల్ కోర్టు' పేరిట నెలకొల్పిన క్రీడల ప్రాంగణాన్ని పద్మారావు గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..... యువతతో పాటు అన్ని వయసుల వారు శారీరక, మానసిక ఉల్లాసాన్ని ఏర్పరుచుకోవాలని పద్మారావు గౌడ్ సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నేత కిశోర్ కుమార్‌గౌడ్, సునీత తదితరులు పాల్గొన్నారు.



## బస్తీ దవాఖానాల్లో వైద్యుల కొరత

**ప్రజాపక్షం/ముషీరాబాద్ :** బస్తీ దవాఖానాలో మూడు నెలల నుంచి డాక్టర్ లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్‌లోని స్థానిక ప్రజలు అభ్యర్థన మేరకు శుక్రవారం అరుంధతినగర్ బస్తీ దావఖాన సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె డిహెచ్ఎంవోతో ఫోన్లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్‌కు ఉద్యమకారుల వినతి

**ప్రజాపక్షం/అంబర్‌పేట్ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని అంబర్‌పేట్ టీజేఏసీ కన్వీనర్ గుడిసె రూబీ స్టీవెన్‌సన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం అంబర్‌పేట్ టీజేఏసీ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు శుక్రవారం అంబర్‌పేట్ తహశీల్దార్ అన్వర్ హుస్సేన్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గుడిసె రూబీ స్టీవెన్ సన్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో అంబర్‌పేట్ ఉద్యమకారులు హైదరాబాద్ నుంచి నిర్మల్ (ఆదిలాబాద్) వరకు 360 కిలోమీటర్లు పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. కేవలం తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా తాము చేసిన పాదయాత్రకు ప్రభుత్వ పరంగా తగిన గుర్తింపు లభించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్లు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం రూ.25 వేల పెన్షన్, ఆరోగ్య బీమా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనే తమ జీవిత లక్ష్యంగా పనిచేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం పథకాల అమలులో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో జేఏసీ నాయకులు జహంగీర్, సూర్యవంశీ, వర్కాల శ్రీకాంత్, వెంకటేష్, ఆలంపల్లి రవి తదితరులు ఉన్నారు.



# మేనేజర్లకు చార్జ్ మెమోలు

### తప్పుడు సమాచారం ఇచ్చిన జలమండలి మేనేజర్లు
### ఫిర్యాదుల పరిష్కారంలో బాధ్యతతో వ్యవహరించాలి
### జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ :** ప్రజల ఫిర్యాదుల విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చిన 11 మంది మేనేజర్లకు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి చార్జ్ మెమోలు జారీ చేశారు. క్యూర్ పరిధిలోని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణకు సంబంధించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో పూర్తి బాధ్యతతో వ్యవహరించకుండా.. పరిష్కారం కాని ఫిర్యాదుల విషయంలో పరిష్కారమైనట్లు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు గుర్తించడం జరిగిందని.. అందుకు బాధ్యులుగా మేనేజర్లను నిర్ధారించి చార్జ్‌మెమోలు జారీ చేయడం జరిగిందని అశోక్‌రెడ్డి తేల్చిచెప్పారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి.. వాస్తవంగా సమస్య పరిష్కారమైన తర్వాత మాత్రమే ఆన్‌లైన్‌లో రాసాల్వ్‌గా నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తప్పుడు వ్యవహారాలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయడమే కాకుండా జలమండలి సేవలపై ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు, లోప్రెషర్, సీవరేజ్ ఓవర్ ఫ్లో, కలుషిత నీటి సరఫరా, దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్, రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు తదితర సమస్యలపై ప్రజలు జలమండలి మెట్రో కస్టమర్ కేర్‌తో పాటు సోషల్ మీడియా వేదికలైన వెబ్‌సైట్లు, ఎక్స్(ట్విట్టర్), ఫేస్‌బుక్ తదితర డిజిటల్ మాధ్యమాల ద్వారా సైతం ఫిర్యాదులు నమోదు చేస్తున్నారని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ప్రతి ఫిర్యాదు నమోదైన వెంటనే సంబంధిత అధికారులకు ఆన్‌లైన్‌లో కేటాయించబడటంతో పాటు, ఫిర్యాదుదారునికి ఫిర్యాదు నమోదైనట్లు మొబైల్‌కు ఎస్ఎంఎస్ సందేశం పంపడం జరుగుతుందని.. అదేవిధంగా, అధికారులు సంబంధిత సమస్య క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిష్కారమైన అనంతరం మాత్రమే ఆ ఫిర్యాదును పరిష్కరించినట్టుగా నమోదు చేసి, ఫిర్యాదుదారునికి సమస్య పరిష్కరించినట్లు మరో మొబైల్‌కు ఎస్ఎంఎస్ రిసాల్వ్ అని పంపే విధానం అమల్లో ఉందని.. అయితే, ఇటీవల నిర్వహించిన సమీక్షలో 11 మంది మేనేజర్లు క్షేత్రస్థాయిలో ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్కరించకుండానే పరిష్కరించినట్టు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు గుర్తించినట్లు అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ చర్య ప్రజలను తప్పుదోవ పట్టించడమే కాకుండా, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీసేదిగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన 11 మంది మేనేజర్లకు ఛార్జ్ మెమోలు జారీ చేసినట్లు ఎండీ తెలిపారు. శాఖ విధివిధానాలను ఉల్లంఘించే ఇటువంటి చర్యలను జలమండలి ఏమాత్రం సహించబోదని స్పష్టం చేశారు. ఇకపై క్షేత్రస్థాయిలో సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించకుండా ఫిర్యాదులను పరిష్కరించినట్టుగా నమోదు చేసినట్లు తేలితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు అనివార్యమని హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం, పారదర్శకమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను అమలు చేయడం, జలమండలిపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం ప్రతి అధికారి, ఉద్యోగి బాధ్యత అని ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు.




## గంగపుత్రులను ఉద్యమకారులుగా గుర్తించాలి

### టీజీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ ఖన్నా

**ప్రజాపక్షం/బేగంపేట్ :** తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న సాంప్రదాయ మత్స్యకార గంగపుత్రులను తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించాలని.. వారికి రాజకీయంగా సముచిత ప్రాధాన్యత కల్పించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ గంగపుత్ర సంఘం (టీజీఎస్) రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర కోరారు. బేగంపేట్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జె.చిన్నారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాజేష్‌ఖన్నా మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో సాంప్రదాయ మత్స్యకార గంగపుత్ర కులస్తులు కేవలం చేపల వేట, వాటిని అమ్ముకోవడంపైనే ఆధారపడి జీవిస్తూ తీవ్ర పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంగపుత్రుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన డాక్టర్ చిన్నారెడ్డి.. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.



## లీన్ సిక్స్ సిగ్మా శిక్షణ

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఆసుపత్రి పరిపాలనలో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచడంలో రోగులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో 'సిక్స్ సిగ్మా' ఆధునిక నిర్వహణ విధానం ఎంతగానో దోహదపడుతుందని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్ అన్నారు. నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) పరిపాలన విభాగం ఆధ్వర్యంలో, సిక్స్ సిగ్మా ట్రైనింగ్ కోఆర్డినేటర్ డా. మార్త రమేష్ సమన్వయంతో మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ మేనేజ్మెంట్ విద్యార్థులు, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్స్ కోసం ఏర్పాటు చేసిన 'లీన్ సిక్స్ సిగ్మా బ్లాక్ బెల్ట్' 3 రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిమ్స్ పాత భవనంలోని లెర్నింగ్ సెంటర్లో ప్రారంభమైంది. కార్యక్రమంలో నిమ్స్ డీన్ పి.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పరంజ్యోతి, మెడికల్ సూపరింటెండెంట్ డా.నిమ్మ సత్యనారాయణ, పరిపాలన విభాగం హెచ్ఓడీ డా.లక్ష్మీ భాస్కర్, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డా.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## లష్కర్ బోనాలకు పటిష్ట బందోబస్తు

**ప్రజాపక్షం/సికింద్రాబాద్ :** సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి అమ్మవారి బోనాల జాతరకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత మూర్తి వెల్లడించారు. జాతర భద్రతా ఏర్పాట్లపై సోమసుందరం వీధిలోని విశ్వకర్మ సంఘం భవనంలో అన్ని శాఖల అధికారులతో ఆమె ఒక సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. బోనాల సమర్పణ కోసం రెండు ప్రత్యేక క్యూ లైన్లు, సాధారణ భక్తుల దర్శనం కోసం మరో నాలుగు లైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు డీసీపీ వివరించారు. ఆలయ ప్రాంగణంతో పాటు చుట్టుపక్కల పరిసర ప్రాంతాలన్నింటినీ పూర్తిగా సీసీ కెమెరాల నిఘా నీడలోకి తీసుకువస్తున్నామని చెప్పారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా షీ టీమ్స్ రంగంలో ఉంటాయని, దొంగతనాలు, చైన్ స్నాచింగ్లు జరగకుండా నిరోధించేందుకు మఫ్టీలో పోలీసులను భారీగా మోహరిస్తున్నామని తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ప్రజల నుంచి వచ్చే సూచనలు, సలహాలను పరిశీలించి వెంటనే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమన్వయ సమావేశంలో ఏసీపీలు శ్రీధర్, యాదగిరి, శ్రీనివాస్, శంకర్ రాజు, సీఐలు రవి కుమార్, సురేష్లతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది, మహంకాళి ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, నూతన ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## బిజెపి మహిళా వ్యతిరేకి


### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే విమర్శ



**న్యూఢిల్లీ:** బిజెపి 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' మహిళా వ్యతిరేక, దళిత వ్యతిరేక వైఖరిని మీరట్‌లో దళిత విద్యార్థిని లలితా గౌతమ్ హత్య ఘటన మరోసారి రుజువు చేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. బాధిత కుటుంబం న్యాయం కోసం వేడుకుంటుంటే, వారికి న్యాయం చేయాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా, న్యాయం కోరుతున్న వారి గొంతును అణచివేయడంలో నిమగ్నమైందని విమర్శించారు. పోలీసుల వివరాల ప్రకారం, మీరట్‌లోని టిపి నగర్ ప్రాంతానికి చెందిన లలితా గౌతమ్ మే 15న అదృశ్యమయ్యారు. మే 17న రోహ్తా ప్రాంతంలో ఆమె మృతదేహం లభించింది. ప్రధాన నిందితుడిని మే 18న అరెస్టు చేయగా, ఆధారాలను నాశనం చేసిన ఆరోపణలపై మరో వ్యక్తిని తర్వాత అరెస్టు చేశారు. దర్యాప్తులో మరికొందరి ప్రమేయం వెలుగులోకి రావడంతో, నిరసన కార్యక్రమాల సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి ఏడుగురిని అరెస్టు చేసి, 30 మందికిపైగా వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. వీరిలో 25 మందికి పైగా గుర్తుతెలియని వ్యక్తులే ఉన్నారని పోలీసులు తెలిపారు. కాగా, జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాలను ప్రస్తావించిన ఖర్గే, 2013 నుంచి 2024 మధ్య దేశంలో మహిళలపై నేరాలు దాదాపు 42.6 శాతం, షెడ్యూల్డ్ కులాలపై నేరాలు సుమారు 41 శాతం పెరిగాయని పేర్కొన్నారు. ప్రతి రెండు గంటల మూడు నిమిషాలకు ఒక దళిత మహిళ అత్యాచారానికి గురవుతోందని, రోజుకు సగటున 12 దళిత మహిళలపై అత్యాచార కేసులు నమోదవుతున్నాయని ఆయన ఆరోపించారు. హత్రాస్, ఉన్నావ్ ఘటనల్లోనూ బాధితుల గొంతును అణచివేసిన ప్రభుత్వం, ఇప్పుడు మీరట్‌లో కూడా అదే విధానాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. బాధిత కుటుంబానికి లాఠీలు, గృహనిర్బంధం కాకుండా న్యాయం అందించాలని, నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. దళితులు, అణగారిన వర్గాల స్వరం మరింత బలపడుతుందని, అది బిజెపి అధికార పీఠాన్ని కూల్చివేస్తుందని ఖర్గే వ్యాఖ్యానించారు.

## బరువు తగ్గినా..
## ఉత్సాహంగానే ఉన్నాను

### పర్యావరణ ఉద్యమ కారుడు వాంగ్‌చుక్ 13వ రోజుకు చేరిన నిరవధిక నిరశన



**న్యూఢిల్లీ:** విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష 13వ రోజుకు చేరుకుంది. విద్యా పరీక్షల్లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై ప్రభుత్వాన్ని జవాబుదారిగా చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ కాక్‌రోచ్ జనతా పార్టీ (సిజెపి) నిర్వహిస్తున్న ఆందోళనకు మద్దతుగా ఆయన ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఆందోళన 21వ రోజుకు చేరుకుంది. కాగా, నిరశన దీక్ష చేస్తున్న వాంగ్‌చుక్ తన ఆరోగ్య పరిస్థితిపై శుక్రవారం స్పందిస్తూ, ప్రారంభ రోజులతో పోలిస్తే ప్రస్తుతం తనలో ఆకలి భావన స్థిరపడిందని వ్యాఖ్యానించారు. దీర్ఘకాల నిరాహార దీక్ష కారణంగా శరీరంలోని కొవ్వుతో పాటు కండరాలు కూడా తగ్గిపోయాయని, ఎముకలు కనిపించే స్థాయికి బరువు తగ్గినా ఇంకా ఉత్సాహంగానే ఉన్నానని చెప్పారు. తన ఇష్ట ప్రకారమే శాంతియుతంగా నిరసన తెలుపుతున్నానని, తనను బలవంతంగా అక్కడి నుంచి తొలగించే ప్రయత్నం చేస్తే అది రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కింద ఉన్న శాంతియుత నిరసన హక్కుకు భంగం కలిగించినట్లేనని ఆయన స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, పరీక్షల నిర్వహణలో జవాబుదారీతనం కోసం విద్యార్థులకు మద్దతుగా తాను ఈ దీక్ష చేస్తున్నానని వాంగ్‌చుక్ తెలిపారు. అలాగే లడఖ్‌కు సంబంధించిన పెండింగ్ అంశాలను పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే పరిష్కరించాలని కోరారు. ఇటీవల పరీక్షల వ్యవహారాలకు సంబంధించి విద్యార్థుల ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో పెరుగుతున్న అసంతృప్తిని తగ్గించాలంటే పార్లమెంట్ సమావేశాలకు ముందే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాను ఆమోదించాలని కూడా సూచించారు. కాగా, సిజెపి ప్రతినిధుల ప్రకారం, దీక్ష ప్రారంభమైనప్పటి నుంచి వాంగ్‌చుక్ సుమారు 7.5 కిలోల బరువు కోల్పోయారు. ఆయన రక్తంలో చక్కెర స్థాయిలు నిరంతరం తక్కువగానే ఉన్నాయి. వైద్య బృందం ఆయన ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 20న పార్లమెంట్ వైపు శాంతియుత ర్యాలీ నిర్వహిస్తామని ఆందోళనకారులు ప్రకటించారు.

# దేశమంతటా వ్యాపించిన రుతుపవనాలు

## సాధారణం కంటే ఒక రోజు ఆలస్యం




**న్యూఢిల్లీ :** భారతదేశంలో నైరుతి రుతుపవనాల స్థితి జూన్ నెలలోని బలహీన దశ నుంచి గణనీయంగా కోలుకుని, ప్రస్తుతం చురుకైన దశలోకి ప్రవేశించింది. ఈనెల 9 నాటికి నైరుతి రుతుపవనాలు దేశంలోని మిగిలిన రాజస్థాన్, హర్యానా, పంజాబ్ ప్రాంతాలకు కూడా విస్తరించడంతో, శుక్రవారం నాటికి భారతదేశమంతటా రుతుపవనాలు పూర్తిగా వ్యాపించాయి. ఇది సాధారణ తేదీ కంటే కేవలం ఒక రోజు ఆలస్యంగా జరిగినప్పటికీ, ఈనెల మొదటి వారం నుంచి వర్షాల తీవ్రత వేగంగా పెరగడం వల్ల దేశవ్యాప్తంగా వర్షాకాల పరిస్థితులు గణనీయంగా మెరుగుపడ్డాయి. అయితే, జూన్ నెలలో వర్షపాతం గణనీయంగా తక్కువగా నమోదైంది. ముఖ్యంగా మధ్య భారతదేశం, వాయవ్య భారతదేశం, గంగానది మైదాన ప్రాంతాలు, దక్షిణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు కనిపించాయి. దీనివల్ల ఖరీఫ్ పంటల విత్తనాలు ఆలస్యమయ్యాయి. కానీ, జులై ప్రారంభంలో వరుసగా ఏర్పడిన అల్పపీడన వ్యవస్థలు, బలపడిన రుతుపవన ద్రోణి, అరేబియా, బంగాళాఖాతం సముద్రాల నుంచి పెరిగిన తేమ ప్రవాహం కారణంగా దేశవ్యాప్తంగా తొమ్మిది రోజుల పాటు దాదాపు నిరంతర వర్షాలు కురిశాయి. ఫలితంగా దేశవ్యాప్తంగా నమోదైన వర్షపాతం లోటు గణనీయంగా తగ్గింది. భారత వాతావరణ శాఖ (ఐఎండి) తాజా గణాంకాల ప్రకారం, శుక్రవారం నాటికి దేశవ్యాప్తంగా మొత్తం వర్షపాతం లోటు సుమారు 14–15 శాతం పరిధికి తగ్గింది. వర్షపాతం పరంగా ఇది మెరుగుదలే అయినప్పటికీ, దేశంలోని అన్ని ప్రాంతాల్లో సమానంగా వర్షాలు కురవడం లేదన్నది ప్రధాన ఆందోళనగా మిగిలింది. కొన్ని రాష్ట్రాల్లో సాధారణం కంటే చాలా ఎక్కువ వర్షాలు పడుతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఇంకా సాధారణ స్థాయికి తక్కువ వర్షపాతమే నమోదవుతోంది. వ్యవసాయ నిపుణులు మొత్తం వర్షపాతం కంటే వర్షాల సమాన విస్తరణే ఖరీఫ్ పంటలకు అత్యంత కీలకమని పేర్కొంటున్నారు. పశ్చిమ భారతదేశం ప్రస్తుతం అత్యంత చురుకైన రుతుపవన పరిస్థితులను ఎదుర్కొంటోంది. మహారాష్ట్ర, గోవా, గుజరాత్, కొంకణ్ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదవుతున్నాయి. ముంబయిలో జూన్ చివరి వారం నుంచి కురిసిన భారీ వర్షాల కారణంగా నగరంలోని జలాశయాల నీటి నిల్వలు వేగంగా పెరిగి మొత్తం సామర్థ్యంలో దాదాపు సగానికి చేరుకున్నాయి. అయితే భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ముంబయి పరిసరాల్లో వర్షాల తీవ్రత కొద్దిరోజుల పాటు కొంత తగ్గే అవకాశం ఉంది. ఉత్తర భారతదేశంలో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్ ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ ప్రాంతంలో నదుల నీటి మట్టాలు ప్రమాదస్థాయికి చేరువ కావడంతో వరద హెచ్చరికలు జారీ అయ్యాయి. పరిస్థితిని ఎదుర్కొనేందుకు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్), రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్) బృందాలను ముందస్తుగా మోహరించారు. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల కారణంగా డెహ్రాడూన్ జిల్లాలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తూర్పు భారతదేశంలో పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బిహార్, ఒడిశా రాష్ట్రాల్లో వర్షాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా దక్షిణ బెంగాల్‌లో జూలై రెండో వారమంతా భారీ వర్షాలు కొనసాగే అవకాశముందని భారత వాతావరణ శాఖ తెలిపింది. గంగా పరివాహక ప్రాంతాల్లో నీటి మట్టాలు పెరుగుతున్నందున వరదలపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. దక్షిణ భారతదేశంలో తెలంగాణ, కర్ణాటక, కేరళ, ఉత్తర ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు చురుకుగా కొనసాగుతున్నాయి. తెలంగాణలో పలు జిల్లాలకు భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేయడంతో పాఠశాలల నిర్వహణపై చర్చ జరిగినప్పటికీ, అధికారికంగా రాష్ట్రవ్యాప్తంగా సెలవులు ప్రకటించలేదు. కర్ణాటక తీర ప్రాంతాల్లో, పశ్చిమ కనుమలలో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. వ్యవసాయ రంగంలో తాజా పరిస్థితి ఆశాజనకంగానే కనిపిస్తున్నప్పటికీ పూర్తిగా ఆందోళన తొలగిపోలేదు. జూన్ నెలలో ఆలస్యమైన వర్షాల కారణంగా వరి, సోయాబీన్, పత్తి, మొక్కజొన్న, పప్పుధాన్యాల విత్తనాలు అనేక ప్రాంతాల్లో ఆలస్యమయ్యాయి. ఇప్పుడు కురుస్తున్న వర్షాలు నేలలో తేమను పెంచడంతో రైతులు వేగంగా విత్తనాలు వేస్తున్నారు. అయితే వర్షాలు కొన్ని జిల్లాల్లో మాత్రమే కేంద్రీకృతమవడం, మరికొన్ని ప్రాంతాల్లో ఇంకా తక్కువగా ఉండడం వల్ల ఖరీఫ్ సీజన్‌పై అనిశ్చితి కొనసాగుతోంది. భారత వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం, జులై 10 తర్వాత కూడా ఉత్తర, పశ్చిమ, మధ్య భారతదేశంలో చురుకైన రుతుపవన పరిస్థితులు కొనసాగనున్నాయి. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. ఉరుములు, మెరుపులు, గంటకు 40–60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా అనేక ప్రాంతాల్లో వీచే అవకాశం ఉంది. మొత్తం దేశవ్యాప్తంగా రుతుపవనాలు పూర్తిగా విస్తరించినప్పటికీ, సీజన్ మొత్తం వర్షపాతం ఇప్పటికీ సాధారణం కంటే తక్కువగానే ఉంటుందని, అయితే జూలై రెండో పక్షంలో మరింత మెరుగుదల నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

### రాజస్థాన్‌లో వర్షాలకు తెర!
### బలహీనపడుతున్న రుతుపవనాలు

**జైపూర్:** రాజస్థాన్‌లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తాత్కాలిక విరామం లభించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. శుక్రవారం (ఈనెల 10వ తేదీ) నుంచి రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రభావం బలహీనపడే అవకాశం ఉన్నందున, రాబోయే వారం రోజుల పాటు చాలా ప్రాంతాల్లో పొడి వాతావరణం కొనసాగే అవకాశముందని అంచనా వేసింది. వాతావరణ శాఖ ప్రకారం, ఈనెల 10, 11 తేదీల నుంచి రుతుపవనాల చురుకుదనం తగ్గి, రాష్ట్రవ్యాప్తంగా వర్షాల తీవ్రత గణనీయంగా తగ్గనుంది. ఈ కాలంలో రాజస్థాన్‌లోని అధిక భాగం ప్రాంతాల్లో వాతావరణం ప్రధానంగా పొడిగా ఉండే అవకాశం ఉంది. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రమే విడివిడిగా తేలికపాటి జల్లులు కురిసే అవకాశముందని పేర్కొంది.

## 'ఇ 20'తో వాహనాలు

# దెబ్బతినే ప్రమాదం!




**న్యూఢిల్లీ:** పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ (ఇ 20) కలపడం వల్ల వాహనాలు దెబ్బతింటాయనే అభిప్రాయం ఇటీవల వినియోగదారుల్లో విస్తృతంగా వినిపిస్తోంది. ముఖ్యంగా పాత బైక్‌లు, కార్ల యజమానులు ఇంజిన్ పనితీరు తగ్గిపోతుందని, మైలేజ్ తగ్గుతుందని, ఇంధన పైపులు, రబ్బరు భాగాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వాదనలో నిజం లేకపోలేదు. ఇథనాల్ అనేది చెరకు, మొక్కజొన్న వంటి వ్యవసాయ ఉత్పత్తుల నుంచి తయారయ్యే జీవ ఇంధనం (బయోఫ్యూయల్). దిగుమతి చేసుకునే ముడి చమురుపై ఆధారపడటాన్ని తగ్గించడం, కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, రైతులకు అదనపు ఆదాయం కల్పించడం వంటి లక్ష్యాలతో భారత ప్రభుత్వం పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని క్రమంగా పెంచుతోంది. ఈ క్రమంలో 'ఇ 10' (10% ఇథనాల్) నుంచి 'ఇ 20' (20% ఇథనాల్) దిశగా మార్పు చేపట్టింది. అయితే అన్ని వాహనాలు 'ఇ 20' ఇంధనానికి ఒకే విధంగా అనుకూలంగా ఉండవు. 2023 తర్వాత తయారైన అనేక కొత్త వాహనాలను తయారీ సంస్థలు 'ఇ 20' అనుకూలంగా రూపొందిస్తున్నాయి. కానీ పాత మోడళ్లలో ఇంధన వ్యవస్థలోని రబ్బరు గొట్టాలు, సీల్స్, కొన్ని లోహ భాగాలు ఇథనాల్ ప్రభావానికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంది. ఇథనాల్ నీటిని సులభంగా ఆకర్షించే గుణం కలిగి ఉండటంతో, తేమ ఎక్కువగా చేరితే తుప్పు ఏర్పడే ప్రమాదం కూడా ఉంటుంది. అంతేకాకుండా ఇథనాల్‌లోని శక్తి సాంద్రత పెట్రోల్ కంటే తక్కువగా ఉండటం వల్ల కొంతమంది వినియోగదారులు మైలేజ్ 3 నుంచి 7 శాతం వరకు తగ్గడాన్ని గమనించారు. అయితే, 'ఇ 20' పెట్రోల్ ప్రతి వాహనానికీ తప్పనిసరిగా హానికరమేనని చెప్పడం శాస్త్రీయంగా సరైనది కాదు. వాహనం తయారీ సంస్థ 'ఇ 20' అనుకూలమని ధ్రువీకరించినట్లయితే సాధారణంగా ఎలాంటి పెద్ద సమస్య ఉండదు. కానీ పాత వాహనాల విషయంలో తయారీదారు సూచనలను తప్పనిసరిగా పరిశీలించాలి. అవసరమైతే ఇంధన వ్యవస్థలోని కొన్ని భాగాలను 'ఇ 20'కు అనుకూలమైన విడిభాగాలతో మార్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కాబట్టి వినియోగదారుల ఆందోళనలకు కొంత వాస్తవ ఆధారం ఉన్నప్పటికీ, అది అన్ని వాహనాలకు వర్తించదు. ఇథనాల్ మిశ్రమం వల్ల కలిగే ప్రయోజనాలు, వాహనం అనుకూలత, నిర్వహణ విధానం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవడం అవసరం. ప్రభుత్వం, వాహన తయారీ సంస్థలు కూడా 'ఇ 20'అనుకూల వాహనాలపై స్పష్టమైన సమాచారం అందించడం ద్వారా వినియోగదారుల్లో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉంది. అంతేగాక, 'ఇ 20' మిశ్రమాన్ని ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో, ప్రజల్లో నెలకొన్న అనుమానాలు, పాత వాహనాల అనుకూలత సమస్యలు, వినియోగదారుల ఆర్థిక భారం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని సమతుల్య విధానాన్ని అవలంబించాలి. మొదటగా, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పెట్రోల్ బంకుల్లో ఒకేసారి 'ఇ 20' మాత్రమే కాకుండా, 'ఇ 10'ను కూడా వినియోగదారులకు అందుబాటులో ఉంచాలి. దీనివల్ల పాత వాహనాల యజమానులు తమ వాహనానికి అనువైన ఇంధనాన్ని ఎంచుకునే అవకాశం ఉంటుంది. అంతేగాక, ప్రతి వాహన తయారీ సంస్థ తమ వాహనాల్లో ఏ మోడల్ నుంచి 'ఇ 20' అనుకూలత ఉందో స్పష్టంగా ప్రకటించడం తప్పనిసరి చేయాలి. వాహన రిజిస్ట్రేషన్ వివరాలతో అనుసంధానం చేసి, ఆయా యజమానులకు ఎస్ఎంఎస్ లేదా మొబైల్ యాప్ ద్వారా వారి వాహనం 'ఇ 20'కు అనుకూలమా కాదా అనే సమాచారాన్ని అందించవచ్చు. పాత వాహనాల యజమానులకు ప్రభుత్వం ప్రత్యేక 'రెట్రోఫిట్' సహాయ పథకాన్ని ప్రవేశపెట్టవచ్చు. ఇంధన పైపులు, రబ్బరు సీల్స్, గాస్కెట్లు వంటి భాగాలను 'ఇ 20'కి అనువైన వాటితో మార్చుకోవడానికి సబ్సిడీ లేదా తక్కువ వడ్డీ రుణం కల్పిస్తే వినియోగదారులపై ఆర్థిక భారం తగ్గుతుంది. ఇథనాల్ మిశ్రమం వల్ల ఇంజిన్ పనితీరు, మైలేజ్, నిర్వహణ ఖర్చులపై దీర్ఘకాలిక ప్రభావం ఏమిటో తెలుసుకోవడానికి స్వతంత్ర పరిశోధనా సంస్థలతో విస్తృత పరీక్షలు నిర్వహించి, ఫలితాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలి. దీనివల్ల అపోహలు తగ్గి ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. పెట్రోల్ బంకుల్లో ఇంధనం 'ఇ 10' లేదా 'ఇ 20' అనే విషయాన్ని స్పష్టంగా పెద్ద అక్షరాలతో ప్రదర్శింపచేయాలి. వినియోగదారులు తెలియక తప్పు ఇంధనం నింపించుకునే పరిస్థితి రాకూడదు. అదనంగా, ఇథనాల్ నాణ్యత, నిల్వ, రవాణా, మిశ్రమ నిష్పత్తిపై కఠినమైన నాణ్యత నియంత్రణ వ్యవస్థను అమలు చేయాలి. నాణ్యత లోపాల వల్ల వాహనాలకు నష్టం జరిగితే సంబంధిత సంస్థలపై చర్యలు తీసుకునే వ్యవస్థ ఉండాలి. అత్యంత ముఖ్యంగా,వాహన తయారీ సంస్థలు, చమురు మార్కెటింగ్ సంస్థలు, ప్రభుత్వం కలిసి వినియోగదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. 'ఇ 20' వల్ల కలిగే ప్రయోజనాలు, పరిమితులు, వాహన నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రీయ ఆధారాలతో వివరించాలి. ఈ చర్యలు అమలు చేస్తే ఇథనాల్ మిశ్రమ ఇంధన విధానం పర్యావరణానికి, ఇంధన భద్రతకు, రైతుల ఆదాయానికి ఉపయోగపడటమే కాకుండా, వినియోగదారుల ప్రయోజనాల సంరక్షణ కూడా సాధ్యమవుతుంది.

## అయోధ్య విరాళాల కేసు

# 13న సుప్రీం కోర్టులో విచారణ

**న్యూఢిల్లీ:** అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయంలో భక్తులు సమర్పించిన విరాళాల దుర్వినియోగం, నిధుల గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఈనెల 13న విచారించనుంది. ఈ అంశంపై మొత్తం మూడు పిటిషన్లు దాఖలుకాగా, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వాటిని పరిశీలించనుంది. ఈ కేసులో ఒక పిటిషనర్ నరేంద్ర కుమార్ గోస్వామి దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)కి అప్పగించాలని, అలాగే ఆలయ వ్యవహారాలను నిర్వహిస్తున్న శ్రీరామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆర్థిక లావాదేవీలపై భారత నియంత్రణ, లెక్కల పరిశీలన సంస్థ (సిఎజి)తో ఆడిట్ నిర్వహించాలని కోరారు. మరో ఇద్దరు పిటిషనర్లు కూడా సిబిఐ దర్యాప్తుతో పాటు స్వతంత్ర విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌జెడి ఎంపి సుధాకర్ సింగ్ దాఖలు చేసిన మరో పిటిషన్‌లో ట్రస్ట్ మొత్తం ఆర్థిక వ్యవహారాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని కోరారు. పిటిషన్లలో పేర్కొన్న వివరాల ప్రకారం, ఆలయ ట్రస్ట్‌కు సంబంధించిన ఆర్థిక అవకతవకలపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసినప్పటికీ, ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే విచారణ ప్రారంభించిందని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్టమైన ఆర్థిక, క్రిమినల్ అంశాలపై స్వతంత్రంగా, నిపుణులైన సంస్థతో దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు వాదిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఆలయ విరాళాల దొంగతనం కేసులో ఇప్పటికే ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారిలో ముగ్గురిని ఇటీవల ఒక రోజు పోలీసు కస్టడీకి అప్పగించిన అయోధ్య కోర్టు, అంతకుముందు అందరినీ 14 రోజుల న్యాయపరమైన కస్టడీకి పంపింది. భక్తుల విశ్వాసం, కోట్లాది మంది దాతల నమ్మకానికి సంబంధించిన అంశం కావడంతో ఈ కేసులో పారదర్శకమైన, వేగవంతమైన దర్యాప్తు అవసరమని పిటిషనర్లు సుప్రీంకోర్టును కోరుతున్నారు.



**ప్రధాని మౌనం వీడాలి..**

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయ విరాళాల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనాన్ని ప్రశ్నించారు. ప్రధాని స్పందించాలని కోరారు. ఈ వ్యవహారంపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఉత్తరాఖండ్ పర్యటన ముగింపు సందర్భంగా డెహ్రాడూన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రామాలయ నిర్మాణం పేరుతో గత కొన్ని సంవత్సరాలుగా బిజెపి, ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్ విరాళాలు సేకరించాయని, ఆలయ ట్రస్ట్ నిర్వహణలో నిధుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలు వెలువడుతున్నాయని వేణుగోపాల్ అన్నారు. ఆలయ ట్రస్ట్ ప్రధానమంత్రి పర్యవేక్షణలోనే ఏర్పాటైందని పేర్కొంటూ, 'రామాలయ విరాళాల దొంగతనానికి బాధ్యులు ఎవరు? ఈ అంశంపై ప్రధానమంత్రి ఎందుకు మౌనంగా ఉన్నారు?' అని ప్రశ్నించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ పార్లమెంట్‌లో ప్రధానంగా ప్రస్తావిస్తుందని కూడా తెలిపారు. ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికల సన్నాహకాలపై మాట్లాడుతూ, గత రెండు రోజులుగా పార్టీ నాయకులు, జిల్లా అధ్యక్షులు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్రంలో పార్టీ ఎన్నికలను సమష్టిగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని, ప్రజల్లో అధికార బిజెపి ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందని వేణుగోపాల్ అన్నారు. గత పదేళ్లుగా బిజెపి ప్రభుత్వం ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందని, ముఖ్యంగా నిరుద్యోగం, ఉపాధి కోసం యువత వలసలు వెళ్లడం రాష్ట్రంలోని ప్రధాన సమస్యలుగా మారాయని ఆరోపించారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల కోసం ప్రత్యేకంగా మేనిఫెస్టో కమిటీని ఏర్పాటు చేసి, యువత, విద్యార్థులు, రైతులు, మహిళలు సహా అన్ని వర్గాల అభిప్రాయాలను సేకరించి ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎన్నికల ప్రణాళికను రూపొందిస్తామని వేణుగోపాల్ వెల్లడించారు.

### ఎన్‌సిఇఆర్‌టి నిర్ణయంపై

## విచారణకు కేంద్రం ఆదేశం

**న్యూఢిల్లీ:** పాఠ్యపుస్తకాల ముద్రణ కోసం కాగితం సరఫరా చేయాల్సిన సంస్థను బ్లాక్‌లిస్ట్ చేసిన జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సిఇఆర్‌టి) నిర్ణయంపై కేంద్ర విద్యాశాఖ విచారణకు ఆదేశించింది. ఈ వ్యవహారంలో ఢిల్లీ హైకోర్టులో ఎన్‌సిఇఆర్‌టి తన నిర్ణయాన్ని సమర్థవంతంగా సమర్థించడంలో విఫలమైందనే నివేదికలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్రంగా పరిగణించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఎన్‌సిఇఆర్‌టి జూన్ 22న బాఫ్నా గ్లోబల్ వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను రెండేళ్ల పాటు తన కొనుగోలు ప్రక్రియల నుంచి బ్లాక్‌లిస్ట్ చేసింది. పాఠ్యపుస్తకాల కోసం కాగితం సరఫరా చేయాల్సిన గడువును ఈ సంస్థ పాటించలేదని ఆరోపిస్తూ ఈ చర్య తీసుకుంది. అయితే దీనిని సవాలు చేస్తూ సంస్థ జూన్ 24న ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. విచారణ సందర్భంగా ఎన్‌సిఇఆర్‌టి తరఫున ఎవరూ హాజరు కాకపోవడంతో, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సంస్థపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని కోర్టు ఆదేశించింది. అలాగే సంస్థ సమర్పించిన రూ.6 కోట్లకు పైగా విలువైన బ్యాంకు గ్యారంటీని కూడా ఎన్‌సిఇఆర్‌టి నగదుగా మార్చకుండా నిలుపుదల చేసింది. కాగా, ఈ పరిణామాన్ని తీవ్రంగా పరిగణించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, న్యాయపరమైన ప్రక్రియలో నిర్లక్ష్యం వహించిన అధికారుల బాధ్యతను నిర్ధారించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిపాలనా, న్యాయపరమైన లోపాలను ఏమాత్రం సహించబోమన్న స్పష్టమైన సందేశాన్ని అధికారులు అందుకోవాలని ఆయన సూచించినట్లు సమాచారం. ఇలావుంటే, ఇరాన్ యుద్ధం కారణంగా కాగితం తయారీలో ఉపయోగించే హైడ్రోజన్ పెరాక్సైడ్ అనే రసాయనం అందుబాటులో లేకపోవడంతో కాగితం సరఫరాలో జాప్యం జరిగిందని సంబంధిత సంస్థ కోర్టుకు తెలిపింది. ఈ కేసు తదుపరి విచారణ ఈనెల 20న ఢిల్లీ హైకోర్టులో జరగనుంది.

### ఆస్ట్రేలియాతో అణుశక్తి ఒప్పందం

## ప్రధాని ఘనత కాదు

స్పష్టం చేసిన కాంగ్రెస్... 2008లోనే పునాది పడిందని వెల్లడి

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా నుంచి భారతదేశానికి యురేనియం సరఫరాకు కుదిరిన తాజా పౌర అణుశక్తి ఒప్పందాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాధించిన చారిత్రక విజయంగా బిజెపి ప్రచారం చేయడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఈ విషయంలో బిజెపి చేస్తున్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఆరోపించారు. బిజెపి ఐటి విభాగం అధిపతి అమిత్ మాలవీయ, 2010లో అణ్వాయుధ వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి)పై భారత్ సంతకం చేయలేదనే కారణంతో ఆస్ట్రేలియా యురేనియం విక్రయానికి నిరాకరించిందని, అయితే మోదీ నాయకత్వంలో ఇప్పుడు ఇరు దేశాలు యురేనియం ఎగుమతి ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను ఖండించిన జైరాం రమేష్, 2008లో కుదిరిన భారత్–అమెరికా పౌర అణుశక్తి ఒప్పందం తర్వాత, 2011 డిసెంబర్ 4న అప్పటి ఆస్ట్రేలియా ప్రధానమంత్రి జూలియా గిల్లార్డ్ తన లేబర్ పార్టీ నుంచి భారతదేశానికి యురేనియం విక్రయానికి ఆమోదం పొందారని గుర్తు చేశారు. దీనికి సంబంధించిన అప్పటి వార్తా కథనాలను కూడా ఆయన సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. భారత్–ఆస్ట్రేలియా పౌర అణుశక్తి సహకారానికి పునాది 2008లోనే పడిందని, ఆ ఒప్పందాన్ని బిజెపి అప్పట్లో తీవ్రంగా వ్యతిరేకించిందని జైరాం రమేష్ గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలే చారిత్రక మలుపులు సృష్టిస్తాయని, బిజెపి మాత్రం వాటిని తమ విజయాలుగా చూపించేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. కాగా, ఇటీవల ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌తో జరిగిన సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పౌర అణుశక్తి, సముద్ర భద్రత, కీలక ఖనిజాలు, సైబర్ సాంకేతికత తదితర రంగాల్లో పలు కీలక ఒప్పందాలపై సంతకాలు చేశారు. వీటిలో పౌర అణుశక్తి ఒప్పందం ద్వారా ఆస్ట్రేలియా నుంచి భారత అణు విద్యుత్ ప్రాజెక్టులకు వాణిజ్యపరంగా యురేనియం సరఫరా చేసే మార్గం సుగమం కానుంది.

### 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' విధానం...

# 2029 నాటికి అమలు అవకాశం

**పనాజి :** ఏకకాల ఎన్నికలపై బిల్లులను పరిశీలిస్తున్న పార్లమెంట్ సంయుక్త కమిటీ (జెపిసి), 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' సంస్కరణను పూర్తిగా అమలులోకి తీసుకురాగల యంత్రాంగాన్ని సృష్టించేందుకు కృషి చేస్తోందని దాని చైర్ పర్సన్ పిపి.చౌదరి శుక్రవారం తెలిపారు. గోవాలో కమిటీ రెండు రోజుల సమావేశం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తరచూ ఎన్నికల వల్ల జరిగే సుమారు రూ.7లక్షల కోట్ల ఆర్థిక నష్టాన్ని అరికట్టేందుకు ఉద్దేశించిన ఈ ప్రతిపాదనకు, ఇప్పటివరకు సంప్రదించిన పౌర సమాజ భాగస్వాములలో దాదాపు 99 శాతం దీనికి మద్దతు తెలిపారని చైర్‌పర్సన్ పిపి.చౌదరి పేర్కొన్నారు. ఏకకాల ఎన్నికల అమలులో ఎదురయ్యే సవాళ్లు, వాటిని పరిష్కరించే మార్గాలపై వారి అభిప్రాయాలను కోరుతూ ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, ఆయన మంత్రివర్గ సభ్యులతో గోవాలో చౌదరి సమావేశమయ్యారు. రాజ్యాంగ (129 సవరణ) బిల్లు, 2024పై కమిటీ తన చర్చలను ప్రారంభించింది. గోవా ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులతో మేం అనధికారికంగా సమావేశమయ్యాం. ''ఒకే దేశం–ఒకే ఎన్నిక' ను ఎలా అమలు చేయాలి?, ఎదురయ్యే సవాళ్లు ఏమిటి?, అందరికీ ఆమోదయోగ్యమైన సమతుల్యతను పాటిస్తూ, వాటిని ఎలా తగ్గించవచ్చే అనే విషయాలపై చర్చించాం' అని చౌదరి చెప్పారు. గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా ఢిల్లీ సహా పలు రాష్ట్రాలలో కమిటీ పర్యటించిందని, అక్కడ రాజ్యాంగ నిపుణులు, పౌర సమాజ సంస్థలు, విద్యావేత్తలు, ఇతర భాగస్వాములతో సంప్రదింపులు జరిపిందని ఆయన తెలిపారు. సంప్రదించిన వారిలో అత్యధిక మెజారిటీ ప్రజలు ఏకకాల ఎన్నికల ఆలోచనకు మద్దతు పలికారని రాజస్థాన్‌లోని పాలి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపి చెప్పారు. 'దాదాపు 99శాతం వాటాదారులు ముఖ్యంగా పౌర సమాజం, వివిధ సంస్థల నుంచి వచ్చిన వారు ఏకకాల ఎన్నికలకు అనుకూలంగా ఉన్నారని మేం కనుగొన్నాం. ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీలకు ఆమోదయోగ్యమైన యంత్రాంగాన్ని రూపొందించాలనేదే మా ప్రయత్నం' అని ఆయన వివరించారు. అమలు కాలపరిమితి గురించి అడగగా ఆయన ఇలా చెప్పారు. కమిటీ తదుపరి సార్వత్రిక ఎన్నికల (2029) నాటికి ఈ సంస్కరణ అమలులోకి వస్తుందని సూచిస్తూ, కమిటీ వివిధ ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తోంది. రాజకీయ పార్టీలు, ముఖ్యమంత్రులు స్వచ్ఛందంగా తమ ఎన్నికల చక్రాలను సమకాలీకరించుకోవడానికి అంగీకరిస్తే, అంతకుముందే కొన్ని రాష్ట్రాలను సమలేఖనం చేసే అవకాశం కూడా ఉందని చైర్‌పర్సన్ పిపి. చౌదరి చెప్పారు. ఈ ప్రతిపాదన వెనక ఉన్న ఆర్థిక హేతుబద్ధతను వివరిస్తూ మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉన్నత స్థాయి కమిటీ ముందు ఉంచిన పరిశోధన ఫలితాలను చౌదరి ఉటంకించారు. రామ్‌నాథ్ కోవింద్ కమిటీకి సమర్పించిన ఒక ఆర్థిక అధ్యయనం ప్రకారం దేశవ్యాప్తంగా విడివిడిగా ఎన్నికలు నిర్వహించడం వల్ల దాదాపు రూ7లక్షల కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లుతుందని, అదే సమయంలో ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల జాతీయ ఆర్థిక వ్యవస్థకు సమానమైన లాభాలు చేకూరుతాయని అంచనా వేసినట్లు కోవింద్ చెప్పారు. గోవాను ఉదాహరణగా చూపుతూ, ఏ ప్రధాన రాష్ట్రంలోనైనా ఎన్నికలు గోవాకు వచ్చే పర్యాటకులపై ప్రభావం చూపుతాయని, అయితే ఆ తీర ప్రాంత రాష్ట్రంలో ఎన్నికలు దాని పర్యాటక పరిశ్రమపై ప్రభావం చూపుతాయని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఊహించిన 'ప్రధాన ఎన్నికల సంస్కరణ'గాఏకకాల ఎన్నికలను చైర్‌పర్సన్ బిల్లును పరిశీలిస్తున్న జాయింట్ పార్లమెంట్ కమిటీ చైర్‌పర్సన్ పిపి.చౌదరి అభివర్ణించారు.

## న్యూజీలాండ్ చేరుకున్న మోదీ



**ఆక్లాండ్:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మూడు దేశాల విదేశీ పర్యటనలో చివరి దశగా శుక్రవారం న్యూజీలాండ్ చేరుకున్నారు. ఆక్లాండ్ విమానాశ్రయంలో న్యూజీలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ రెండు రోజుల పర్యటనలో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, వాణిజ్య విస్తరణ, పెట్టుబడులు, ఆర్థిక సహకారం వంటి అంశాలపై ఇరు దేశాల నాయకులు విస్తృతంగా చర్చించనున్నారు. అలాగే న్యూజీలాండ్‌లో నివసిస్తున్న భారతీయులను ఉద్దేశించి మోదీ ప్రసంగించనున్నారు. న్యూజీలాండ్ ప్రధానమంత్రి లక్సన్ 2025 మార్చిలో భారత్‌ను సందర్శించిన తర్వాత ఇరు దేశాల సంబంధాలు మరింత బలపడ్డాయని, తన తాజా పర్యటన ఆ సహకారాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్తుందని మోదీ తెలిపారు. భారత్–న్యూజీలాండ్ మధ్య వాణిజ్యం, వ్యవసాయం, విద్య, సాంకేతికత, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడంపై దృష్టి సారించనున్నారు. న్యూజిలాండ్‌కు ముందు మోదీ ఆస్ట్రేలియాలో మూడు రోజుల పర్యటన నిర్వహించారు. అక్కడ ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌తో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో హిందూప్రశాంత (ఇండోపసిఫిక్) ప్రాంతంలో శాంతి, భద్రత, సముద్ర సహకారాన్ని బలోపేతం చేయడంపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది. అలాగే రెండేళ్లకు పైగా సాగిన చర్చల అనంతరం ఆస్ట్రేలియా నుంచి భారత అణు విద్యుత్ కేంద్రాలకు యురేనియం సరఫరాకు సంబంధించిన పౌర అణుశక్తి ఒప్పందం కుదిరింది. ఈ పర్యటనలో తొలి దశలో మోదీ ఇండోనేషియాను సందర్శించి కీలక ఖనిజాలు, సముద్ర భద్రత, వాణిజ్యం తదితర రంగాల్లో 14 ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

# మమ్మల్ని ప్రమాదంలోకి నెట్టారు

### థాయ్ షిప్పింగ్ కంపెనీపై మాజీ నావికుల కేసు



**బ్యాంకాక్:** ఇరాన్ యుద్ధం కారణంగా అత్య ంత ప్రమాదకరంగా మారిన హోర్ముజ్ జలసంధిలో దాడికి గురైన ఓ థాయ్ సరకు నౌకకు చెందిన ముగ్గురు మాజీ నావికులు తమ యజమాని షిప్పింగ్ కంపెనీపై కోర్టును ఆశ్రయించారు. ప్రాణాపాయం ఉన్న పరిస్థితుల్లో తమను విధుల్లోకి పంపడమే కాకుండా, దాడి అనంతరం తమ కార్మిక హక్కులను ఉల్లంఘించి అన్యాయంగా ఉద్యోగాల నుంచి తొలగించారని వారు ఆరోపిస్తున్నారు. మార్చి 11న ఒమాన్ ఉత్తర తీర సమీపంలోని హోర్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న 'మయూరీ నరీ' అనే థాయ్ సరకు నౌకపై క్షిపణి లేదా ప్రక్షేపక దాడి జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు నావికులు మరణించగా, మిగిలిన 20 మంది సిబ్బందిని సురక్షితంగా రక్షించి థాయ్‌లాండ్‌కు తరలించారు. దాడి వల్ల నౌక తీవ్రంగా దెబ్బతినడంతో అది ఇక ప్రయాణించలేని స్థితికి చేరుకుంది. ఈ నేపథ్యంలో ముగ్గురు మాజీ నావికులు బ్యాంకాక్‌లోని కేంద్ర కార్మిక న్యాయస్థానంలో కేసు దాఖలు చేశారు. యుద్ధ పరిస్థితులు, భద్రతా హెచ్చరికలు ఉన్నప్పటికీ కంపెనీ ఉద్దేశపూర్వకంగా హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకను నడిపి తమ ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టిందని వారు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా, తొమ్మిది నెలల ఉద్యోగ ఒప్పందం పూర్తికాకముందే తమను తొలగించి కేవలం రెండు నెలల జీతానికి సమానమైన పరిహారం మాత్రమే చెల్లించిందని పేర్కొన్నారు. దాడి తర్వాత ముగ్గురు నావికులు 'పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్' (పిటిఎస్‌డి) అనే తీవ్రమైన మానసిక ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. పెద్ద శబ్దాలు వినిపించినా భయంతో ఉలిక్కిపడుతున్నామని, మందులు వాడాల్సి వస్తోందని, భవిష్యత్తులో తిరిగి సముద్రయాన వృత్తిలో పనిచేయడం కూడా కష్టంగా మారిందని వారు తెలిపారు. కంపెనీతో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించినప్పటికీ బాధ్యత వహించేందుకు సంస్థ నిరాకరించడంతో కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని వారి న్యాయవాది వెల్లడించారు. ఇరాన్ యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధి ప్రపంచంలోని అత్యంత ప్రమాదకర సముద్ర మార్గాల్లో ఒకటిగా మారింది. ప్రపంచ ముడి చమురు, ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జి) రవాణాలో దాదాపు ఐదో వంతు ఈ మార్గం ద్వారానే సాగుతుంది. ఈ మార్గం అసురక్షితంగా మారడం వల్ల ఆసియా దేశాల ఇంధన సరఫరాపై ప్రభావం పడటమే కాకుండా, భారత దేశం, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ వంటి దేశాలకు చెందిన వేలాది మంది నావికుల భద్రత కూడా ఆందోళనకరంగా మారింది. ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సముద్ర సంస్థ (ఐఎంఒ) కూడా ఈ సంక్షోభంలో గణాంకాల కంటే నావికుల ప్రాణాలు, వారి కుటుంబాలే అత్యంత విలువైనవని పేర్కొంటూ, వారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చింది.

## సవరణ

ఈ నెల 10వ తేదీ శుక్రవారం సంచికలో 'ప్రపంచం' వార్తల్లో 'ఖమేనీ ఖననం' వార్త చివర్లో 'అంతిమ ప్రార్థనలు చేసిన సందర్భంగా ప్రతినగరంలో, ప్రతిచోటా 'మేం ట్రంప్‌ను చంపుతాం' 'ట్రంప్‌కు ఉరిశిక్ష విధించాలి'. 'కిల్ ఖమేనీ' అనే బ్యానర్లు కనిపిస్తున్నాయి. 'మేం ట్రంప్‌ను చంపుతాం' అని రాసి ఉన్న పెద్ద పెద్ద బ్యానర్లు అనేక బహుళ అంతస్థుల భవంతులపై కనిపిస్తున్నాయి'. అని వుంది. అయితే '**కిల్ ఖమేనీ**' అనే చోట '**కిల్ ట్రంప్**' అని ఉండాలి. ఆ వాక్యంలో అనుద్దేశపూర్వకంగా తప్పులు దొర్లినందుకు విచా రం వ్యక్తం చేస్తున్నాం. – సంపాదకుడు.

## స్పెయిన్‌లో కార్చిచ్చు

### 11 మంది మృతి



**మాడ్రిడ్:** స్పెయిన్ దక్షిణ ప్రాంతంలోని అల్మేరియా ప్రావిన్స్‌లో సంభవించిన భారీ కార్చిచ్చు ఆ దేశ చరిత్రలోనే అత్యంత ప్రాణాంతక అటవీ అగ్నిప్రమాదాల్లో ఒకటిగా నిలిచింది. శుక్రవారం నాటికి ఈ ప్రమాదంలో క నీసం 11 మంది మరణించినట్లు స్పెయిన్ అధికారులు ప్రకటించారు. ప్రారంభంలో 12 మంది మృతి చెందినట్లు వెల్లడించినప్పటికీ, అనంతరం ఆ సంఖ్యను 11కు సవరించారు. మరణించిన వారిలో పలువురు పూర్తిగా కాలిపోయిన వాహనాల్లో చిక్కుకున్నట్లు స్థానిక మీడియా తెలిపింది. మరో ఆరుగురు గాయపడగా, వారికి వైద్య చికిత్స అందిస్తున్నారు. ఈ అగ్నిప్రమాదం అల్మేరియాలోని సియెర్రా డె లోస్ ఫిలాబ్రెస్ పర్వత ప్రాంత సమీపంలోని ఓ చిన్న గ్రామంలో ప్రారంభమైంది. ప్రమాదానికి ఖచ్చితమైన కారణాన్ని అధికారులు ఇంకా నిర్ధారించలేదు. అయితే, విద్యుత్ తీగ తెగిపడి చెలరేగిన మంటలు సమీపంలోని అడవులకు వేగంగా వ్యాపించాయ ని స్థానికులు అత్యవసర సేవలకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించారు. మంటలను అదుపు చేసేందుకు సుమారు 150 మంది అగ్నిమాపక సి బ్బంది, స్పెయిన్ సైన్యానికి చెందిన అత్యవసర విభాగంలోని 220 మంది సైనికులు నిరంతరం శ్రమిస్తున్నారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా పలు ప్రధాన రహదారులను మూసివేయగా, దాదాపు 1,000 మంది స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఘటనపై స్పందించిన స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్, అల్మేరియా ప్రజలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ అగ్నిప్రమాదం కలిగించిన విషాదం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. కాగా, ఇటీవలి సంవత్సరాల్లో స్పెయిన్‌లో తీవ్రమైన వేడి తరంగాలు (హీట్‌వేవ్స్) తరచుగా సంభవిస్తున్నాయి. వేసవిలో అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, బలమైన గాలులు, వర్షాభావ పరిస్థితులు చిన్న మంటలను కూడా భారీ కార్చిచ్చుగా మారుస్తున్నాయి. జూన్ నెలలో స్పెయిన్‌లో నమోదైన తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా వెయ్యికి పైగా అదనపు మరణాలు సంభవించినట్లు అధికారులు ఇప్పటికే వెల్లడించారు. ప్రస్తుతం పశ్చిమ ఐరోపాలో ఆరు వారాల వ్యవధిలో మూడోసారి తీవ్రమైన హీట్‌వేవ్ కొనసాగుతోంది. శాస్త్రవేత్తల ప్రకారం, శిలాజ ఇంధనాల వినియోగంతో పెరుగుతున్న వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలను పెంచుతూ, అడవులు మరింత పొడిబారేలా చేస్తున్నాయి. ఫలితంగా కార్చిచ్చు ప్రమాదాలు గతంతో పోలిస్తే మరింత తరచుగా, మరింత తీవ్రంగా సంభవిస్తున్నాయని వారు హెచ్చరిస్తున్నారు.

## 'లాంగ్ మార్చ్–10బి' తొలిదశ బూస్టర్ విజయవంతం



**బీజింగ్:** చైనా అంతరిక్ష రంగంలో మరో కీలక మైలురాయిని చేరుకుంది. శుక్రవారం చైనా తొలిసారిగా తన 'లాంగ్ మార్చ్–10బి' పునర్వినియోగ రాకెట్ తొలి దశ బూస్టర్‌ను విజయవంతంగా నియంత్రిత పద్ధతిలో తిరిగి తన ఆధీనంలోకి తెచ్చుకుంది. తద్వారా పునర్వినియోగ రాకెట్ సాంకేతికతలో చైనా గణనీయమైన పురోగతిని నమోదు చేసింది. సాధారణంగా రాకెట్ ప్రయోగం సమయంలో మొదటి దశ బూస్టర్ ఉపగ్రహం లేదా ఇతర పేలోడ్‌ను నిర్దిష్ట ఎత్తుకు తీసుకెళ్లిన తర్వాత ప్రధాన రాకెట్ నుంచి విడిపోతుంది. గతంలో ఈ బూస్టర్లు సముద్రంలో పడిపోయి ఉపయోగానికి పనికిరాకుండా పోయేవి. అయితే పునర్వినియోగ రాకెట్ సాంకేతికతలో వాటిని సురక్షితంగా భూమిపై లేదా సముద్రంలోని ప్రత్యేక వేదికపై దింపి మళ్లీ ఉపయోగించేలా రూపొందిస్తారు. దీనివల్ల ఒక్కో రాకెట్ ప్రయోగానికి అయ్యే ఖర్చు భారీగా తగ్గుతుంది. ఈ ప్రయోగంలో హైనాన్ ప్రావిన్స్ నుంచి ప్రయోగించిన లాంగ్ మార్చ్–10బి రాకెట్ తన పేలోడ్‌ను విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టింది. అనంతరం మొదటి దశ బూస్టర్ భూమివైపు తిరిగి వచ్చి, సముద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై అమర్చిన వల (నెట్ క్యాప్చర్ సిస్టమ్) సహాయంతో సురక్షితంగా చేరింది. రాకెట్ ప్రయోగం, బూస్టర్ పునరుద్ధరణ రెండూ విజయవంతంగా పూర్తయ్యాయని చైనా అధికారిక వార్తా సంస్థ వెల్లడించింది. ఈ విజయానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఎందుకంటే 2015లో అమెరికాకు చెందిన 'స్పేస్ ఎక్స్' సంస్థ తొలిసారిగా పునర్వినియోగ రాకెట్ బూస్టర్‌ను విజయవంతంగా తిరిగి దింపి అంతరిక్ష రంగంలో విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టింది. ఆ సాంకేతికత వల్ల అంతరిక్ష ప్రయోగాల వ్యయం గణనీయంగా తగ్గి, తరచూ రాకెట్లు ప్రయోగించే అవకాశం ఏర్పడింది. ఇప్పుడు దాదాపు పదేళ్ల తర్వాత చైనా కూడా ఈ రంగంలో కీలక విజయాన్ని సాధించింది. అయితే చైనా అనుసరించిన విధానం కొంత భిన్నంగా ఉంది. స్పేస్‌ఎక్స్ బూస్టర్లు సాధారణంగా భూమిపై లేదా సముద్రంలోని డ్రోన్ నౌకలపై నిలువుగా దిగుతాయి. కానీ లాంగ్ మార్చ్–10బి బూస్టర్‌ను సముద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై వల సాయంతో సురక్షితంగా దించడం ఈ ప్రయోగంలోని విశేషం. సుమారు 63 మీటర్ల ఎత్తు, 760 టన్నుల బరువు కలిగిన ఈ ద్రవరూప ఇంధన రాకెట్ తక్కువ భూమి కక్ష్యలో సుమారు 16 టన్నుల పేలోడ్‌ను మోసుకెళ్లే సామర్థ్యం కలిగి ఉంది. ఈ విజయంతో చైనా వాణిజ్య అంతరిక్ష ప్రయోగాల్లో పోటీ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవడంతో పాటు, భవిష్యత్‌లో తక్కువ వ్యయంతో మరిన్ని ఉపగ్రహాలు, అంతరిక్ష మిషన్లు చేపట్టే దిశగా ఒక కీలక అడుగు వేసింది.

### షూ కంపెనీలో అగ్నిప్రమాదం

## కార్మిక భద్రతపై ఆందోళన



**బీజింగ్:** చైనాలోని ఫుజియాన్ ప్రావిన్స్‌లో ఉన్న ప్రముఖ షూ తయారీ కేంద్రం ఫుజియాన్ హ్యూటెంగ్ కర్మాగారంలో సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో 28 మంది ప్రాణాలు కోల్పోవడం అక్కడి కార్మిక భద్రతా ప్రమాణాలపై మరోసారి తీవ్రమైన ఆందోళనకు దారితీసింది. ఈ ఘటన ఈనెల 10న వెలుగులోకి రాగా, ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. జిన్జియాంగ్ నగరంలోని ఐదు అంతస్తుల ఈ కర్మాగారంలో మంటలు చెలరేగిన సమయంలో 237 మంది కార్మికులు, ఇద్దరు సందర్శకులు భవనంలో ఉన్నారు. అగ్నిమాపక సిబ్బంది 213 మందిని సురక్షితంగా బయటకు తీసుకురాగా, ఆసుపత్రికి తరలించిన ఇద్దరు చికిత్స పొందుతూ మరణించారు. అనంతరం గల్లంతైన మరో 26 మంది మృతదేహాలు లభించడంతో మొత్తం మృతుల సంఖ్య 28కు చేరింది. ప్రమాదం తర్వాత కర్మాగార యజమాని, నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేయగా, కంపెనీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, భవనం మొదటి అంతస్తులోని వర్క్‌షాప్, గిడ్డంగి ప్రాంతంలో మంటలు ప్రారంభమయ్యాయి. మెట్ల మార్గాల్లో భారీగా నిల్వ చేసిన షూ అట్టలు, అడుగుభాగం (సోల్) తయారీకి ఉపయోగించే అత్యంత మండే పదార్థాలు అగ్నిమాపక సిబ్బంది లోపలికి చేరుకోవడాన్ని అడ్డుకున్నాయి. దీంతో మంటలు వేగంగా పై అంతస్తులకు వ్యాపించాయి. జిన్జియాంగ్‌ను చైనా 'షూ రాజధాని'గా పిలుస్తారు. ప్రపంచంలో తయారయ్యే క్రీడా షూలలో సుమారు ఐదో వంతు ఇక్కడే ఉత్పత్తి అవుతుంది. ఈ ప్రాంత అభివృద్ధిని చైనా పారిశ్రామిక విజయానికి ప్రతీకగా పేర్కొంటూ జిన్జియాంగ్ అనుభవంగా ప్రచారం చేస్తుంటారు. ఈ ప్రమాదం చైనాలో పరిశ్రమల్లో భద్రతా లోపాలు ఇంకా కొనసాగుతున్నాయని మరోసారి గుర్తు చేసింది. అధికారిక గణాంకాల ప్రకారం, 2025లో దేశవ్యాప్తంగా దాదాపు 20 వేల పారిశ్రామిక ప్రమాదాల్లో 18,261 మంది మరణించారు. ఈ నేపథ్యంలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ప్రమాదంపై వేగంగా దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఘటన పరిశ్రమలలో భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరాన్ని మరోసారి స్పష్టంగా తెలియజేసింది.

## 89 లక్షల మంది

**(మొదటి పేజీ తరువాయి)**

ఓటు హక్కు కలిగి ఉంటే చట్టప్రకారం ఏడాది వరకు జైలు శిక్ష లేదా? జరిమానా విధిస్తారని ఆయన వెల్లడించారు. రోహింగ్యాలకు ఓటు హక్కు ఉన్నట్లు తేలితే ఈఆర్‌ఓలు క్షుణ్నంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం ఓట్లను తొలగిస్తారని చెప్పారు.

ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

రాష్ట్రంలో ప్రస్తుతం సాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ఏ ఒక్కరి ఓటునూ తొలగించబోమని సుదర్శన్ రెడ్డి తెలిపారు. సాధారణంగా ఎన్నికలకు ముందు జరిగే ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)తో పోలిస్తే ఎస్ఐఆర్ పూర్తిగా భిన్నమైనదన్నారు. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, అనర్హుల పేర్లను తొలగించి ఓటర్ల జాబితాను పూర్తి పారదర్శకంగా, స్వచ్ఛంగా మార్చడమే ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశమని వివరించారు. దేశంలోని 13 రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తయిందని, ప్రస్తుతం తెలంగాణ సహా 17 రాష్ట్రాల్లో కొనసాగుతోందన్నారు. తెలంగాణలో జూన్ 10వ తేదీ నాటికి 3 కోట్ల 38 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారన్నారు.

**పూర్వీకుల వివరాలు లేకపోయినా పర్వాలేదు**

జూలై 26 వరకు నమోదైన ఓటర్లందరికీ ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నామని, ఇప్పటికే 98 శాతం పంపిణీ పూర్తయిందని సుదర్శన్ రెడ్డి తెలిపారు. ప్రతి వ్యక్తికీ రెండు ఎన్యూమరేషన్ పత్రాలు ఇస్తామని, వాటిని పూర్తి చేసి ఒక పత్రాన్ని బిఎల్‌ఓకు ఇచ్చి రసీదు తీసుకోవాలని, రెండో పత్రాన్ని ఓటర్లు తమ వద్దే ఉంచుకోవాలని సూచించారు. 2002 ఓటర్ల జాబితాలోని వివరాలను ఓటర్లు సమర్పించవచ్చని, ఒకవేళ తమ పూర్వీకుల వివరాలు లేదా 2002 డేటా అందుబాటులో లేకపోయినా ఫారాలను సమర్పించవచ్చని, అలాంటి వారికి నోటీసులు ఇచ్చి ప్రత్యేక సర్వే చేస్తామని చెప్పారు. ఫారాలు ఇచ్చిన వారి పేర్లను ముసాయిదా (డ్రాఫ్ట్) జాబితాలో చేర్చుతామన్నారు. ఒకవేళ ఎన్యూమరేషన్ పత్రం ఇవ్వలేకపోయినా, డ్రాఫ్ట్ జాబితాలో పేరు విస్మరిస్తే, కొత్త నమోదు కోసం ఫారం6, సవరణలు లేదా మార్పుల కోసం ఫారం8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఓటర్లు ఈసి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఈ వివరాలను సమర్పించవచ్చన్నారు. .

**బిఎల్‌ఓల ఇబ్బందులపై మున్సిపల్ సిబ్బంది సాయం**

హైదరాబాద్ నగరంలో ఇళ్ల నంబర్లు ఒకే క్రమంలో లేకపోవడం, అద్దెదారులు తరచూ ఇళ్లు మారుతుండటం వల్లనే బిఎల్‌ఓలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ సమస్య పరిష్కారానికి మున్సిపల్ సిబ్బంది సహాయం తీసుకోవాలని సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఓటు ఉండి ఫారాలు అందకపోతే బిఎల్‌ఓను సంప్రదించాలన్నారు. హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో ఉర్దూ మాట్లాడే జనాభా ఎక్కువగా ఉన్నందున, ఎన్యూమరేషన్ ఫారాలను ఉర్దూలోనూ ముద్రించేందుకు అనుమతించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్లు సుదర్శన్ రెడ్డి చెప్పారు. ఈసి అనుమతి రాగానే ఉర్దూ ఫారాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. .

**సంక్షేమ పథకాలకు, ఓటు తొలగింపునకు సంబంధం లేదు**

ఓటు తొలగింపు అనేది అంత సులువైన ప్రక్రియ కాదని, కావాలని ఎవరి ఓటును కూడా తొలగించబోరని సిఈఓ సుదర్శన్ రెడ్డి పునరుద్ఘాటించారు. అన్ని నిబంధనలు పాటించి, నోటీసులు ఇచ్చి, వివరణకు తగిన అవకాశం కల్పించి, సరైన కారణాలు రికార్డు చేసిన తర్వాతే ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌ఓ) సంతృప్తి చెందకపోతే మాత్రమే తొలగిస్తారన్నారు. బాధితులు ఎవరైనా ఉంటే జిల్లా కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవచ్చన్నారు. ఓటు లేకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేస్తారా? లేదా? అనేది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ విధానపరమైన అంశమని, అది ఎన్నికల సంఘం పరిధిలోకి రాదని ఆయన తెలిపారు. ప్రస్తుతం కొమరంభీమ్ ఆసిఫాబాద్ లాంటి ఏజెన్సీ ఏరియాల్లో అత్యధికంగా 59 శాతం మంది ఫారాలు సమర్పించారని, హైదరాబాద్ పాతబస్తీలోని 7 నియోజకవర్గాల్లోనూ స్పందన బాగుందని, ప్రస్తుతం డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు అరుణ అట్లూరి, రాజేశ్, సంయుక్త కార్యదర్శులు బాపురావు, సి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

## మైలేజీ తగ్గుతుంది

**(మొదటి పేజీ తరువాయి)**

ఇంజిన్‌లో నాకింగ్ (అసాధారణ శబ్దాలు) తగ్గుతాయి. ఇంధనం వేగంగా దహనమై వాహనం పికప్, యాక్సిలరేషన్ మెరుగుపడటంతో పాటు ఇంజిన్ మరింత పరిశుభ్రంగా పనిచేస్తుంది. అలాగే కార్బన్ ఉద్గారాలు తగ్గి పర్యావరణానికి కూడా మేలు జరుగుతుందని పేర్కొంది. పాత వాహనాలకు 'ఇ 20' హానికరమనే ఆందోళనలపై స్పందించిన మంత్రిత్వ శాఖ, దేశవ్యాప్తంగా అమలు చేసే ముందు ఇంజిన్ మన్నిక, ఇంధన వ్యవస్థ, తుప్పు నిరోధకత, విడిభాగాల అనుకూలత, కాలుష్య ఉద్గారాలు వంటి అంశాలపై విస్తృత పరీక్షలు నిర్వహించినట్లు తెలిపింది. మారుతి సుజుకి, హీరో మోటోకార్ప్ వంటి ప్రముఖ వాహన తయారీ సంస్థలు కూడా 'ఇ 20' కారణంగా తుప్పు, అసాధారణ అరిగిపోవడం లేదా విడిభాగాల నష్టం వంటి సమస్యలు గుర్తించలేదని వెల్లడించింది. అలాగే ప్రతి పెట్రోల్ బంకులో స్వచ్ఛమైన పెట్రోల్, 'ఇ 10', 'ఇ 20'లను విడివిడిగా విక్రయించాలని వస్తున్న డిమాండ్‌ను కూడా మంత్రిత్వ శాఖ తిరస్కరించింది. దేశవ్యాప్తంగా లక్షకు పైగా పెట్రోల్ బంకుల్లో మూడు రకాల ఇంధనాలను సరఫరా చేయడం వల్ల రవాణా, నిల్వ, పంపిణీ వ్యయాలు భారీగా పెరుగుతాయని వివరించింది. ఇథనాల్ మిశ్రమ కార్యక్రమం ఉద్దేశం పెట్రోల్ ధరలను తగ్గించడం కాదని, విదేశాల నుంచి ముడి చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడం, రైతులకు ఆదాయం పెంచడం, కాలుష్యాన్ని తగ్గించడం అని మంత్రిత్వ శాఖ పేర్కొంది. 2014–15 నుంచి ఇప్పటివరకు ఈ కార్యక్రమం ద్వారా రూ.1.97 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా కావడంతో పాటు, రైతులకు రూ.1.66 లక్షల కోట్లకు పైగా ఆదాయం అందిందని తెలిపింది. 'ఇ 20'పై అపోహలను నమ్మవద్దని, శాస్త్రీయ పరీక్షలు, వాహన తయారీ సంస్థల ధ్రువీకరణ అనంతరమే దేశవ్యాప్తంగా దీనిని అమలు చేశామని వినియోగదారులకు మంత్రిత్వ శాఖ సూచించింది.

## సర్వం సిద్ధం చేయాలి

**(మొదటి పేజీ తరువాయి)**

గంగాజమున తెహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తాయని, ఈ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని ఆమె పేర్కొన్నారు. గోల్కొండ కోటలోని జగదాంబికా మహంకాళి దేవస్థానంలో శుక్రవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జులై 16 నుంచి ఆగస్టు 13 వరకు జరిగే బోనాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ ని యంత్రణ, పార్కింగ్, క్యూ లైన్లు, బారికేడ్లు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, అగ్నిమాపక సిబ్బంది, ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇ వ్వాలని, పోలీసు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మొబైల్ టాయిలెట్లు, తాగునీటి కేంద్రాలు, వైద్య శిబిరాలు, 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచడంతో పాటు విద్యుత్ వైరింగ్, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. జులై 16న లంగర్‌హౌస్ కూడలి నుంచి ప్రారంభమయ్యే తొలి బోనం సమర్పణ, తొట్టెలు, రథోత్సవం, మెట్లపూజ కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. శివసత్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, భక్తులు సౌకర్యవంతంగా అమ్మవారిని దర్శించుకునేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమావేశం అనంతరం మంత్రి కొండా సురేఖ ఆషాడ బోనాల జాతర పోస్టర్, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పదేళ్లు మంత్రిగా ఏం చేశారు

**(మొదటి పేజీ తరువాయి)**

దుర్వినియోగం చేస్తే ఈటల రాజేందర్ అప్పుడే ఎందుకు ప్రశ్నించలేదన్నారు. ఈటల రాజేందర్ కూడా బిఆర్ఎస్‌కు మద్దతు పలుకుతున్నట్టుగా కనిపిస్తోందన్నారు. కేంద్ర మంత్రి నడ్డా, బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్, ఇలా ఎవరైనా ఎన్నికల హామీలో భాగమైన కేంద్ర ప్రభుత్వంలో రెండు కోట్ల ఉద్యోగాలను భర్తీ చేసి తెలంగాణ రాష్ట్రానికి రావాలని మహేష్ కుమార్ హితువు పలికారు.

**ఈ నెల15న 'కార్పొరేషన్ పదవుల'పై సిఎం, మీనాక్షితో సమావేశం....**

వివిధ కార్పొరేషన్ పదవులపైన ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనా క్షి నటరాజన్‌తో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. మంత్రి కొండసురేఖ, ఎంఎల్‌ఎ కడియం శ్రీహరి అంశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సచిన్ సావంత్, జగ్గారెడ్డి ఇద్దరూ జరిగిన విషయాలను సేకరించి, పార్టీకి నివేదిస్తారని, ఆ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశా రు. పార్టీలో చిన్న చిన్న సమస్యలన్నీ తొలగిపోతాయని,క్రమశిక్షణ కమిటీ అందరికీ స మానమేనన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కొంత మంది ఎంఎల్‌ఎలు తమకు మద్దతునిచ్చారని మహేష్ కుమార్ తెలిపారు.

## బంద్ సక్సెస్

**(మొదటి పేజీ తరువాయి)**

వ్యక్తం చేస్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంతో పోలీసులకు, విద్యార్థి సంఘాల నాయకులకు మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. పలువురు విద్యార్థులపై పోలీసులు పిడిగుద్దులతో దాడి చేసి బలవంతంగా అరెస్టు చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై నిర్బంధం ప్రయోగించడం ప్రభుత్వ అప్రజాస్వామ్య వైఖరికి నిదర్శనమని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని మంత్రుల నివాసం వద్ద పోలీసులు అరెస్ట్ చేసని వారిలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పి.మహేష్, కార్యదర్శి పొడపంగి నాగరాజు, ఎఐడిఎస్‌ఓ రాష్ట్ర సహాయ కార్యదర్శి నితీష్, ఎఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి, ఎఐఎస్‌బి రాష్ట్ర కార్యదర్శి నవీద్ హాకిమ్ , ఎఐపిఎస్‌యు రాష్ట్ర నాయకుడు గోపాల్ ఉన్నారు.

**విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రి లేకపోవడం సిగ్గుచేటు**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రిని నియమించకపోవడం విద్యారంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వెల్లడిస్తోందని ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు విమర్శించారు. విద్యాశాఖకు నాయకత్వం లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని వారు పేర్కొన్నారు. 'యంగ్ ఇండియా స్కూల్స్', 'ఇంటర్నేషనల్ స్కూల్స్' పేర్లతో ప్రభుత్వ పాఠశాలల విలీనాలు, మూసివేతలకు ప్రభుత్వం పరోక్షంగా మార్గం సుగమం చేస్తోందని విమర్శించారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలల ఉనికినే ప్రశ్నార్థకం చేసే విధానాలను అవలంబించడం ఆందోళనకరమన్నారు. విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఆరేళ్ళ నుండి సుమారు రూ. 10,814 వేల కోట్లు విడుదల చేయకుండా వేలాది మంది పేద విద్యార్థుల ఉన్నత విద్యకు

ఆటంకం కాంగ్రెస్ ప్రభుత్వం కలిగిస్తుందన్నారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల చదువులను ప్రమాదంలో నెట్టిందన్నారు.

**తెలంగాణలో వ్యాపారంగా మారిన విద్య**

మరోవైపు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతున్నప్పటికీ వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం ఇప్పటికీ ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురాకపోవడం వల్ల విద్య వ్యాపారంగా మారిపోయిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పి.మహేష్, కార్యదర్శి పొడపంగి నాగరాజు, ఎఐడిఎస్‌ఓ రాష్ట్ర సహాయ కార్యదర్శి నితీష్, ఎఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి, ఎఐఎస్‌బి రాష్ట్ర కార్యదర్శి నవీద్ హాకిమ్ , ఎఐపిఎస్‌యు రాష్ట్ర నాయకుడు గోపాల్ విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజనం వంటి కనీస సౌకర్యాలను కూడా నాణ్యంగా, సకాలంలో అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ, మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ విద్య బలోపేతంపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే విద్యారంగ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తృతమైన ఐక్య విద్యార్థి ఉద్యమాలకు శ్రీకారం చుడతామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

## భద్రాచలం మునకే

**(మొదటి పేజీ తరువాయి)**

మాకు అనుకూలంగా వచ్చిందని అదే సందర్భంలో నేను చెప్పినట్లుగానే పాపాల భైరవుడు పామ్ హౌజ్‌లో బంధీ అయ్యాడన్నారు. కల్వకుంట్ల కుటుంబం కురు వంశం లాంటిదని ఇక తెలంగాణ రాజకీయ ముఖ చిత్రం నుంచి తొలిగిపోక తప్పదన్నారు. రాష్ట్రంలో 2028లో ఎన్నికలు జరగవని 2029 మే లేదా జూన్ మాసంలో ఎన్నికలు జరగవచ్చునని తెలిపారు. బిఆర్ఎస్‌లోని కేసిఆర్, ఆయన కొడుకు, అల్లుడు బ్యాండ్ మేళంతో పోల్చదగిన సర్వేలు నిర్వహిస్తూ ఏదో లెక్కలె చెబుతున్నారని రిజర్వేషన్లు తేలకుండా పునర్ విభజన జరగకుండా ఎన్నికలు జరగని నేపథ్యంలో ఈ సర్వేలు ఎలా వస్తాయని రేవంత్ ప్రశ్నించారు. రైతు భరోసా పేరుతో తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని ఇప్పటి వరకు తెలంగాణ రైతుల సంక్షేమానికి రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ అంటే కరెంటు ఉండదని ప్రచారం చేస్తున్నారని బిఆర్ఎస్ నాయకులు కరెంటు వైరు పట్టుకుని చూస్తే ఏమి జరుగుతుందో తెలుస్తుందని కాకిలా మాడి మసై పోతారని రేవంత్ హెచ్చరించారు. మేడిగడ్డలో గేట్లు దించి నింపితే భద్రాచలంతో సహా ఊర్లు కొట్టుకు పోతాయని ఆయన గుర్తు చేశారు. జూబ్లీ హిస్ లాంటి ఉప ఎన్నికల్లో ప్రజల తీర్పు చూసిన తర్వాత బిఆర్ఎస్‌లో మార్పు రాలేదని హరీష్‌రావు బిజెపితో మాట్లాడలేదని భద్రాచలం రాముని మీద మేనమామ కేసిఆర్ మీద ఒట్టెసి చెప్పగలడా అని రేవంత్ ప్రశ్నించారు. కవిత బిఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేస్తున్నారని చెబుతుందని వందల కోట్ల రూపాయలు కాంట్రాక్టర్ల నుంచి కొల్లగొట్టారని చెబుతున్నా కవితను అడిగితే నిజం తెలుస్తుందన్నారు. ఖమ్మంలో కొందరు బిఆర్ఎస్ నాయకులకు క్రరు కాల్చి వాతపెట్టారని మరో సారి పెట్టక తప్పదన్నారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని సమయస్ఫూర్తితో నడిపిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని సంక్షేమ పథకాలు పొందిన వారి ఓట్లు కాంగ్రెస్‌కు వేస్తే బిఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావన్నారు. ఇంత వరకు కేసిఆర్ ప్రవేశపెట్టిన ఏ పథకాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయలేదన్నారు. వాటికి మరింత మెరుగులు దిద్ది అమలు చేస్తున్నామన్నారు. మధిరకు ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీని తీసుకు వచ్చి లక్షలాది మందితో సభ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సభకు ముందు తొమ్మిది నుంచి 50 ఎకరాలు కలిగిన రైతుల ఖాతాల్లో రూ. 1009 కోట్లను విడుదల చేశారు. మొక్కజొన్నలకు సంబంధించిన కొనుగోలు నగదును విడుదల చేసిన ముఖ్యమంత్రి భూధార్ కార్డులను కూడా రైతులకు అందజేశారు. ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు ముఖ్యంగా మహిళలు హాజరయ్యారు. సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి వాకటి శ్రీహరి ప్రసంగించగా మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటి రెడ్డి వెంకటరెడ్డి, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాదరావు, ఎంపిలు రామసహాయం రఘురాంరెడ్డి, బలరాం నాయక్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, స్థానిక ఎంఎల్‌ఎలు రాందాస్ నాయక్, రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ ఛైర్మన్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

# సెమీస్‌లోకి ఫ్రాన్స్

## మొరాక్కోపై 2-0 తేడాతో విక్టరీ..



ఫిఫా వరల్డ్‌కప్ సెమీస్లోకి ఫ్రాన్స్ ఎంట్రీ ఇచ్చింది. గురువారం బోస్టన్ స్టేడియంలో మొరాక్కోతో జరిగిన మ్యాచ్‌లో 2–0 గోల్స్ తేడాతో ఫ్రాన్స్ విజయం సాధించింది. వరుసగా మూడోసారి ఫ్రాన్స్ జట్టు వరల్డ్‌కప్ సెమీస్లోకి ఎంట్రీ అయి ్యంది. ఫ్రాన్స్ కెప్టెన్ కైలియన్ ఎంబాప్పే, ఓస్మేన్ డెంబిలీ గోల్స్ చేశారు. మంగళ వారం డల్లాస్‌లో జరిగే సెమీఫైనల్లో స్పెయిన్ లేదా బెల్జియంతో ఫ్రాన్స్ తలపడనున్నది. టోర్న మెంట్‌లో టాప్ ఫామ్లో ఉన్న ఎంబాప్పే.. మ్యాచ్ 60వ నిమిషంలో గోల్ చేశాడు. వాస్తవానికి తొలి అర్థభాగంలో అతను పెనాల్టీ కిక్ మిస్సయ్యాడు. ఆట 4వ నిమిషంలోనే ఆ ఛాన్సు మిస్సైంది. టోర్నీ గోల్ స్కోరింగ్ రేసులో మెస్సీ తర్వాత ఎంబాప్పే నిలిచారు. 2022లో ఖతార్లో జరిగిన సెమీఫైనల్స్ .. ఫ్రాన్స్ జట్టు 20 తేడాతోనే మొరాకోపై విజయాన్ని నమోదు చేసి ంది. ఇక ఆట 66వ నిమిషంలో ఎంబాప్పే ఇచ్చిన పాస్ను డెంబిలీ గోల్ చేశాడు. డెంబిలీ ఈ టోర్నీలో అయిదో గోల్ చేశాడు. ఫ్రాన్స్ జట్టు 1998–2018 సంవత్సరాల్లో ఫుట్బాల్ వరల్డ్కప్ గెలుచుకున్నది. అయితే ప్రస్తు తం ఆ జట్టు ఆడుతున్న తీరు.. ఈ యేటి టైటిల్ ఫేవరేట్గా కనిపిస్తున్నది. ఫ్రాన్స్ ఇటీవల రెండు సార్లు యురోపియన్ చాంపియన్‌షిప్ గెలుచుకున్నది. జులై 19వ తేదీన జరిగే ఫైనల్లో ఫ్రాన్స్ విజయం సాధిస్తుందని మాజీ ప్లేయర్లు చెబుతున్నారు. సెమీఫైనల్లో బెర్తు ఖరారు చేసుకున్న ఫ్రాన్స్ ఇప్పటి వరకు ఈ టోర్నమెంట్‌లో మొత్తం 16 గోల్స్ చేసింది. ఈ టోర్నీలో అత్యధిక సంఖ్యలో గోల్స్ చేసిన జట్టుగా ప్రస్తుతం ఫ్రాన్స్ కొనసాగుతోంది. అయితే 8 గోల్స్తో ఎంబాప్పే, మెస్సీ.. గోల్డెన్ బూట్ కోసం పోటీపడుతున్నారు. కానీ ఆ రేసులో ఎంబాప్పే ముందున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఎంబాప్పే ఎక్కువ అసిస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఫ్రాన్స్ జట్టులో 5 కన్నా ఎక్కువ గోల్స్ చేసిన ప్లేయర్లు ఇద్దరు ఉన్నారు.

# సిరీస్ చేజారడంపై బిసిసిఐ గరం



టీ–20ల్లో మొన్నటివరకూ అజేయశక్తిగా కొనసాగిన భారత జట్టు వరసగా రెండో సిరీస్ కోల్పోవడం అభిమానులకు మింగుడుపడడం లేదు. వరల్డ్‌కప్ ఛాంపియన్ టీమిండియా ఇంత దారుణంగా ఓడడంపై మాజీలు, విశ్లేషకులు అవాక్కవుతున్నారు. బ్రిస్టల్లో ఘనమైన రికార్డు ఉన్నప్పటికీ నాలుగో టీ–20లో 9 వికెట్లతో చిత్తైన భారత్ సిరీస్ కోల్పోయింది. ఈ ఘోర పరాజయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి సీరియస్‌గా తీసుకుంది. సిరీస్ ముగియడమే ఆలస్యం సమీక్ష నిర్వహించి.. ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బందిపై చర్యలకు తీసుకోనుంది. ఇంగ్లాండ్ పర్యటనలో హ్యాట్రిక్ ఓటములతో భారత జట్టు పొట్టి సిరీస్ను సమర్పించుకుంది. సిరీస్‌లో నిలవాలంటే గెలవక తప్పని మ్యాచ్లో 9 వికెట్ల పరాజయంతో విమర్శలకు కేంద్రంగా మారింది టీమిండియా. ఐర్లాండ్ చేతిలో వైట్వాష్, ఆపై ఇంగ్లీష్ టీమ్ దెబ్బకు తలవంచిన భారత జట్టు ప్రదర్శనపై బీసీసీఐ సమీక్షకు సిద్ధమవుతోంది. ఐదు టీ20ల సిరీస్ ముగియడమే ఆలస్యం ఆటగాళ్ల వ్యక్తిగత ప్రదర్శన, కోచ్ గౌతం గంభీర్, ఇతర సహాయక సిబ్బంది పనితీరును విశ్లేషించనుంది.

'టీ20ల్లో భారత జట్టు ప్రదర్శన పట్ల ఆందోళన చెందుతున్నాం. ఇంగ్లాండ్ సిరీస్ ముగియగానే కెప్టెన్ కోచ్తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహిస్తాం. అసలు పొరపాటు ఏం జరిగింది? ఎందుకు సిరీస్ ఓడాం? అనేది ఆరా తీస్తాం. తప్పులను సరిదిద్దుకొని మళ్లీ జట్టుకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం' అని బిసిసిఐ సెక్రటీ దేవజిత్ సైకియా పేర్కొన్నాడు.

**శాంసన్ను తప్పించడం**

స్వదేశంలో టీ–20 ప్రపంచకప్ సాధించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ను తప్పించి.. శ్రేయాస్ అయ్యర్కు పగ్గాలు ఇవ్వడం బెడిసికొట్టింది. అలానే ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా, ఆల్రౌండర్ హార్దిక్ పాండ్యాలు దూరమవ్వడం భారత జట్టుకు ప్రతికూలంగా మారగా.. వైభవ్ సూర్యవంశీ కోసం సంజూ శాంసన్ను తప్పించడం పెద్ద పొరపాటని స్పష్టమైంది. అలానే.. కోచ్గా గంభీర్ పనితీరు కూడా ఆశించిన స్థాయిలో లేదు. అతడి నేతృత్వంలో ఆటగాళ్లను పరీక్షించడం ఓ అలవాటుగా మారడం, ప్రతిభావంతులను పక్కన పెట్టేయడం వంటివి విమర్శలకు తావిస్తోంది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ కప్ 2027 అనంతరం గౌతీ భవితవ్యం కూడా తేలిపోనుంది.

# సైన్స్

## సేక్రెడ్ లోటస్‌కు అరుదైన జీవ లక్షణం!



ఇటీవల వెలుగులోకి వచ్చిన ఒక శాస్త్రీయ అధ్యయనం పవిత్ర కమలం (సేక్రెడ్ లోటస్ లేదా నెలుంబో–న్యుసిఫెరా) అనే మొక్కకు ఉన్న అరుదైన జీవ లక్షణాన్ని స్పష్టంగా చూపించింది. సాధారణంగా మొక్కలు పరిసర ఉష్ణోగ్రతపై ఆధారపడి ఉంటాయని మనం భావిస్తాం. కానీ సేక్రెడ్ లోటస్ మాత్రం పుష్పించే దశలో స్వయంగా వేడిని ఉత్పత్తి చేయగలదు. ఈ ప్రక్రియను థర్మోజెనెసిస్ అంటారు. మొక్కల్లో ఇది చాలా అరుదైన లక్షణం. ఇలాంటి సామర్థ్యం స్కంక్ క్యాబేజీ, ఆరమ్ లిల్లీలు వంటి కొద్ది మొక్కల్లో మాత్రమే కనిపిస్తుంది. కమలం విషయంలో ఈ లక్షణం ప్రధానంగా పరాగసంపర్కాన్ని మెరుగుపరచేందుకు పరిణామ క్రమంలో ఏర్పడిన అనుకూలతగా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది ఉత్తర, మధ్య భారతదేశానికి స్వదేశీ మొక్క. చెరువులు, సరస్సులు, నెమ్మదిగా ప్రవహించే నీటి వనరుల్లో ఇది విస్తృతంగా పెరుగుతుంది. సాధారణంగా వేసవి ప్రారంభంలో పుష్పించడం మొదలవుతుంది. సాధారణంగా మైటోకాండ్రియా శక్తి ఉత్పత్తికి ఉపయోగపడతాయి. ఆ తర్వాత పువ్వు మగ దశలోకి మారినప్పుడు, ఈ కీటకాలు పుష్పరేణువులను తమ శరీరంపై మోసుకుని ఇతర కమలం పువ్వులకు చేరుతాయి. దీని వల్ల క్రాస్–పోలినేషన్ సమర్థవంతంగా జరుగుతుంది. జీవశాస్త్ర పరంగా చూస్తే,ఇది మొక్కలు మారుతున్న పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా తట్టుకునే శక్తిని పెంచుతుంది. అందువల్ల పవిత్ర కమలం కేవలం సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రతీక మాత్రమే కాకుండా, అరుదైన శాస్త్రీయ లక్షణాలను కలిగి ఉన్న ఒక విశిష్ట జీవిగా కూడా నిలుస్తుంది.

# కుంగుతున్న డెల్టాలు!



ఇటీవల నేచర్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అంతర్జాతీయ అధ్యయనం భారతదేశానికి తీవ్రమైన హెచ్చరికను ఇస్తోంది. ఈ పరిశోధన ప్రకారం, ప్రపంచంలోని అనేక ప్రధాన నది డెల్టాలు వేగంగా కుంగిపోతుండగా, భారతదేశానికి చెందిన కొన్ని కీలక డెల్టాలు అత్యంత ఆందోళనకర స్థితిలో ఉన్నాయి. ఈ భూకుంగింపు ప్రక్రియ కోట్లాది మందిని వరదలు, భూమి నష్టం, బలవంతపు వలసల ప్రమాదంలోకి నెట్టే పరిస్థితిని సృష్టిస్తోంది. ఈ అధ్యయనం ప్రపంచవ్యాప్తంగా 29 దేశాల్లో ఉన్న 40 ప్రధాన నది డెల్టాలను విశ్లేషించింది. ఈ డెల్టాల ప్రాంతాల్లో సుమారు 23.6 కోట్ల మంది ప్రజలు తక్షణ వరద ముప్పుకు గురయ్యే పరిస్థితుల్లో నివసిస్తున్నారని అధ్యయనం వెల్లడించింది. భారతదేశంలో గంగా–బ్రహ్మపుత్ర, బ్రహ్మణి, మహానది, గోదావరి, కావేరి, కబాని వంటి డెల్టాలు గణనీయంగా కుంగిపోతున్నవిగా గుర్తించారు. ఇవి దేశ ఆహార భద్రతకు, ఆర్థిక వ్యవస్థకు, జనసాంద్రతకు అత్యంత కీలకమైన ప్రాంతాలు కావడం వల్ల ఈ నివేదిక మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. చాలా డెల్టాల్లో భూమి కుంగే వేగం ప్రపంచ సగటు సముద్ర మట్టం పెరుగుదల కంటే ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. ప్రస్తుతం సముద్ర మట్టం సగటున ఏడాదికి సుమారు 4 మిల్లీమీటర్లు పెరుగుతున్నట్లు అంచనా. అయితే 2014 నుంచి 2023 మధ్య కాలంలో పరిశీలించిన డెల్టాల్లో సగానికి పైగా ఏడాదికి 3 మిల్లీమీటర్లకు మించిన వేగంతో కుంగిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మొత్తం డెల్టా విస్తీర్ణంలో దాదాపు 35 శాతం ప్రాంతం క్రమంగా దిగజారుతుండగా, 40 డెల్టాల్లో 38 డెల్టాల్లో సగానికి మించిన ప్రాంతం భూకుంగింపును ఎదుర్కొంటోంది. భారతదేశానికి సంబంధించి బ్రహ్మణి, మహానది డెల్టాలు అత్యంత వేగంగా కుంగిపోతున్న ప్రాంతాలుగా పేర్కొంటున్నారు. ప్రపంచ స్థాయిలో గంగా–బ్రహ్మపుత్ర డెల్టా, నైల్, మెకాంగ్, యాంగ్జీ, అమెజాన్, ఇరవాడి, మిసిసిపి వంటి ఏడు ప్రధాన డెల్టాలు కలిపి ప్రపంచంలోని మొత్తం కుంగిపోతున్న డెల్టా విస్తీర్ణంలో సుమారు 57 శాతం, అంటే దాదాపు 2.65 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ఆక్రమిస్తున్నాయి. భూగర్భజల వినియోగంపై తక్షణ నియంత్రణలు, సమగ్ర డెల్టా నిర్వహణ విధానాలు చేపట్టకపోతే, రాబోయే దశాబ్దాల్లో వరదలు, భూమి నష్టం, బలవంతపు వలసలు మరింత తీవ్రంగా మారతాయని ఈ అధ్యయనం స్పష్టంగా హెచ్చరిస్తోంది.

## వినూత్న ఆవిష్కరణ..




ఇటీవల శాస్త్రవేత్తలు హీలియం లీకులను గుర్తించేందుకు ఒక వినూత్నమైన శబ్ద ఆధారిత సెన్సార్‌ను అభివృద్ధి చేశారు. ఇది రసాయన చర్యలపై ఆధారపడకుండా పనిచేయడం వల్ల ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. హీలియం అనేది రసాయనికంగా నిర్జీవమైన వాయువు కావడంతో సంప్రదాయ సెన్సార్లతో దాన్ని గుర్తించడం కష్టం. అంతేకాకుండా ఇది అరుదైన వనరు కావడం, అనేక కీలక పరిశ్రమలకు అవసరమవడం వల్ల లీకుల గుర్తింపు అత్యంత ముఖ్యమైంది. ఈ నేపథ్యంలో శబ్ద తరంగాలను ఉపయోగించే ఈ కొత్త సాంకేతికత ఒక పెద్ద ముందడుగుగా భావించబడుతోంది. ఈ సెన్సార్‌లో టోపోలాజికల్ మెటీరియల్స్‌ను వినియోగించారు. ప్రత్యేకంగా కగోమే లాటీస్ అనే త్రిభుజాకార నిర్మాణాన్ని ఉపయోగించి శబ్ద తరంగాలను మూలల్లో బంధించే విధానం దీనికి ఆధారం. కానీ ఈ సెన్సార్‌లో అలాంటి చర్య అవసరం లేదు. శబ్ద తరంగాలు ఒక నిర్దిష్ట స్థితిలో చిక్కుకుని ఉండగా, చుట్టూ ఉన్న మాధ్యమంలో మార్పు వస్తే వాటి ప్రవర్తనలో తక్షణ మార్పు కనిపిస్తుంది. హీలియం లీక్ అయినప్పుడు సెన్సార్‌లో శబ్దం ప్రయాణించే వేగం మారుతుంది. ఆ ఫ్రీక్వెన్సీ మార్పును కొలిచి, హీలియం లీకేజీ స్థాయిని వెంటనే లెక్కించవచ్చు. ఎంఆర్ఐ స్కానర్లు, రాకెట్ ఇంధన వ్యవస్థలు, డీప్ సీ డైవింగ్, ప్రత్యేక వెల్డింగ్ ప్రక్రియలు వంటి కీలక రంగాల్లో హీలియం అనివార్యం. ప్రపంచవ్యాప్తంగా హీలియం కొరత పెరుగుతున్న పరిస్థితుల్లో, లీకులను సమర్థవంతంగా గుర్తించే ఈ శబ్దాధారిత సెన్సార్ భవిష్యత్తులో పరిశ్రమలకు ఎంతో ఉపయోగకరంగా మారే అవకాశం ఉంది.



## దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే మూవీ టైటిల్ 'శ్రీశ్రీ'

హీరో దుల్కర్ సల్మాన్ ప్రస్తుతం నూతన దర్శకుడు రవి నెలకుదిటి దర్శకత్వంలో రూపొందుతున్న క్రేజీ ఎంటర్‌టైనర్ 41తో బిజీగా ఉన్నారు. ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ ఇది. ఇషాన్ సక్సేనా ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రేమ, వినోదం, మనసుని తాకే వోద్వేగాలను అందంగా మేళవించిన ఈ రొమాంటిక్ ఎంటర్టైనర్లో దుల్కర్ సల్మాన్ సరసన పూజా హెగ్డే తొలిసారిగా నటిస్తున్నారు. ఇంతకుముందు విడుదల చేసిన వర్కింగ్ స్టిల్స్ ఈ జంట మధ్య ఉన్న ఆకట్టుకునే కెమిస్ట్రీ ప్రజెంట్ చేశాయి. ఆ ఉత్సాహాన్ని కొనసాగిస్తూ.. చిత్ర నిర్మాతలు ఇప్పుడు సినిమా టైటిల్‌తో పాటు, ప్లజెంట్ ఫస్ట్‌లుక్ పోస్టర్ను కూడా విడుదల చేశారు.ఈ సినిమాకు 'శ్రీశ్రీ' అనే టైటిల్ ఖరారు చేశారు. దీనికి 'లవ్ విల్ స్పార్క్ అగైన్' అనే ఆకట్టుకునే ట్యాగ్లైన్ ఉంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే ఇద్దరూ ఒక కాంపౌండ్ గోడపై కూర్చుని సరదాగా మాట్లాడుకుంటూ కనిపిస్తున్నారు. పాస్టెల్ బ్లూ షర్ట్, గ్రే ట్రౌజర్, కళ్లద్దాలతో కనిపిస్తున్న దుల్కర్ సిగ్గరించిన చిరునవ్వుతో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తే, లైట్ బ్లూ సల్వార్ స్రూట్‌లో ఉన్న పూజా హెగ్డే అతని వైపు చూసి మనసారా నవ్వుతూ కనిపిస్తోంది. ఇద్దరి మధ్య ఉన్న సహజమైన కెమిస్ట్రీ పోస్టర్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనయ్ ఓం గోస్వామి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జివి ప్రకాశ్ కుమార్ సంగీతం సమకూరుస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. ఈ ముగ్గురి ప్రతిభతో చిత్రం విజువల్‌గా ఎమోషనల్‌గా అద్భుతంగా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.శ్రీశ్రీ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో భారీగా విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: జి.వి. ప్రకాష్ కుమార్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా.

## 'రోషన్ కనకాల' హీరోగా కొత్త చిత్రం షురూ



ప్రముఖ యాంకర్ సుమ కుమారుడు రోషన్ కనకాల హీరోగా కొత్త చిత్రం ప్రారంభమైంది. ఈ సినిమాలో రోషన్ సరసన గహజి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రం ద్వారా విజయ్ కె కామిశెట్టి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. దర్శకుడు విఐ ఆనంద్ వద్ద చీఫ్ అసోసియేట్ డైరెక్టర్, డైలాగ్ రైటర్‌గా ఎన్నో ఏళ్లుగా పనిచేసిన విజయ్, 'టైగర్', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ఒక్క క్షణం', 'డిస్కో రాజా', 'స్వయంభు' వంటి విజయవంతమైన చిత్రాలలో కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు ఈ ప్రాజెక్ట్స్‌తో ఆయన దర్శకత్వంతో పాటు స్క్రీన్‌ప్లే , సంభాషణలు అందిస్తున్నారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్ సినిమాల స్థాయిని తన వినూత్న స్టోరీ టెల్లింగ్ తో మార్చిన విఐ ఆనంద్ అందించిన కథ ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. హీరో నిఖిల్ ముహూర్తపు షాట్కు క్లాప్ కొట్టగా, సినిమాటోగ్రాఫర్ కెకె సెంథిల్ కుమార్ కెమెరాను స్విచ్ ఆన్ చేశారు. విఐ ఆనంద్ స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందజేయడమే ముహూర్తపు షాట్‌కు దర్శకత్వం వహించారు.ఫాంటసీ, రొమాన్స్, కామెడీ, మిస్టరీ, అత్యాధునిక సైన్స్ ఫిక్షన్ అంశాల కలయికతో రూపొందుతున్న ఈ చిత్రం, ఊహలు, భావోద్వేగాలు, అద్భుతమైన దృశ్యాలతో కూడిన ఒక కొత్త ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకువెళ్లనుంది. పూర్తి స్థాయి థియేట్రికల్ ఎంటర్‌గారూ పొందిస్తున్నారు. తరుణ్ రెడ్డి సహ నిర్మాతగా, వి.ఐ. ఆనంద్, అనూష వేలుస్వామి క్రియేటివ్ ప్రొడ్యూసర్లుగా, బండి భాస్కర్, శైలేంద్ర కుమార్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్లుగా పని చేస్తున్నారు. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతుండగా, రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది.

# రీల్



## చదువులేని మొద్దు ప్రేమకథ 'లెనిన్'

**రివ్యూ**

అఖిల్ అక్కినేని ...ఐదేళ్లపాటు సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నాడు. గడచినా ఐదేళ్లలో భారీ బడ్జెట్ సినిమాలు చేసిన ఒక్కటి కూడా సక్సెస్ కాలేదు. ఏజెంట్ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ పరాజయం పాలైన సుమారు మూడేళ్ల గ్యాప్ తీసుకుని అఖిల్ చేసిన తాజా సినిమా లెనిన్. ఇప్పటి వరకు అఖిల్ కు సరైన కమర్షియల్ సక్సెస్ లేదు. ఇందులో హీరోయిన్ గా నటించిన భాగ్యశ్రీ బోర్సేకు కూడా కమర్షియల్ సక్సెస్ లేదు. ఇద్దరికీ ఈ సినిమా సక్సెస్ అయితే లైఫ్ వచ్చినట్టు. లెనిన్ సినిమా చూస్తున్నంత సేపు చాలా సినిమాల్లో చాలా సీన్లు చూసినట్టే ఉంటుంది. కొత్తగా ఏమి చెప్పలేదు. కథ పాతదే కానీ కథనంలో అక్కడక్కడా ట్విస్టులు పెట్టి కథను నడిపించాడు దర్శకుడు మురళి కిశోర్. తెలుగు సినిమాకు కావలసిన కమర్షియల్ హంగులు అన్ని ఇందులో జోడించారు. అఖిల్ ను మాస్ హీరోగా చూపించే ప్రయత్నం చేశాడు దర్శకుడు. లెనిన్ అసలు జైలుకు ఎందుకు వెళ్ళాడు అనే అంశాన్ని సరిగ్గా ఎస్టాబ్లిష్ చేయడంతో దర్శకుడు తడబడ్డాడు. కొన్ని సన్నివేశాలు తేలిపోయాయి. కొన్నిసన్నివేశాలు చాలా సినిమాల్లో చూసినట్టుగానే అన్నిస్తుంది. మరి ఈ లెనిన్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాడా? లేదా? అనేది తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే.

**కథ:** చిత్తూరు జిల్లాలోని శ్రీరామపురం అనే ఊరిలో ప్రతియేటా ద్రౌపతి అమ్మవారి ఉత్సవాలు పద్దెనిమిది రోజుల పాటు ఘనంగా జరుగుతాయి. లెనిన్ (అఖిల్) చిన్నతనంలో అక్కడికి వస్తాడు. జయంతి (ఈశ్వరి రావు) లెనిన్ గురించి కనుకుంటే అనాథ అని తెలుస్తుంది. దీంతో అతని తన ఇంటికి తీసుకువచ్చి తన కన్న కొడుకు వసంత్ (ప్రమోద్)తో కలసి పెంచి పెద్ద చేస్తుంది. ఆమె కన్న కొడుకు మాత్రం డాక్టర్ చదువుకుంటాడు. లెనిన్ మాత్రం చదువు సంధ్య లేకుండా గ్రామంలోనే ఉంది పోతాడు. ఒకసారి జాతర జరుగుతున్న సమయంలో భారతి (భాగ్యశ్రీ బోర్సే) ను చూసిన లెనిన్ ఆమె ప్రేమలో పడతాడు. ఆమె కూడా లెనిన్ ను ప్రేమిస్తుంది. మద్రాసులో డాక్టర్ చదువుకుని వచ్చిన వసంత్ తో భారతి పెళ్లి చెయ్యాలని పెద్దలు నిర్ణయిస్తారు. ఎలాంటి పరిస్థితుల్లో లెనిన్ ఏం చేశాడు? ఈ కథలో యతిరాజు (శివాజీ), దామోదర్ (బ్రహ్మాజీ), పార్థసారథి (సునీల్) పాత్రలు ఏమిటి? వీళ్ళవల లెనిన్ కు జరిగిన నష్టం ఏమిటి? మంచి ఏమిటి? చివరికి లెనిన్ ప్రేమకథ ఎలాంటి మలుపులు తిరిగింది అనేదే సినిమా కథ. లెనిన్ మాస్ లుక్ కు తగ్గట్టుగానే అఖిల్ ను తాయారు చేశారు. హీరోయిన్ భాగ్యశ్రీ హీరో అఖిల్ కు జోడి సరిగ్గా సరిపోయింది. కోర్టు సినిమా లో చేసిన మంగపతి క్యారెక్టర్ తరువాత శివాజీ ఈ సినిమాలో మరింత రెచ్చిపోయి నటించాడని చెప్పవచ్చు. బ్రహ్మాజీ. సునీల్ వారి పాత్రలకు న్యాయం చేశారు. సినిమా మొత్తం లెనిన్ మాత్రమే కనిపించకుండా దర్శకుడు అక్కడక్కడా కథలో జాగ్రత్తలు తీసుకున్నాడనిపిస్తోంది. బ్రహ్మాజీ, సునీల్, ఈశ్వరి రావు వంటి పత్రాలు వచ్చినప్పుడు ఆ పాత్రలను చక్కగానే తెరకెక్కించాడు. భాగ్యశ్రీ చాలా క్యాజువల్ గా నటించేసింది. పాత సినిమాలోని డైలాగులు చెప్పడం వంటి సన్నివేశాల్లోనూ భాగ్యశ్రీ మంచి మార్కులే కొట్టేసింది. నిజానికి అఖిల్ అకంటే చాలా బాగా నటించిందని చెప్పడం అతిశయోక్తి కాదు.

సంగీతం పరంగా థమన్ ఒకటి రెండు మంచి పాటలే ఇచ్చాడు. కానీ రీ రికార్డింగ్ చెడగొట్టాడు. చెవులు పగిలిపోయేలా డ్రమ్స్ సౌండ్ తో బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ నింపేశాడు. దీంతో చాలా చోట్ల చెవులు పగిలే సౌండ్ తో చిరాకు వస్తుంది. ఇలాంటి బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ఇంతకు ముందు థమన్ చేసిన చాలా సినిమాల్లో వాడాడు. పాటల వరకు మ్యూజిక్ బాగానే ఇచ్చిన థమన్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ మారిస్తే బాగుండేదనిపిస్తోంది.అఖిల్ కు ఈ సినిమా ఓవరాల్ గా భారీ హిట్ ఇవ్వకపోయినా యావరేజ్ గా ఈ సినిమా నడుస్తుందని చెప్పవచ్చు. నిజానికి అక్కినేని ఫాన్స్ ఎదురు చూస్తున్న స్థాయి హిట్ కాకపోయినా అఖిల్‌కు తొలి ఎబో యావరేజ్ సినిమాగా సంతృప్తి చెందుతారు.


## 'మారెమ్మ'కథ ఎమోషనల్‌గా కదిలించింది

### గేయ రచయిత మిట్టపల్లి సురేందర్



రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ విలేజ్ యాక్షన్‌డ్రామా 'మారెమ్మ'తో హీరోగా పరిచయం అవుతున్నారు. మంచాల నాగరాజు దర్శకత్వం వహిస్తున్నారు. మయూర్ రెడ్డి బండారు మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'మారెమ్మ' ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్,'బావ బావ', మారి సాంగ్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సందర్భంగా గేయ రచయిత మిట్టపల్లి సురేందర్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. 'ధైర్యం' సినిమాకు తొలిసారి పాట రాశాను. ఆ తర్వాత 'రాజన్న'లో 'కాలిగజ్జె ఘల్లుమంటే', 'జార్జ్ రెడ్డి'లో 'వాడు నడిపే బండి రాయల్ ఎన్ఫీల్డ్', 'లవ్ స్టోరీ'లో 'నీ చిత్రం చూసి', 'రాజు వెడ్స్ రాంబాయి'లో రాసిన పాటలు నాకు మంచి పేరు తీసుకొచ్చాయి. 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా నాకు చాలా తృప్తిని ఇచ్చింది. ఆ సినిమాలోని పాట నా జీవితంలో మర్చిపోలేని అనుభూతిని ఇచ్చింది.'మారి' అనేది సినిమాలో హీరో ఆడుకునే దూడ పేరు. ఇలాంటి పాట రాసే అవకాశం రావడం నా అదృష్టం. ఒక దూడ చుట్టూ ఎమోషన్, రిలేషన్‌ను ప్రజెంట్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఈ పాట రాస్తున్నప్పుడు నా బాల్యం గుర్తుకు వచ్చింది. 'బొబ్బిలి రాజా' సినిమాలోని బసవన్న పాటలా ఒక ల్యాండ్మార్క్ పాట రాయాలనే సంకల్పంతో ఈ పాట రాశాను.దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు క్లైమాక్స్‌కి వచ్చేసరికి ఆయనతో పాటు నేను కూడా ఏడ్చేశాను. అంతలా ఆ కథ నన్ను కదిలించింది. మొదట ఒక పాట కోసం పిలిచి, తర్వాత అన్ని పాటలు రాసే అవకాశం ఇచ్చారు. సినిమాలో మొత్తం ఆరు పాటలు ఉంటే, అందులో నాలుగు పాటలు నేను రాశాను. అన్ని పాటలు చాలా అద్భుతంగా వచ్చాయి.'పెద్ది' సినిమాలో రెండు పాటలు రాశాను. ఢిల్లీ ఎపిసోడ్‌లో వచ్చే 'అలసిపోవద్దురా పెద్ది', అలాగే పెద్ది ట్రైన్‌లో తిరిగి వస్తున్నప్పుడు వచ్చే 'అనగనగా' పాట, జగపతిబాబు గారి ఎపిసోడ్‌ల్లో వచ్చే 'ఆగిన శ్వాసలో ఆశయం ఉంది' పాటలు రాశాను. అవన్నీ కథకు ఆయువుపట్టులాంటి పాటలు. థియేటర్‌లోప్రేక్షకులను ఎంతగానో కదిలించాయి. దర్శకుడు చాలా అద్భుతంగా తీశారు. మాధవ్ కర్ణి పాత్రలో పూర్తిగా ఒదిగిపోయాడు. దర్శకుడు మాంచాల నాగరాజు చాలా టాలెంటెడ్. ప్రతి పాటను దగ్గరుండి రాయించారు. ఆయనకు ప్రతి విషయంలో మంచి ఇన్వాల్‌మెంట్ ఉంటుంది . సాహిత్యం మీద కూడా మంచి పట్టు ఉంది.సినీ పరిశ్రమలో చంద్రబోస్ నాకు స్ఫూర్తి.నేను ఏ పాట రాసినా నా కుటుంబం మొత్తం కలిసి వినేలా ఉండాలి. అలాంటి పాటలే రాయాలని ఇష్టపడతాను.లేదు. రెండు పడవల ప్రయాణం చేయను. ప్రస్తుతం సినిమా పాటలు రాయడానికే పూర్తి సమయాన్ని కేటాయించాను.ప్రస్తుతం దాదాపు పది సినిమాలకు పాటలు రాస్తున్నాను. ఇదుపుకాయితం, జిల్లేడు చెట్టు, దేత్తడి, డేవిడ్ రెడ్డి ఇలా పలు సినిమాలకు రాస్తున్నాను.

## 24న 'ది ఇండియా స్టోరీ' రిలీజ్



జీ స్టూడియోస్, ఎంఐజీ ప్రొడక్షన్ అండ్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'ది ఇండియా స్టోరీ' సినిమా నుంచి మరో ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేశారు. చేతన్ డీకే దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సాగర్ బి. షిండే కథ అందించడంతో పాటు నిర్మిస్తున్నారు. సమాజానికి సంబంధించిన కీలక అంశాన్ని కోర్ట్‌రూమ్ డ్రామా రూపంలో చూపిస్తున్న ఈ సినిమా జూలై 24న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది.విషపూరిత పురుగుమందుల వ్యవసాయం, దాని వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న తీవ్ర ప్రభావం వంటి అంశాల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలోని కొత్త పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది.విడుదల చేసిన పోస్టర్లో కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పాడే తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల్లో కనిపిస్తున్నారు. చుట్టూ ఉన్న జనాలు వారిపై కూరగాయలు విసురుతూ, వేలెత్తి చూపిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాజల్, శ్రేయాస్ ముఖాల్లో కనిపించే భయం, చుట్టూ నెలకొన్న ఉద్రిక్త వాతావరణం నిజాన్ని బయటపెట్టే ప్రయత్నం చేసే వారికి ఎదురయ్యే ప్రతిఘటనను బలంగా చూపిస్తోంది. నిశాంత్ భగవత్ సినిమాటోగ్రఫీ అందించగా, మంగేష్ ధాక్డే సంగీతం సమకూరుస్తున్నారు. ఆశిష్ మత్రే ఎడిటింగ్, షకీల్ అజ్మీ సాహిత్యం, అన్మోల్ భావే సౌండ్ డిజైనర్ గా పని చేస్తున్నారు.

# సింగరేణి గనులకు జాతీయ స్థాయి ఉత్తమ అవార్డులు

ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్ర బొగ్గు శాఖ ప్రతీ ఏటా నిర్వహించే అత్యుత్తమ గనుల ఎంపికలో ఈ సారి సింగరేణి సంస్థకు చెందిన 5 గనులు '5స్టార్ రేటింగ్' సాధించి జాతీయ స్థాయి ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యాయి. ఇందులో శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన ఆర్‌కె న్యూటెక్, ఆర్‌కె6, సత్తుపల్లి ఏరియా నుండి జెవిఆర్ ఓసి2, బెల్లంపల్లి ఏరియా నుండి ఖైరిగూడ ఓపెన్ కాస్టు గని, రామగుండం 3 ఏరియా నుండి ఆర్.జి ఓసి1 గనులు ఉన్నాయి. ఈ మేరకు కేంద్ర బొగ్గు శాఖ జాబితాను విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా 382 గనులు '5 స్టార్ రేటింగ్' కోసం దరఖాస్తు చేసుకోగా ఇందులో 50 గనులు 5 స్టార్ రేటింగ్‌కు ఎంపికయ్యాయి. అందులో 5 గనులు

**సింగరేణి నుంచి ఉండటం విశేషం**

గత ఏడాది నాలుగు గనులకు '5స్టార్ రేటింగ్' రాగా 2024–2025 సంవత్సరానికి గాను సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా 5 గనులకు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ఉత్తమ గనుల అధికారులకు, కార్మికులకు, సిబ్బందిని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. ఇతర గనులకు కూడా ఈ గనులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బొగ్గు గనుల్లో ఉత్తమ పని విధానం, కార్మిక సంక్షేమం, పర్యావరణహిత చర్యలు, సమీప గ్రామాల అభివృద్ధి వంటి ఏడు ప్రధాన విభాగాల్లో మొత్తం 50 అంశాలలో అత్యుత్తమంగా ఉంటున్న గనులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ తన అనుబంధ సంస్థ అయిన కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ ద్వారా ప్రతీ ఏడాది ఈ పోటీని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

**4 స్టార్ రేటింగ్ లో మరో 17 గనులు**

కాగా '5స్టార్' కంటే కొంచెం తక్కువ మార్కులు (80–90 శాతం) సాధించిన గనులను 4 స్టార్ రేటింగ్ గనులు అంటారు. ఈ గనులకు ఎటువంటి అవార్డులు ఇవ్వరు కానీ దాదాపు ఉత్తమ శ్రేణి వరకు వచ్చిన గనులుగా గుర్తింపు వస్తుంది. ఇలాంటివి సింగరేణిలో 17 గనులకు 4 స్టార్ రేటింగ్‌ను సాధించడం విశేషం.

**'ఏడు విభాగాలు.. 50 అంశాలు' ఆధారంగానే రేటింగ్**

దేశ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ బొగ్గు మైనింగ్ కంపెనీలు '5 స్టార్ రేటింగ్' కోసం స్వీయ మూల్యాంకనం నిర్వహించుకుని దరఖాస్తు చేస్తుంటాయి. ఇందులో ప్రధానంగా 7 విభాగాల్లో గనుల ప్రతిభ, పని పరిస్థితులు పరిగణనలోకి తీసుకుంటారు. ఆ గనుల్లో మైనింగ్ ఎలా నిర్వహిస్తారు? బొగ్గు తవ్వకం టెక్నాలజీని సమర్థవంతంగా వాడుతున్నారా? గని ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయి? గని ప్రభావిత ప్రాంతాలలో, గ్రామాలలో సంక్షేమ చర్యలు, కార్మిక సంక్షేమ చర్యలు ఏ స్థాయిలో అమలవుతున్నాయి?, రక్షణ, కార్మికుల భద్రతకు తీసుకొంటున్న చర్యలు, పర్యావరణహిత చర్యలు వంటివి పరిశీలనకు తీసుకొంటారు. ఈ 7 ప్రధాన విభాగాల్లో మొత్తం 50 అంశాలలో ఏ గనులు అయితే నూటికి 90 శాతం మార్కులు పై బడి సాధిస్తాయో వాటిని '5స్టార్' (అత్యుత్తమ) గనులుగా గుర్తిస్తారు. కాగా అత్యుత్తమ రేటింగ్ ఇచ్చే ముందు కోల్ కంట్రోలర్ విభాగానికి చెందిన నిపుణుల బృందం ఆ గనులను సందర్శించి, తమకు అందిన సమాచారం సరైనదా? కాదా? అని తనిఖీ చేస్తారు. ప్రత్యక్ష పరిశీలనలో సంతృప్తి చెందిన తర్వాతనే రేటింగ్‌కు ఎంపిక చేస్తారు.

## పోగొట్టుకొన్న వస్తువుకు సాంకేతిక పరిష్కారం

"scanandreturn.in" యాప్‌ను ప్రారంభించిన రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : సాధారణంగా ప్రజలు పోగొట్టుకున్న ప్రతి విలువైన వస్తువు తిరిగి దొరుకుతుందనే ఆశ్వాసం, భరోసానిచ్చేలా సాంకేతికంగా పరిష్కరించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం సింగరేణి రిటైర్డ్ జనరల్ మేనేజర్ జి.శ్రీను జంగా వంకర్ రూపొందించిన "scan and return.in" యాప్‌ను లైబ్రరీ సైన్స్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ రిటైర్డ్ చైర్మన్ ప్రొఫెసర్ విశ్వమోహన్, టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ, ఇంటర్ బోర్డ్ రిటైర్డ్ జాయింట్ సెక్రెటరీ చిలువేరు రఘురాంతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించి, మాట్లాడారు. సమాజంలో నిజాయితీ, బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని "scan and return.in" యాప్ ప్రోత్సహిస్తున్నదన్నారు. చాలామంది బిజి లైఫ్‌లో భాగంగా తమ పర్సులను, లగేజీ బ్యాగ్‌లను, స్టడీ సర్టిఫికెట్లను పోగొట్టుకుంటున్నారని తెలిపారు. సదరు వస్తువులు దొరికిన వ్యక్తులు నిజాయితీగా యజమానులకు తిరిగి పంపించాలంటే వివరాలు తెలియక అందించలేకపోతున్నారన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా శ్రీను జంగా వంకర్ 'scanand return.in' యాప్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. శ్రీను జంగా వంకర్ మాట్లాడుతూ గూగుల్‌లో 'scan andreturn.in ద్వారా రిజిస్టర్ అయి ఉచితంగా వివరాలను నమోదు చేసుకొని, క్యూఆర్ కోడ్ వస్తుందన్నారు. ఈ క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్‌ను వస్తువులపై అంటించుకోవచ్చన్నారు. ఒకవేళ వస్తువు దొరికిన వారు తమ మొబైల్ గూగుల్ లెన్స్ కెమెరా ద్వారా క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్‌ను స్కాన్ చేస్తే వారి వివరాలు నమోదు చేయగానే, వస్తువు యజమానికి అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

# విద్యార్థులకు ఉచిత ఎఐ శిక్షణ

టిఎంఆర్ఇఐఎస్‌లో ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు: మంత్రి మహమ్మద్ అజారుద్దీన్



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో మైనారిటీ విద్యార్థులను కృత్రిమ మేధస్సు (ఎఐ) రంగంలో భవిష్యత్ అవకాశాలకు సిద్ధం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ (టిఎంఆర్ఇఐఎస్) పరిధిలోని 205 పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న సుమారు 80 వేల మంది విద్యార్థులకు ఎఐ రెడీనెస్, డిజిటల్ సేఫ్టీ శిక్షణ అందించనున్నట్లు మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తెలిపారు. టిఎంఆర్ఇఐఎస్, మాస్క్ నెక్ట్స్ జెన్, డాక్సా కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (డిసిపిఎల్) భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్టు ప్రభుత్వం, విద్యార్థులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ఉచితంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. 'కృత్రిమ మేధస్సు భవిష్యత్తు. ఈ సాంకేతిక విప్లవంలో మన విద్యార్థులు వెనుకబడకుండా ఉండేందుకు ఎఐ విద్యను అందిస్తున్నాం. మూడు సంవత్సరాల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విద్యార్థుల నైపుణ్యాలు, డిజిటల్ అవగాహన, ఉపాధి అవకాశాలను మరింత పెంచుతుంది' అని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, బాలికలు కూడా ఎఐ, సాంకేతిక రంగాల్లో ముందంజలో నిలిచేలా ప్రత్యేక అవకాశాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు. ఈ డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమంలో ఎఐ, డిజిటల్ భద్రత, ఇంగ్లీష్ కమ్యూనికేషన్, నాయకత్వ లక్షణాలు, విమర్శనాత్మక ఆలోచన, ఆవిష్కరణలు వంటి అంశాలపై గేమిఫైడ్, స్వీయఅభ్యాస విధానంలో శిక్షణ అందించనున్నారు. దేశంలో మైనారిటీ విద్యార్థుల కోసం చేపడుతున్న అతిపెద్ద ఎఐ విద్యా కార్యక్రమాల్లో ఇది ఒకటిగా నిలవనుందని, తెలంగాణను సాంకేతికత, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఇది కీలక అడుగని మంత్రి పేర్కొన్నారు. విజయవంతానికి సహకరించిన మాస్క్ నెక్ట్స్ జెన్ వ్యవస్థాపకురాలు అన్ని త్రివేది, డిసిపిఎల్ ప్రతినిధి జోసెఫ్ క్రిస్టోఫర్, టిఎంఆర్ఇఐఎస్ కార్యదర్శి బి.షఫియుల్లా, అధ్యక్షుడు ఫహీమ్ ఖురేషిని మంత్రి అభినందించారు.

# 'ఫార్మా'లో 300 మంది విద్యార్థులు ఎంపిక

ఇంటర్ బోర్డ్ కార్యదర్శి అభిలాష అభినవ్‌తో హెటెరో సంస్థ ప్రతినిధుల సమావేశం



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రముఖ ఔషధ తయారీ సంస్థ హెటెరో ఫార్మా, తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖతో కలిసి భారీ స్థాయిలో నియామక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించింది. హెటెరో సంస్థకు చెందిన అత్యాధునిక తయారీ కేంద్రాలలో ప్రొడక్షన్,క్వాలిటీ కంట్రోల్ విభాగాలలో పనిచేసేందుకు 300ల మందికి పైగా ఇంటర్మీడియట్ (10+2) ఉత్తీర్ణులైన అభ్యర్థులను నియమించనుంది. తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్, కార్యదర్శి అభిలాష అభినవ్, హెటెరో సంస్థ హెచ్‌ఆర్ ఉన్నతాధికారులు అల్లా శ్రీనివాస్ (జనరల్ మేనేజర్ హెచ్‌ఆర్), మాధురి ఐ.(సీనియర్ మేనేజర్ హెచ్‌ఆర్) శుక్రవారం జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఇటీవల నిర్వహించిన మెగా జాబ్ మేళాల్లో హెటెరో సంస్థ 70 మందికి పైగా అభ్యర్థులను ఎంపిక చేసింది. ఎంపికైన అభ్యర్థుల ప్రతిభ, ఉత్సాహాన్ని గుర్తించిన ఆ సంస్థ మరి కొందరికి శిక్షణతో కూడిన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని విస్తరించింది. అనంతరం హెటెరో వైస్ ప్రెసిడెంట్ (హెచ్‌ఆర్) ఎస్.వెంకట జయపాల్ రెడ్డి మాట్లాడుతూ, 'తెలంగాణ యువత ఉపాధి అవకాశాలను పెంపొందించాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి మద్దతుగా ఇంటర్మీడియట్ అర్హత కలిగిన యువతకు 300 మందికి పైగా ఉద్యోగ అవకాశాలను కల్పించామని, ఇంటర్మీడియట్ విద్యాశాఖతో తమ భాగస్వామ్యాన్ని మరింత పెంచుతున్నామని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్, కార్యదర్శి అభిలాష అభినవ్ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థవంతమైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే తమ సంకల్పానికి ఈ భాగస్వామ్యమే నిదర్శనమన్నారు. హెటెరో సంస్థతో కలిసి పనిచేయడం ద్వారా యువతకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన శిక్షణతో పాటు స్థిరమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు.

# పుర పౌరులకు ఇక ఊరట

ఒకే బిల్లులో అన్ని మున్సిపల్ చెల్లింపులు!

ఒకే లావాదేవీ.. మూడు సేవలు

'బిల్ వన్' సేవలను ప్రారంభించిన మున్సిపల్ పరిపాలన శాఖ



ప్రజాపక్షం/హైదరాబాద్ : పట్టణ స్థానిక సంస్థలలో పౌరులకు మరింత సులభమైన, పారదర్శకమైన మరియు సౌకర్యవంతమైన సేవలను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో వినూత్న అడుగు వేసింది. మున్సిపల్ బకాయిలన్నింటిని ఒకే చోట చెల్లించేలా రూపొందించిన 'బిల్ వన్' సేవలను మున్సిపల్ పాలన శాఖ కార్యదర్శి, సిడిఎమ్ఎ డాక్టర్ టి.కె.శ్రీదేవి శుక్రవారం అధికారికంగా ప్రారంభించారు. నూతనంగా ప్రవేశ పెట్టిన ఈ విధానంలో ఇబ్రహీంపట్నంకు చెందిన యాదయ్య, సత్తిరాజు గౌడ్‌లు తమ ఆస్తిపన్ను చెల్లించారు. ఈ సరికొత్త విధానం ద్వారా ఇకపై పౌరులు తమ ఆస్తి పన్ను, నీటి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వంటి మున్సిపల్ బకాయిలన్నింటిని విడివిడిగా కాకుండా, ఒకే బిల్లు ద్వారా ఒకేసారి చెల్లించవచ్చు. దీనివల్ల ప్రతి సేవకు వేర్వేరుగా తిరగాల్సిన లేదా విడివిడిగా లావాదేవీలు చేయాల్సిన అవసరం తప్పుతుంది.

**'బిల్ వన్' విశేషాలు..**

ఒక పిటిఐఎన్‌కు అనుసంధానమై ఉన్న అన్ని రకాల మున్సిపల్ సేవలను ఒకే డిమాండ్ నోటీసు రూపంలో చూపిస్తారు. ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఆస్తులు ఉన్నప్పటికీ, వాటన్నింటి బకాయిలను విడివిడిగా కాకుండా ఒకే డిమాండ్ నోటీసులో పొందుపరిచేలా ఈ వ్యవస్థను రూపొందించారు. పన్ను చెల్లింపుదారుల ఆర్థిక సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, బకాయిలను ఒకేసారి కాకుండా పాక్షికంగా లేదా వాయిదాల పద్ధతిలో చెల్లించే పౌర అనుకూల సదుపాయాన్ని కూడా కల్పించారు. వివిధ సేవలకు విడివిడిగా డిమాండ్ నోటీసులు జారీ చేసే పరిపాలనా భారం మున్సిపాలిటీలకు తప్పుతుంది. అలాగే, పన్నుల వసూలు కోసం బిల్ కలెక్టర్లు పదే పదే పౌరుల ఇళ్లకు వెళ్లాల్సిన అవసరం గణనీయంగా తగ్గుతుంది.

**ఎక్కడ, ఎలా చెల్లించాలి?**

పౌరులు ఈ సేవలను రెండు మార్గాల ద్వారా ఉపయోగించుకోవచ్చు. మున్సిపల్ వార్డు అధికారులు లేదా బిల్ కలెక్టర్ల వద్ద ఉండే హ్యాండ్ హెల్డ్ డివైసెస్ ద్వారా నేరుగా చెల్లించవచ్చు. అధికారిక మున్సిపల్ వెబ్‌సైట్ https://emunicipal.telangana.gov.in/ ద్వారా 24 గంటలూ, ఎక్కడి నుంచైనా సులభంగా ఆన్‌లైన్ విధానంలో చెల్లించవచ్చు. సమాచార సాంకేతికతను (ఐటి) సద్వినియోగం చేసుకుంటూ పట్టణ పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగమే ఈ 'బిల్ వన్' సేవలని శ్రీదేవి తెలిపారు. పట్టణ స్థానిక సంస్థల పరిధిలోని పౌరులందరూ ఈ సరికొత్త సదుపాయాన్ని వినియోగించుకుని, తమ మున్సిపల్ బకాయిలను సురక్షితంగా, ఇబ్బందులు లేకుండా సకాలంలో చెల్లించాలని ప్రభుత్వం కోరింది.

## టిమ్స్ టెక్నీషియన్ పోస్టులు

డీఎంఐటీ అభ్యర్థుల దరఖాస్తులు స్వీకరించాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: టిమ్స్‌లో టెక్నీషియన్ పోస్టుల నియామకంలో డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ (డీఎంఐటీ) కోర్సు పూర్తి చేసిన అభ్యర్థుల దరఖాస్తులను కూడా స్వీకరించాలని తెలంగాణ హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు పిటిషనర్ల ఫలితాలను వెల్లడించవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

## డిఎస్‌పి సీనియారిటీపై ప్రభుత్వం తుది నిర్ణయం చెప్పాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: డైరెక్ట్ రిక్రూట్ డీఎస్పీల సీనియారిటీ నిర్ణయానికి సంబంధించిన వివాదంలో రాష్ట్ర ప్రభుత్వం తన తుది వైఖరిని ఈ నెల 28లోగా వెల్లడించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సీనియారిటీని పరీక్ష, శిక్షణ మార్కుల ఆధారంగా నిర్ణయించడం చట్టవిరుద్ధమని పిటిషనర్లు వాదించగా, ప్రభుత్వం అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపింది. దీంతో ధర్మాసనం చివరి అవకాశంగా విచారణను ఈ నెల 28కు వాయిదా వేసింది.

## తెలంగాణ జైళ్ల శాఖ సిబ్బందికి 'బిపిఆర్ అండ్ డి' ప్రశంసా పురస్కారాలు

ప్రజాపక్షం/హైదరాబాద్: 7వ అఖిల భారత జైలు డ్యూటీ మీట్2025 విజయవంతమైన నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన తెలంగాణ జైళ్ల, సంస్కరణ సేవల శాఖ సిబ్బందికి కేంద్ర హోంశాఖ పరిధిలోని బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బిపిఆర్ అండ్ డి) ప్రశంసా డిస్కులు, ప్రశంసా పత్రాలను ప్రకటించింది. 2025 సెప్టెంబర్ 9 నుంచి 11 వరకు నిర్వహించిన 7వ అఖిల భారత జైలు డ్యూటీ మీట్ 2025 విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయడం, సమన్వయం కల్పించడం, విధి నిర్వహణలో అంకిత భావంతో సేవలు అందించినందుకు ఈ పురస్కారాలను కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని బిపిఆర్ అండ్ డి 2026 జూలై 3న ప్రకటించింది. జైళ్ల, సంస్కరణ సేవల శాఖ సిబ్బంది చూపిన నిబద్ధత, సమర్థవంతమైన నిర్వహణ, బృంద సమన్వయానికి గుర్తింపుగా ఈ ప్రశంసా డిస్కులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ గుర్తింపు తెలంగాణ జైళ్ల శాఖకు జాతీయ స్థాయిలో లభించిన మరో గౌరవంగా భావిస్తున్నారు.

## ఫిఫా వరల్డ్ కప్ మీడియా హక్కుల పేరిట రూ.2 కోట్ల మోసం

ప్రజాపక్షం/హైదరాబాద్: ఫిఫా వరల్డ్ కప్2026 భారత ఉపఖండ మీడియా హక్కుల పేరుతో నకిలీ బ్యాంకు పత్రాలు, తప్పుడు హామీలతో సుమారు రూ.2 కోట్ల మోసానికి పాల్పడ్డారనే ఆరోపణలపై అమెరికాకు చెందిన దీలీప్ మస్కే అలియాస్ సామ్‌తో పాటు పలువురిపై హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. మెటలాయిడ్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి ప్రీతిష్ కొల్లాటి ఫిర్యాదు మేరకు బిఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. యుబిఎస్ బ్యాంక్ జ్యూరిచ్ పేరుతో సమర్పించిన బ్యాంకు స్టేట్‌మెంట్లు, కార్పొరేట్ గ్యారంటీలు, బ్యాంక్ కంఫర్ట్ లెటర్లు నకిలీవని ధృవీకరణలో తేలినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మోసం కారణంగా మీడియా హక్కుల ప్రక్రియలో సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లిందని, రూ.2 కోట్ల ఆర్థిక నష్టం జరిగిందని ఆరోపించారు. ఈ ఘటనపై సిసిఎస్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# సైబర్ నేరాల నిర్మూలనకు మ్యూల్ అకౌంట్లు, ఘోస్ట్ సిమ్‌లపై ఉమ్మడి పోరు అవసరం

డిజిటల్ మోసాలపై 'సిటిజన్స్ హ్యాండ్‌బుక్' విడుదల

రోజుకు హైదరాబాద్‌లోనే రూ.1 కోటి వరకు సైబర్ మోసాలు జరుగుతున్నాయని వెల్లడి : సిపి సజ్జనార్



ప్రజాపక్షం/హైదరాబాద్: సైబర్ నేరాల నెట్‌వర్క్‌కు మ్యూల్ అకౌంట్లు, ఘోస్ట్ సిమ్‌లు ప్రాణాధారంగా మారాయని, బ్యాంకులు, టెలికాం సంస్థలు, నియంత్రణ సంస్థలు, చట్ట అమలు సంస్థలు సమన్వయంతో పనిచేసి వాటిని పూర్తిగా నిర్మూలించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ పిలుపునిచ్చారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసిసిఐ), హైదరాబాద్ సిటీ పోలీస్, ప్రొటివిటీ ఇండియా సంయుక్తంగా శుక్రవారం ఫెడరేషన్ హౌస్‌లో నిర్వహించిన 'డిజిటల్ ట్రస్ట్ సిటిజన్ ప్రొటెక్షన్' జాతీయ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డిజిటల్ మోసాలు ప్రస్తుతం కేవలం సైబర్ నేరాల సమస్య మాత్రమే కాకుండా సామాజిక, ఆర్థిక ముప్పుగా మారాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. పౌరులలో డిజిటల్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు 'సిటిజన్స్ హ్యాండ్‌బుక్ ఆన్ డిజిటల్ ఫ్రాడ్ అవేర్‌నెస్, ప్రివెన్షన్' ను సమావేశంలో ఆవిష్కరించారు. సజ్జనార్ మాట్లాడుతూ సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు ఫిర్యాదు చేయాలని సూచించారు. దీనిని ఆయన 'గోల్డెన్ అవర్ లైఫ్‌లైన్'గా అభివర్ణిస్తూ, ఎంత త్వరగా ఫిర్యాదు చేస్తే అంత త్వరగా డబ్బును ఫ్రీజ్ చేసి బాధితులకు తిరిగి అందించే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. హైదరాబాద్ నగరంలోనే రోజుకు సుమారు రూ.1 కోటి మేర సైబర్ మోసాలు జరుగుతున్నాయని వెల్లడించారు. 'సైబర్ నేరాలను అరికట్టాలంటే చట్ట అమలు సంస్థలు, బ్యాంకులు, టెలికాం కంపెనీలు, టెక్నాలజీ సంస్థలు, విద్యా సంస్థలు, పరిశ్రమలు, పౌరులు అందరూ కలిసి పనిచేయాలి. అవగాహననే అత్యంత శక్తివంతమైన ఆయుధంగా భావించాలి. ప్రతి పౌరుడు 'నేను సైబర్ మోసగాళ్ల బారిన పడను' అనే ప్రతిజ్ఞ చేయాలి' అని సజ్జనార్ అన్నారు. ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షుడు ఆర్.రవికుమార్ మాట్లాడుతూ, డిజిటల్ సాంకేతికతలు ప్రజల జీవితాలను సులభతరం చేసినప్పటికీ కొత్త రకాల ప్రమాదాలను కూడా తెచ్చాయని, డిజిటల్ వ్యవస్థలపై ప్రజల విశ్వాసాన్ని పెంపొందించేందుకు అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## ఇస్కాఫ్ ప్రతినిధి బృందం నేపాల్ పర్యటన



ప్రజాపక్షం/హైదరాబాద్: భారత్ నేపాల్ మధ్య చారిత్రక, సాంస్కృతిక, ప్రజా సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో భారత సాంస్కృతిక స్నేహ సహకార సంఘం (ఇస్కాఫ్) ప్రతినిధి బృందం జూలై 12 నుంచి 17 వరకు నేపాల్‌లో పర్యటించనుంది. నేపాల్ మాజీ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి ఆహ్వానం మేరకు జరుగుతున్న ఈ పర్యటనకు ఇస్కాఫ్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ కడారు ప్రభాకర్ రావు నాయకత్వం వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం నేపాల్ మాజీ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలితో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, మేధావులు, సామాజిక, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులతో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలు, సాంస్కృతిక మార్పిడి, విద్య, పర్యాటకం, యువజన సహకారం, ప్రజాస్వామ్య విలువలు, శాంతి, అభివృద్ధి వంటి అంశాలపై చర్చలు జరపనుంది. భారత్‌నేపాల్ దేశాల మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న చారిత్రక, ఆధ్యాత్మిక, సామాజిక బంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల మధ్య పరస్పర అవగాహన, స్నేహభావాన్ని పెంపొందించడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని ఇస్కాఫ్ వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రం నుంచి 10 మంది సభ్యులతో కూడిన ఈ బృందం పర్యటన ద్వారా ఇరు దేశాల మధ్య ప్రజా సంబంధాలు, సాంస్కృతిక సహకారం మరింత విస్తృతమవుతాయని ఇస్కాఫ్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ కడారు ప్రభాకర్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'ఎఐ' మరిన్ని ఉద్యోగాలను సృష్టిస్తుంది

'అంబేడ్కర్ విశ్వవిద్యాలయ అవగాహన కార్యక్రమం'లో శ్రీనివాస్ గుజ్జు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఎఐ) అనేది ఉద్యోగాలను తొలగించదని, మరిన్ని ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుందని, ఎఐని సమర్థవంతంగా ఉపయోగించడాన్ని నేర్చుకున్న నిపుణులకు మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఇంటెలిజెంట్ ఆటోమేషన్, ఫైనాన్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ సీనియర్ డైరెక్టర్ శ్రీనివాస్ గుజ్జు అన్నారు.హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీలో 'బాధ్యతాయుత కృత్రిమ మేధస్సు వినియోగం విద్యా విధానంలో ప్రపంచ దృక్పథం' అనే అంశంపైన విశ్వవిద్యాలయ అధ్యాపకులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజంలో ఎఐ అవసరం తప్పనిసరైందని, దీనిపైన విశ్వవిద్యాలయ అధ్యాపక సిబ్బంది పట్టు సాధించాలని, అప్పుడే విద్యార్థులకు పూర్తి స్థాయిలో అర్థమయ్యేలా బోధించవచ్చని సూచించారు. ప్రధాన వక్త శ్రీనివాస్ గుజ్జు మాట్లాడుతూ ఊహించిన ఫలితాలను తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో అందుకోవడానికి, ఉత్పాదకత సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ఏఐ సాధనాలను సహాయకులుగా మాత్రమే స్వీకరించాలని సూచించారు. పరిజ్ఞానం పొందిన తర్వాత సొంతంగా ఏఐ ఏజెంట్లను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్, కోల్ డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్పా చక్రపాణి మాట్లాడుతూ మారుతున్న ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఎల్. విజయ కృష్ణ రెడ్డి, ప్రొఫెసర్ ఆనంద్ పవార్, విసి ఓఎస్‌డి ప్రొఫెసర్ డి. రవీంద్రనాథ్ సోలమన్, ప్రొఫెసర్ పల్లవి కాబడే, ఎఐ సాంకేతిక నిపుణులు సుష్మనా రావు, ప్రొఫెసర్ బోజు శ్రీనివాస్, ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, ప్రొఫసర్ చంద్రకళ, ప్రొఫెసర్ మేరీనంద, ప్రొఫెసర్ ఎస్‌వి రాజశేఖర్ రెడ్డి, డైరెక్టర్లు, డీన్లు, ఆయా శాఖల అధిపతులు, విశ్వవిద్యాలయ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



## క్యూఆర్ కోడ్‌తో నూతన హెల్త్ కార్డులు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన 'ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్' మార్గదర్శకాలను ప్రభుత్వం త్వరలోనే విడుదల చేయాలని, ఈ నెల 15వ తేదీ నుంచి 'నూతన హెల్త్ కార్డుల'ను అమలులోనికి తీసుకురావాలని 'ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ బోర్డు' ఉన్నత స్థాయి సమావేశం నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు సూచించింది. హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, 'ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ బోర్డు' చైర్‌పర్సన్ సంజయ్ జాజు అధ్యక్షతన ట్రస్ట్ బోర్డ్ శుక్రవారం సమావేశమైంది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. 'క్యూఆర్ కోడ్‌తో నూతన హెల్త్ కార్డులు మొబైల్ నుండి డౌన్లోడ్ చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. అన్ని వివరాలతో ఇహెచ్‌సిటి యాప్‌ను రూపొందిస్తారు. కాగా చికిత్సలకు సిజిహెచ్‌ఎస్ ధరలను వర్తింపచేయాలని, నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ మార్గదర్శకాలపైన ఈనెల 13న (సోమవారం) సిఇఒతో సమావేశం కావాలని ఉన్నత స్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 943 ఆస్పత్రులలో నగదు రహిత వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, 2594 ప్రొసీజర్స్ కవర్ కానున్నాయి. ప్రస్తుతం 12 వెల్‌నెస్ సెంటర్లకు తోడు మరో 24 జిల్లా కేంద్రాల్లో నూతన వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. అవుట్ పేషెంట్ ట్రీట్‌మెంట్, పరీక్షలు, రోజువారీ ఔషధాలు వెల్‌నెస్ సెంటర్లలో అందుబాటులో ఉంటాయి.ఈ సమావేశంలో సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్హర్ మహేశ్ దత్ ఎక్కా, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు, ఇహెచ్‌ఎస్ సిఇఒ హనుమంతు కొడింబా, ఉద్యోగ, పెన్షనర్ల సంఘాలు, ఉద్యోగ సంఘాల జెఎసి ప్రతినిధులు సదానందంగౌడ్, చావ రవి, వి.లచ్చిరెడ్డి, మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాస రావు, పులగం దామోదర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కృష్ణమూర్తి, పి వెంకటరెడ్డి, సైదులు, దాస్యనాయక్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## నాలుగో తరగతి ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలి

సిఎఓ నాగార్జునకు ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న నాలుగో తరగతి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జిఓ నెం.60 ప్రకారం నెలకు రూ.15,600 కనీస వేతనం వెంటనే అమలు చేయాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. నరసింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని కమిషనర్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయంలో శుక్రవారం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (సిఎఓ) నాగార్జునకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ 2021 నుంచి జిఓ నెం.60 ప్రకారం నాలుగో తరగతి ఉద్యోగులకు రూ.15,600 కనీస వేతనం చెల్లించాలని కోరారు. అలాగే ఇఎస్ఐ, పిఎఫ్ చట్టాల ప్రకారం ఉద్యోగుల వాటాలతో పాటు యాజమాన్య వాటాలను ప్రతి నెల ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలని, 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి రూ.10 లక్షల ఆరోగ్య బీమా, రూ.10 లక్షల జీవిత బీమా, రూ.10 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. 2016లో సుప్రీంకోర్టు ఇచ్చిన 'సమాన పనికి సమాన వేతనం' తీర్పును అమలు చేయాలని, నాలుగో తరగతి ఉద్యోగులకు 100 శాతం గ్రాస్ శాలరీ, హెల్త్ కార్డులు, సంవత్సరానికి 35 క్యాజువల్ సెలవులు మంజూరు చేయడంతో పాటు వారిని శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ ఎస్ఎన్ఓ రమేష్, కాంటింజెంట్ వర్కర్ సురేష్, మెడికల్ ఆఫీసర్ అసిస్టెంట్ అజ్మీర విజయ్ నాయక్, శ్రీనివాస్, వై.రమేష్ కుమార్, సరూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.



## రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండలకేంద్రానికి ప్రధాన రహదారి డబుల్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే మందుల సామేలు ఆదేశించారు. శుక్రవారం చౌల్లరామారం గురజాల డబుల్ రోడ్డు పనులను ఆర్ అండ్ బి ఉన్నతాధికారులతో కలిసి చౌల్లరామారం వద్ద పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రోడ్డు పనులు నిలిచాయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు ఆరు నెల్లలో రోడ్డు పూర్తి చేయటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చౌల్లరామారం నుండి జానకీపురం వరకు పంచాయతీ రోడ్డు ఆర్ అండ్ బి శాఖకు మార్చాలని అధికారులను ఆదేశించారు. మానాయికుంట ఎక్స్ రోడ్డు నుండి చిర్రగూడూరు వరకు రోడ్డు పనులు సాగుతున్నాయి. మానాయికుంట ఎక్స్ రోడ్డు నుండి వెల్దెవి ఆత్మకూరు, మంగమ్మగూడెం వరకు, రాపాక నుండి కంచనపెల్లి, సర్వారెడ్డిపురం వరకు రోడ్డు మంజూరు అయినాయి అని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఏలేని కళాశాల త్వరలోనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలపార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, రాష్ట్ర నాయకులు ఇటికాల చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మనగోటి జోజి, మార్కెట్ కమిటీ మెంబర్ బాలెంల విద్యాసాగర్ పాల్గొన్నారు.

## ఎయిడ్స్ సోకినవారు క్రమం తప్పకుండా మందులు వాడాలి

### హెచ్ఐవి విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ



**ప్రజాపక్షం/నల్లగొండ:** ఎయిడ్స్ సోకినవారు భయపడకుండా క్రమం తప్పకుండా మందులు వాడాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. గతంలో ఎయిడ్స్ వ్యాధి సోకినవారు చనిపోయేవారని, కానీ ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన మార్పులు,మెరుగైన వైద్య చికిత్సలతో పరిస్థితులు మెరుగయ్యాయని తెలిపారు.శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని రెడ్ క్రాస్ సొసైటీలో స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో హెల్పింగ్ హాండ్స్ వైజాగ్ ,దాతల సహకారంతో హెచ్ఐవితో సోకిన విద్యార్థులకు నోటు పుస్తకాలు,బ్యాగులను పంపిణీ చేశారు.ఎయిడ్స్ వచ్చిన వారిని ముట్టుకున్నా హెచ్ఐవి రాదని,అది అపోహ మాత్రమే అని కలెక్టర్ స్పష్టం చేశారు. సమాజంలో ఎయిడ్స్ పై వచ్చిన అవగాహనతో పరిస్థితుల్లో ఎంతో మార్పు వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ ఫౌండర్ వెంకన్న,జిజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ నగేష్,ఏఆర్ సెంటర్ హెడ్ & డి డాక్టర్ స్వరూప రాణి, డెర్మటాలజీ హెచ్ఒడి డాక్టర్ నరసింహారావు నేత,ఎసిసిడి ప్రాజెక్టు ఆఫీసర్ జమీర్ పాల్గొన్నారు.

## పకడ్బందీగా 'సర్'

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజసనంద్ లాల్ పవార్



**ప్రజాపక్షం/మునగాల:** సర్‌ను పకడ్బందీగా నిర్వహించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామంలో 82వ బూత్‌ని ఆకస్మికంగా పరిశీలించారు. ఇచ్చిన గడువులోపు ఎన్యుమరేషన్ ఫారాలు ఓటర్లందరికి అందించి వారికి పూర్తి అవగాహన కల్పించి, అర్హత ఉన్న ప్రతి ఓటును సకాలంలో ఆన్‌లైన్ చేయించాలని బిఎల్ఓ శ్రీనివాస్, బిఎల్ఓ రాయరాల సుమన్‌కు సూచించారు. గ్రామంలో నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. బిఎల్వోలు ఓటర్ వివరాలు జాగ్రత్తగా పూరించాలని అని అన్నారు. తహసిల్దార్ సరితను మండలంలో సర్ కార్యక్రమ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు గడువు కంటే ముందే ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలియజేశారు. ఓటర్లు, సామాజిక కార్యకర్తలు బిఎల్‌వోలు, బిఎల్ఎలు సహకరించి తమ ఓటును ఫారంను సకాలంలో నింపి ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్, రెవెన్యూ అధికారి రామారావు, కార్యదర్శి పవన్, జీపీవో గోపినాథ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చండూరులో 'నీరా' పరిశ్రమను ఏర్పాటు చేయాలి

### గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరస్వామి

**ప్రజాపక్షం/చండూరు :** గీత కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని గీత పనివారల సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పబ్బు వీరస్వామి అన్నారు. శుక్రవారం చండూరు మండల కేంద్రంలో గీత పనివారల సంఘం చండూరు మండల సమావేశం పల్లె మల్లేశం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి పబ్బు వీరస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమం కోసం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు.గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వాణిజ్య కేంద్రమైన చండూరులో నీర పరిశ్రమను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన గీత కార్మికులందరికీ వృత్తి పెన్షన్, వితంతు పెన్షన్‌ను తక్షణమే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గీత కార్మికుల పిల్లలకు విద్య, నైపుణ్యాభివృద్ధి ,ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక పథకాలు అమలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్లగొండ రామలింగయ్య , గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకరయ్య , సంఘం మండల అధ్యక్షుడు గంట నగేష్ , సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు ,బోయపల్లి శంకర్ , గుండు కేశవులు , జిల్లా రాములు , ఉడుగుండ జంగయ్య , కాటపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ పాలనలో ఆర్థిక విధ్వంసం

### రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** తొమ్మిదేళ్ళ బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం రూ.8.20లక్షల కోట్ల మేర ఆర్థిక విధ్వంసం సృష్టించారని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బిఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందని కొనియాడారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు జీతాల కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చేదన్నారు. కానీ రేవంత్ రెడ్డి సర్కార్ రాగానే ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి ఉద్యోగులకు, కాంట్రాక్ట్ వర్కర్లకు ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లిస్తోందన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను సైతం క్లియర్ చేస్తున్నామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును బిఆర్ఎస్ నేతలు ఏటిఎంలా వాడుకున్నారని మండిపడ్డారు. రూ.1.27లక్షల కోట్లు ఖర్చు పెట్టినా కొత్తగా ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదని విమర్శించారు. తుమ్మిడిహెట్టి వద్ద కడితే గ్రావిటి ద్వారా నీళ్ళు వచ్చేవని, కానీ అంచనాలు పెంచి కమీషన్ల కోసం మేడిగడ్డను నిర్మించారని ఆరోపించారు. మూడేళ్లకే కాళేశ్వరం కాస్త కూలేశ్వరంగా మారిందని దుయ్యబట్టారు. 50 టిఎంసిలు కూడా ఎత్తిపోయలేని ప్రాజెక్టు కోసం రూ.33 వేల కోట్ల అప్పులు కట్టాల్సి వస్తోందన్నారు. మేడిగడ్డ బ్యారెజ్ నింపితే చుట్టుపక్కల గ్రామాలకు ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. హరీష్ రావు, కెటిఆర్‌లను బిల్లా రంగలతో పోల్చిన ఆయన వారిద్దరూ పోటీపడి మరి ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని విమర్శించారు. 3 వారాల సమయం ఇస్తే ప్రాజెక్టును బాగు చేస్తానంటున్న హరీష్‌రావు, గత 9 ఏళ్లుగా ఏం చేశారని ప్రశ్నించారు. కెసిఆర్ కుటుంబానికి వేల ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరంపై చర్చలో పాల్గొనాలని సవాల్ విసిరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్కో నియోజక వర్గంలో 3వేల ఇందిరమ్మ ఇండ్లను రూ.5లక్షలతో నిర్మిస్తున్నామని చెప్పారు. 10 ఇండ్లు కూడా కట్టని బిఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. సూర్యాపేటను కాళేశ్వరం నీళ్లతో తడిపామని జగదీష్‌రెడ్డి అబద్దాలు చెబుతున్నారని, నిజానికి జలయజ్ఞం కింద శ్రీరాంసాగర్ ద్వారానే ఈ ప్రాంతానికి నీళ్ళు వచ్చాయని స్పష్టం చేశారు. త్వరలోనే కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలను సరిచేసి ప్రజల వినియోగంలోకి తీసుకొస్తామని, బిఆర్ఎస్ చేసిన పాపాలను (అప్పులను) కడుగుతూనే అభివృద్ధి పథంలో దూసుకుపోతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, నాయకులు జ్యోతి కరుణాకర్, వల్దాస్ దేవేందర్, తండు శ్రీనివాస్ గౌడ్, నేరెళ్ల మధు గౌడ్, ఉపేందర్, బాణాల వెంకన్న, కుంచం అంజయ్య, ధర్మానాయక్, అరవింద రెడ్డి పాల్గొన్నారు.

# శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమం

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపు

### 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్




**ప్రజాపక్షం/మునుగోడు :** కేంద్ర పాలకులు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నందున శ్రమ దోపిడీ పెరుగుతుందని,దీనికి వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.శుక్రవారం మునుగోడులో జరిగిన ఏఐటియుసి మండల 11వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.పాలకవర్గాలు కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా మారాయని,దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులు ఇప్పుడు కనుమరుగయ్యాయని ఆరోపించారు.44 కార్మిక చట్టాలను సవరించి 4లేబర్ కోడ్‌లుగా తీసుకురావడం కార్మికులకు శాపంగా మారిందన్నారు.కార్మిక చట్టాల సవరణ పేరుతో యాజమాన్యాల కింద కార్మికులు బానిసలుగా పనిచేయాల్సిన పరిస్థితి వచ్చిందని, మోడీ సర్కార్‌కు కార్పొరేట్ల రక్షణ తప్ప కార్మిక సంక్షేమం పట్టదని విమర్శించారు.పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.మహాసభలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్గూరి నరసింహ,ఏఐవైఎఫ్‌జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.గత ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటా లకు సిద్ధం కావాలని అన్నారు.పెట్రోల్,డీజిల్ వంట గ్యాస్ ధరలు పెంచడం వలన పేద మధ్య తరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందుకు ఎదుర్కొంటున్నారని అన్నారు.జులై 19వ తేదీన నల్లగొండ జిల్లా ఏఐటీయూసీ మహాసభ గుర్రంపోడులో జరుగుతుందని అన్నారు.మహాసభలో కార్మికుల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. దుబ్బ వెంకన్న అధ్యక్షత వహించన ఈమహాసభలో ఏఐటియుసి మండల గౌరవ అధ్యక్షులు చాపల శ్రీను, మండల అధ్యక్షులు దుబ్బ వెంకన్న,కార్యదర్శి బెల్లం శివయ్య, మండల నాయకులు విరిగి లింగస్వామి,ఈద రాములు,బొల్లు సైదులు, గొడ్డటి శ్రీశైలం,కే మల్లేశా,చందపాక యాదయ్య,చిరంజీవి, ముత్తయ్య,వీరమల్ల అంజయ్య,ఇద రాములు పాల్గొన్నారు.

# గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియా చెల్లించకుండా సర్కార్ కాలయాపన



కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియా రూ.13కోట్లు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జె. సాయిలు గౌడ్, సమన్వయ రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించకుండా కాలయాపన చేస్తుందన్నారు. గీత కార్మికులపై సవతి తల్లి ప్రేమను చూపిస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. పెన్షన్ పొందుతూ మరణించిన గీత కార్మికులకు పెన్షన్ వారి భార్యలకు వెంటనే వర్తింప చేయాలన్నారు. గీత కార్మికులు తాటి, ఈత వనం పెంపకానికి ప్రతి సొసైటీకి టిఎఫ్‌కి 560 జిఓ ప్రకారం ఐదు ఎకరాల భూమిని వెంటనే కేటాయించాలన్నారు. ప్రతి జిల్లాకు ఒకటి చొప్పున నీరా పరిశ్రమ ఏర్పాటు చేసి గీత కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. జిల్లా కార్యదర్శి కొండ కోటయ్య మాట్లాడుతూ బొమ్మగాని ధర్మబిక్షం నాయకత్వంలో ఏర్పడిన గీత పనివారల సంఘం అనేక పోరాటాలు చేసి గీత సొసైటీలు, టిఎఫ్‌టిలు, గీత వృత్తి మీద ఉన్న త్రివిధ పనుల రద్దు కొరకు కార్మికుల హక్కుల కొరకు పోరాడి సాధించుకున్నామన్నారు. చెట్టుపై నుండి ఎక్కి కింద పడి మరణించిన వారికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఓకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు రేగటి లింగయ్య, గౌరవ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు పాలకూరి బాబు, తొట్ల ప్రభాకర్, జిల్లా నాయకులు బూర వెంకటేశ్వర్లు, దంతాల రాంబాబు, పెద్దిపోలు విష్ణుమూర్తి, బొడ్డు రామచంద్రు, బొడ్డు లింగయ్య, బూర సైదులు, బండపల్లి శ్రీనివాస్, పెద్ది బాలకృష్ణ, తండు వెంకన్న పాల్గొన్నారు.



## వామపక్ష విద్యార్థి సంఘాల విద్యా సంస్థల బంద్ విజయవంతం

**ప్రజాపక్షం/దేవరకొండ :** తెలంగాణ రాష్ట్రంలో విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని జులై 10వ తేదిన విద్యార్థి వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ పిలుపులో భాగంగా దేవరకొండ నియోజకవర్గ పరిధిలో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను పూర్తి స్థాయి సంపూర్ణ బంద్ నిర్వహించడం జరిగింది. మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి ఆర్డీవోకు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్, వట్టేపు శివలు మాట్లాడుతూ రాష్ట్రంలో 27వేల ప్రభుత్వ పాఠశాలలను 4వేలకు కుదించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనను మానుకోవాలని, విద్యా శాఖకు ప్రత్యేకంగా మంత్రిని ఇప్పటివరకు కేటాయించడకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలసత్వం వహించడం విద్యాశాఖని నిర్వీర్యం చేసే ఆలోచనలో భాగమే అని ఆరోపించారు. తక్షణమే విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని కోరారు. ఈకార్యక్రమంలో విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్, ప్రణయ్, కార్తీక్, శివ, గణేష్, శివ, అంజి, సతీష్, చైతన్య, సతీష్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మిర్యాలగూడ నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించిన బంద్‌కు విజయవంతమైంది. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టి ప్రభుత్వ దృష్టికి తమ డిమాండ్లను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా యశ్వంత్ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పెరుగుతున్న ఫీజుల నియంత్రణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా యశ్వంత్, మిర్యాలగూడ డివిజన్ నాయకులు రఫీ, అనిల్, అబ్దుల్ ఖాదర్, సంతోష్, అమాన్, కార్తీక్, రాకేష్, రోషన్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/చండూరు:** ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ఆలోచనను విరమించుకోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సరిపడ మౌళిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లెనిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చండూరు మున్సిపాలిటీ, మండల వ్యాప్తంగా కళాశాలు,ప్రభుత్వ , ప్రైవేట్ విద్యా సంస్థలు ఒక్క రోజు మూతపడ్డాయి. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చండూరు పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి కురుపాటి పరమేష్ , ఇరిగి ప్రవీణ్ , ఏఐవైఎఫ్ నాయకుడు గడ్డం నవీన్ , పల్లె నాగరాజు , పల్లె చరణ్ , చందు ,జోగేందర్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా చేనేత సహకార సంఘం ఎన్నికలు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి పట్టణ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన చేనేత సహకార సంఘం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల అధికారి యూసుఫ్ అలీ ఆధ్వర్యంలో రెండు పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేశారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహించగా 96.73 శాతం పోలింగ్ నమోదు అయింది. ఓటు హక్కు కలిగిన చేనేత కార్మికులు మొత్తం 644 ఓటర్లలో 623 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లుగా ఎన్నికల అధికారి తెలిపారు. జిల్లా చేనేత జోలి శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.7గురు జనరల్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు రాత్రి వరకు కొనసాగింది. రెండు మహిళా రిజర్వేషన్ల(2)కు గాను ఓట్ల లెక్కింపు త్వరగా చేయగా పాలాది జ్యోతి యాదగిరి(396) మహేశ్వరం నాగమణి (429) ఓట్లతో గెలుపొందారు. చేనేత సహకారం సంఘం చైర్మన్ అభ్యర్థి భారత లవ కుమార్‌తో పాటు ఆయన పానెల్ ఆధిక్యంలో కొనసాగుతున్నారు.



## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### నూతన మార్కెట్ గోదాం నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

**ప్రజాపక్షం/బీబీనగర్ :** భువనగిరి నియోజకవర్గంలోని బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలో భువనగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ ఆధ్వర్యంలో రూ.2.75 కోట్ల వ్యయంతో 2,500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల నూతన మార్కెట్ గోదాం నిర్మాణ పనులకు భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేఖా బాబురావు పూజా కార్యక్రమంలో పాల్గొనగా, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రైతులు ఎంతో శ్రమించి పండించిన ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు ఈ నూతన గోదాం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ గోదాం నిర్మాణం పూర్తయిన తర్వాత 2,500 మెట్రిక్ టన్నుల వరకు వ్యవసాయ ఉత్పత్తులను శాస్త్రీయ పద్ధతిలో నిల్వ ఉంచే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి వ్యవసాయ పిఏసిఎస్ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, భువనగిరి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మండల మరియు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# గంజాయి, బెల్ట్ షాపులను నిర్మూలించాలి

### యాదగిరిగుట్ట మున్సిపల్ సమావేశంలో సిపిఐ కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్ డిమాండ్



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** పట్టణంలో యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, అక్రమ బెల్ట్ షాపుల నిర్మూలనకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిపిఐ 12వ వార్డు కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణీ భరత్ గౌడ్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, కోఆప్షన్ సభ్యురాలు బండి జంగమ్మలు పలు ప్రజా సమస్యలపై మూడు ముఖ్యాంశాలను ఎజెండాగా ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వారు కౌన్సిల్ దృష్టికి తెచ్చిన ప్రధానంగా గంజాయి, బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపాలి

పట్టణంలో రోజురోజుకూ గంజాయి సంస్కృతి విస్తరిస్తోందని, యువత దీనికి బానిసలుగా మారుతున్నారని శ్రీధర్ ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి తోడు బెల్ట్ షాపులు విపరీతంగా పెరిగిపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, భవిష్యత్తులో శాంతిభద్రతల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. మున్సిపల్ అధికారులు, చైర్మన్ చొరవ తీసుకుని పోలీస్, ఎక్సైజ్ శాఖలతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి, గంజాయి, బెల్ట్ షాపుల నిర్మూలనకు గట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రోడ్లపై ఆక్రమణలు తొలగించాలి

యాదగిరిగుట్ట మెయిన్ రోడ్డుపై ఉన్న దుకాణదారులు తమ హద్దులు దాటి పూర్తిగా బీటీ రోడ్డు వరకు దుకాణాలను విస్తరిస్తున్నారని సభ దృష్టికి తెచ్చారు. రోడ్డుపైకే పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల గుట్టకు వచ్చే భక్తులకు, స్థానిక రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. కనీసం వాహనాలు ఆపడానికి కూడా స్థలం లేకుండా పోయిందని, తక్షణమే మున్సిపల్ కమిషనర్ స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని, దుకాణాలకు నిర్దిష్ట హద్దులు కేటాయించాలని కోరారు.
దేవాలయ ట్రస్ట్ బోర్డులో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలి

రాష్ట్ర ప్రభుత్వం 12 సంవత్సరాల సుదీర్ఘ కాలం తర్వాత యాదగిరిగుట్ట దేవాలయ ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేయడం శుభపరిణామమని పేర్కొంటూనే, అందులో స్థానికులకు అవకాశం కల్పించకపోవడం సరికాదన్నారు. కనీసం ఇక్కడి నుండి ప్రజాప్రతినిధిగా ఎన్నికైన ఆలేరు శాసనసభ్యులకు (ఎమ్మెల్యే) ట్రస్ట్ బోర్డులో అవకాశం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. బోర్డు సభ్యులు స్థానికులు కాకపోవడం వల్ల భక్తుల ఇబ్బందులు, పట్టణ అభివృద్ధిపై అవగాహన లోపం ఏర్పడే అవకాశం ఉంది. ముఖ్యంగా మున్సిపాలిటీకి దేవాలయం నుండి రావాల్సిన 30 శాతం నిధులు (గ్రాంట్స్), ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై బోర్డు కమిటీలో చర్చించేందుకు ఇప్పటికైనా ప్రభుత్వం స్థానికులకు, ఎమ్మెల్యేకు చోటు కల్పించాలని సీపీఐ పక్షాన డిమాండ్ చేశారు. సీఎంకు తీర్మానం సీపీఐ ప్రవేశపెట్టిన ఈ మూడు ఎజెండా అంశాలను కౌన్సిల్ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమస్యల పరిష్కారానికి తామంతా కృషి చేస్తామని చైర్మన్, సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు కౌన్సిల్ చేసిన తీర్మానాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి పంపనున్నట్లు తీర్మానించారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
11-07-2026
www.prajapaksham.in

రాష్ట్రంలో విద్యారంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఎఐడిఎస్ఓ, ఎఐఎఫ్‌డిఎస్, ఎఐఎస్‌బి, ఎఐపిఎస్‌యు సంఘాల పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు పెద్ద ఎత్తున బంద్‌లో పాల్గొన్నారు.



# తెరుచుకోని విద్యాసంస్థలు

## వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు జయప్రదం


వరంగల్...


పెద్దపల్లి...


భూపాలపల్లి...



ఖమ్మం...


మహబూబాబాద్....



రాజన్నసిరిసిల్ల...

**ప్రజాపక్షం/కరీంనగర్ :** రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలు శుక్రవారం తలపెటిన విద్యాసంస్థల బంద్ కరీంనగర్‌లో విజయవంతమయింది. జిల్లాలోని ప్రైవేట్, ప్రభుత్వ విద్యా సంస్థలు బంద్‌ను పాటించాయి. తెలంగాణ చౌక్ నుంచి బైక్ ర్యాలీతో ప్రభుత్వ విద్యాసంస్థలను బంద్‌లో భాగస్వామ్యం చేసేందుకు వెళ్తున్న ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి వామపక్ష విద్యార్థి నాయకులను పోలీసుల అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని, విద్యార్థుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజాతంత్ర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా సంస్థల బంద్ జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బందులో భాగస్వామ్యం చేయకుండా రేవంత్ రెడ్డి పోలీసులతో అణిచివేసే ప్రయత్నం చేసిన అనేకచోట్ల బందులో భాగస్వామ్యం చేశామని, రేవంత్‌రెడ్డి హోంశాఖ తన వద్దపెట్టుకుని నియంతల విద్యార్థి ఉద్యమాలను అణచివేయాలని చూస్తే కెసిఆర్‌కు పట్టిన గతే రేవంత్‌రెడ్డికి పడుతుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అన్ని విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టి ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, మహిళా విద్యార్థుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టి ప్రతి విద్యాసంస్థలో ఐసిసిసి కమిటీలను ఏర్పాటు చేయాలని, విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని, జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి–2020) అమలును నిలిపివేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని ఈ బంద్ ద్వారా డిమాండ్ చేస్తున్నమన్నారు. కార్యక్రమం లో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, వామపక్ష విద్యార్థి నాయకులు గజ్జెల శ్రీకాంత్, రామప్రతాప్, అంగడి కుమార్, గడ్డం శ్రీకాంత్, అతీకము రాజశేఖర్, మామిడిపల్లి హేమంత్, నునవాత్ శ్రీనివాస్ నాయక్, రోహిత్, సురేష్, నరేష్ , అస్లాం పాల్గొన్నారు.

**కేయూ క్యాంపస్ :** హన్మకొండ జిల్లా కేంద్రంలో వామపక్ష విద్యార్థి సంఘాలు నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ పూర్తిగా విజయవంతం అయింది. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కాకతీయ యూనివర్సిటీ ఎస్‌డిఎల్‌సిఇ జంక్షన్ నుంచి విద్యార్థులతో బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం మర్కాజి స్కూల్ సెంటర్‌లోని మెయిన్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించగా పోలీసులు వచ్చి విద్యార్థి సంఘల నాయకులను అరెస్టు చేసి బలవంతంగా హనుమకొండ స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘా ల జిల్లా బాధ్యులు భాష బోయిన సంతోష్ (ఎఐఎస్ఎఫ్), మంద శ్రీకాంత్ (ఎస్ఎఫ్ఐ), బి.నరసింహారావు(పిడిఎస్‌యు), మాస్ సావిత్రి (ఎఐఎఫ్‌డిఎస్), మర్రి మహేష్ (పిడిఎస్‌యు), రోహిత్ (ఎఐఎస్‌బి), వెంకటేష్ (ఎఐడిఎస్ఒ) మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు తెలంగాణ విద్యార్థి లోకానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి నాయకులు స్టాలిన్, ఉట్కూరి ప్రణీత్, వంగేటి మోహన్, మిస్బా, తాజుద్దీన్, సమీర్, వంశీ, కార్తీక్, మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం అర్బన్ :** వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త బంద్‌లో భాగంగా ఖమ్మం జిల్లాలో విద్యా సంస్థల బంద్ సంపూర్ణమైంది. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ అనుబంధ పిజి కళాశాల నుంచి ఇల్లందు క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మస్తాన్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు గోపి, పవన్, వెంకట్, గాంధీ, శ్రీకాంత్, లోకేష్, త్రినాథ్, సుశాంత్, శ్యామ్, భరత్, మనోజ్, మురళీ, సాధిక్, హరి, అవనిక, శ్రామిక తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ :** విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బానోత్ రఘురాం అన్నారు. వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు కేజీ టు పీజీ రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ జిల్లావ్యాప్తంగా విజయవంతమైంది.. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కర్క గణేష్, జిల్లా కార్యదర్శి కె.మనోజ్, ఎఐపిఎస్‌యు జిల్లా కార్యదర్శి బోద


కరీంనగర్...

అనిల్, అనిల్‌కుమార్, సూర్యపాల్, కిషోర్, నీరజ్, పవన్, శేఖర్, ఆజాద్, గణేష్, రాంచరణ్, రిషికేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టినటువంటి రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ సంపూర్ణంగా విజయవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి ఈర్ల రామచందర్, పిడిఎస్‌యు జార్జి రెడ్డి జిల్లా అధ్యక్షులు రత్న నరేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకు కుదించాలనే ఆలోచనను మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్నకొండ సాయి ఆజాద్, మహంకాళి శ్రీ వర్ధన్, ఆదిత్య, సాయి, అభిషేక్, గణేష్, అమరేందర్, రాహుల్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల :** రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో విద్యాసంస్థల బంద్ విజయవంతమయ్యింది. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఫీజు నియంత్ర చట్టాన్ని అమలు చేసి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుర్ర రాకేష్, ఉపాధ్యక్షులు పెండెల అధిత్య, బర్రెంకల శ్రీహరిక మరియు నాయకులు చందు, అక్షయ్, అమర్, చరణ్, కార్తీక్, మహేష్, రాజు, అనిల్, ఈశ్వర్, జానీ తదితరులు పాల్గొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమయ్యింది. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు కుర్ర రాకేష్, నాయకులు నీరిటి పూర్ణచంద్ నల్ల అక్షయ్ బందల అమర్ బోదాసు శివ బన్నీ తదితరులు పాల్గొన్నారు.

**భూపాలపల్లి :** వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ పిలుపుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభించిందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సొతుకు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో బంద్ విజయవంతంగా కొనసాగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మెట్టు అనిల్, కిరణ్, పోతుల పవన్, సాయిరాం, శివ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్ :** విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ ఆరోపించారు. శుక్రవారం షాద్‌నగర్‌లో ప్రభుత్వ అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి నాయకులు ఆకాష్ నాయక్, శివకుమార్, శ్రీను, సాయి, రాహుల్, రమేష్, ఉదయ్, వడ్ల శ్రీకాంత్, శ్రీకాంత్, నాయకులు అదిల్, చరణ్, రామ్‌చరణ్, అవేజ్, సోహెల్, అబ్బు రాజు, ప్రవీణ్, శివ పాల్గొన్నారు.

**నిర్మల్ టౌన్ :** రాష్ట్రంలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ నిర్మల్ జిల్లాలో విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కైలాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్, పిడిఎస్‌యూ అధ్యక్షులు సింగరి వెంకటేష్, జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊతమిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు నితిన్, కృష్ణ, శ్రీహరి, కార్తీక్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థుల డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం మహబూబాబాద్ జిల్లాలో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రవణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి భోనగిరి మధు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల మూసివేతను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, మరియు పిడిఎస్‌యు జిల్లా నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం :** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్ జిల్లాలో విజయవంతమైంది. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు అజిత్, నాగకృష్ణ, వీరభద్రం, ప్రణయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం రోజురోజుకీ సంక్షోభంలోకి నెట్టబడుతుందన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు నాయకులు మాణిక్యాల విజయ్, కొరిమి సంజయ్, సాయి సంతోష్, గుగులోత్ వీరభద్రం, విఘ్నేష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

**నల్లగొండ :** విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు జిల్లాలో శుక్రవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయి. జిల్లా కేంద్రంలో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మం పాటి శంకర్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి పవన్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం చేయడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. బంద్‌లో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గాదేపాక సూర్యతేజ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్,, పివైఎల్ రాష్ట్ర నాయకులు సాగర్, యం డి,సోయల్, బివి చారి, డి.సంతోష్, హరి కృష్ణ, రావుల వీరేష్, తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ...


నిజామాబాద్...


రంగారెడ్డి...షాద్‌నగర్...


నిర్మల్...



భద్రాచలం...

# ఐక్య ఉద్యమాలు

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీలు, రిటైర్డ్ ఐఎఎస్, ఐపిఎస్‌లు, ప్రజాసంఘాలు, పౌర హక్కుల నేతలు, జర్నలిస్టులు, యువజన, విద్యార్థి, మహిళా సంఘాలు, సామాజిక సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున హాజరై ముక్తకంఠంతో ప్రశ్న రావణ్‌పై ఉపా చట్టం, రాజద్రోహం కేసులు మోపడాన్ని తప్పుపట్టారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కేలా కూటమి ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడుతోందని నేతలు ధ్వజమెత్తారు. రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని వందలాదిగా ఉన్న యూట్యూబర్ల వాక్ స్వాతంత్రానికి, భావజాలానికి భంగం కలిగేలా పాలకులు వ్యవహరించడం దుర్మార్గమని తప్పుపట్టారు. ప్రతి ఒక్కరికీ భావ ప్రకటనా స్వేచ్ఛ ఉండాలనేదే తమ అభిమతమని స్పష్టం చేశారు. ఎవరైనా మితిమీరి వ్యవహరిస్తే చట్టాలు ద్వారానే ఎదుర్కోవాలనీ సూచించారు. ప్రశ్న రావణ్ వీడియోలు ద్వారా ఎవరైనా నొచ్చుకుంటే సంబంధిత సెక్షన్ల ద్వారా కేసులు పెట్టుకోవచ్చుగానీ, అలా కాకుండా ఉపా చట్టం నమోదు చేయడం దారుణమని అన్నారు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ..ప్రశ్న రావణ్‌పై ఉపా కేసు నమోదుతో భవిష్యత్తులో మరిన్ని కేసులు నమోదయ్యే ప్రమాదముందని, రాష్ట్ర ప్రజలకు భద్రత ఉండబోదని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు వ్యతిరేకంగా పోలీసులు, ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సమాజ రక్షణ కోసం మనమంతా ఐక్యం కావాలని కోరారు. రిటైర్డ్ ఐపిఎస్ అధికారి పివి సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రశ్న రావణ్‌పై పెట్టిన ఉపా చట్టం కేసు ఎఫ్ఐఆర్‌ను తాను సమగ్రంగా పరిశీలించానని, అందులో ఎక్కడా ఆ కేసుకు సంబంధించిన అంశాలు స్పష్టంగా లేవని చెప్పారు. ఇది కేవలం ఉద్దేశ్యం పూర్వకంగాను, కావాలనే రావణ్‌ను జైలుకు పంపాలనే పెట్టిన కేసేనని తేల్చిచెప్పారు. సిపిఐ జాతీయ నాయకులు డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ ప్రజలను డైవర్షన్ చేసేందుకు రావణ్‌పై రాజకీయ కుట్రలకు పాల్పడ్డారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యల్లో చిక్కుకున్నాయని చెప్పారు. రాజకీయ పదవుల్లో ఉంటూ సనాతన ధర్మాన్ని ప్రకటించుకునేదీ పవన్ కల్యాణ్ ఒక్కడేనని అన్నారు. ఇప్పుడు లోక్‌సభలో బిజెపికి మరింత బలం పెరిగిందని, ఇప్పుడు చంద్రబాబు మద్దతు లేకపోయినా మోదీకి ఒరిగేదేమీ లేదని చెప్పారు. దీంతో మోదీ మెప్పు కోసం పవన్ ఓవర్ యాక్షన్ చేస్తున్నారని, ఇవన్నీ రాజకీయ ఎత్తుగడలేనని అన్నారు. పవన్ కళ్యాణ్ ప్రసంగాన్నే ప్రశ్న రావణ్ అనుకరించారనీ...కానీ పవన్‌లా ప్రశ్న రావణ్ చెప్పు చూపించలేదన్నారు. దీంతో ముందస్తుగా పవన్‌పైనే కేసు పెట్టాలన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపి పి.మధు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల్ని పక్కదారి పట్టించేందుకు ఉపా చట్టం కింద ప్రశ్న రావణ్‌ను జైలుకు పంపడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, వైసిపి సీనియర్ నేత అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రశ్న రావణ్‌పై ఉపా చట్టం కేసు నమోదు అన్యాయం, అక్రమం, దారుణమని ఖండించారు. ఈ కేసు ముగిసేవరకు వైసీపీ పక్షాన ప్రశ్న రావణ్‌కు అండగా నిలుస్తామని, విపక్షాలు చేసే ఉద్యమంలో భాగస్వాములవుతామని స్పష్టం చేశారు. ఈ కేసు పెట్టిన తర్వాత ఇప్పుడు రావణ్ ఇంట్లో సోదాలు చేశారని, ఆయన సెల్‌ఫోన్లో భయంకర విషయాలు బయటపడ్డాయని, నక్సలైట్లతో సంబంధాలు ఉన్నాయంటూ దుష్ప్రచారం చేస్తున్నారని తప్పుపట్టారు. అధ్యక్షత వహించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రశ్న రావణ్‌పై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేకపోతే విపక్షాలతో కలిపి భారీ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. ప్రజల తరపున ప్రశ్నించే వారిని అణచివేయడానికి ఉపా వంటి నిర్బంధ చట్టాలను దుర్వినియోగం చేయడం ప్రజాస్వామ్యంపై కొనసాగుతున్న దాడికి నిదర్శనమని అన్నారు. ప్రశ్న రావణ్‌కు బెయిల్ వచ్చిన వెంటనే పదేపదే అరెస్టులకు పాల్పడుతూ రావణ్‌ను పోలీస్‌స్టేషన్లు, కోర్టులు, జైళ్ల చుట్టూ తిప్పారన్నారు. ఆ సమయంలో జనసేన, ఆరెస్సెస్ కార్యకర్తలు పోలీస్‌స్టేషన్ల గోడలు దూకి, పోలీసులను తోసేసి రావణ్‌పై దాడికి ప్రయత్నించడం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికైనా ప్రశ్న రావణ్‌పై నమోదు చేసిన ఉపా చట్టాన్ని ఉపసంహరించడంతోపాటు ఆ చట్టాన్నే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17వ తేదీలోపు రావణ్‌పై ఉపా చట్టాన్ని ఉపసంహరించుకోకపోతే ఆ తదుపరి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు ప్రసాద్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బి. రామకష్ణ, సిపిఐ(ఎంఎల్) ఎంఎల్ లిబరేషన్ నాయకులు డి.హరినాథ్, ఎస్‌యుసిఐ నాయకులు అమర్‌నాథ్, ఎంసిపిఐ(యూ) నాయకులు ఖాదర్ భాషా తదితరులు పాల్గొన్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com